
శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


మళ్లీ అవే వివాదాస్పద వ్యాఖ్యలు

అందరూ ఇంట్లో కూర్చొని ఓటు వేద్దామనుకుంటారు : సుప్రీంకోర్టు

కేజ్రీవాల్‌ను బెదిరిస్తూ ఢిల్లీ మెట్రోలో రాతలు

లోపలి పేజీల్లో...

మంగళవారం | 21-05-2024 | కరీంనగర్ | సంపుటి 07, సంచిక: 170 | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## హెలికాప్టర్ ప్రమాదంలో
# ఇరాన్ అధ్యక్షుడు రైసీ మృతి



టెహ్రాన్: ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. హెలికాప్టర్ శకలాలు లభ్యమైన తర్వాత.. అధ్యక్షుడు మృతి చెందినట్టు ఇరాన్ అధికారికంగా ధ్రువీకరించింది.63 ఏళ్ల రైసీ ఇరాన్ 8వ అధ్యక్షుడు, ఆయన ప్రయాణిస్తున్న హెలకాప్టర్ ఆదివారం హార్డ్ ల్యాండ్ అయినట్టు తొలుత వార్తలు వచ్చాయి. అయితే, దట్టమైన పొగమంచి కమ్ముకున్న నేపథ్యంలో, హెలికాప్టర్‌ను గుర్తించలేకపోయారు. ఈజిప్టు డ్రోన్ ఈ ప్రాంతాన్ని తొలుత కనిపెట్టింది. అందులో ప్రయాణిస్తున్న వారిలో ఎవరూ ప్రాణాలతో మిగిలి ఉండకపోవచ్చన్న అనుమానం వ్యక్తం చేసింది. ఆ తర్వాత ఇరాన్ అధికారిక మీడియా 'ఇర్నా' ఈ విషయాన్ని ప్రకటించింది. ఇరాన్, అజర్‌బైజాన్ దేశాల మధ్య సంయుక్త ప్రాజెక్టు అయిన కిజ్‌ఖలాసి ఆనకట్టను ప్రారంభించడానికి రైసీ ఆదివారం అజర్ బైజాన్ సరిహద్దుకు వెళ్లారు. అక్కడి నుంచి బెల్ 212 హెలికాప్టర్‌లో ఆయన తిరుగు ప్రయాణమయ్యారు. కానీ.. లోయలు, పర్వత ప్రాంతాలు ఉండే జోఫ్లా నగరంలో ఆ హెలికాప్టర్ 'హార్డ్ ల్యాండింగ్' అయ్యింది. తూర్పు అజర్ బైజాన్ ప్రావిన్స్‌లోని ఈ ప్రాంతంలో హెలికాప్టర్ కూలిన ప్రదేశంలో శిథిలాలను చేరుకోవడానికి సహాయక బృందాలు శ్రమించాయి. రాత్రంతా మంచు తుపానుతోపాటు, క్లిష్టమైన భూప్రాంతంలో వారి గాలింపు చర్యలు కొనసాగాయి. ఈ ప్రమాదంలో రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ పూర్తిగా దగ్ధమైందని, దురదృష్టవశాత్తు ప్రయాణికులంతా మరణించారని ఇరాన్ మీడియా తెలిపింది. 2021లో ఇరాన్ అధ్యక్షుడిగా ఎన్నికైన రైసీ, అధికారం చేపట్టినప్పటి నుంచి నైతిక చట్టాలను కఠినతరం చేయాలని, ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను అణచివేయాలని, తరువాయి 2లో

## హెలికాప్టర్‌లో తొమ్మిది మంది

ప్రమాదానికి గురైన హెలికాప్టర్‌లో ఇరాన్ అధ్యక్షుడు రైసీతోసహా మొత్తం తొమ్మిది మంది ఉన్నట్టు 'ఇర్నా' ప్రకటించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీర్ అబ్దోల్లాహియాన్; తూర్పు అజ్బజాన్ ప్రావిన్స్ గవర్నర్ మాలెక్ రహ్మతి, తబ్రీజ్ శుక్రవారం ప్రార్థన ఇమామ్ మొహమ్మద్ అలీ అలెహాషెమ్‌తోపాటు పైలట్, కోపైలట్, క్రూ చీఫ్, సెక్యూరిటీ హెడ్, మరొక అంగరక్షకుడు ఉన్నట్ట ఒక ప్రకటనలో వివరించింది.

## ఉపాధ్యక్షుడు ముఖ్‌బర్‌కు బాధ్యతలు

ఇరాన్ అధ్యక్షుడు రైసీ హెలికాప్టర్ దుర్ఘటనలో మృతి చెందినట్టు ధ్రువీకరించుకున్న తర్వాత, ఆయన స్థానంలో ఇరాన్ మొదటి వైస్ ప్రెసిడెంట మహమ్మద్ మొఖ్‌బర్‌ను నియమించినట్టు అధికారిక ప్రకటన వెలువడింది. ఆయన తాత్కాలిక అధ్యక్షుడిగా వ్యవహరిస్తాడని ఆ ప్రకటన పేర్కొం ది. 68 ఏళ్ల ముఖ్‌బర్ ఈ పదవిలో 50 రోజులు కొనసాగుతారు. ఇరాన్ నిబంధనల ప్రకారం, ఆలోగా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలి. ముఖ్‌బర్ నియామకాన్ని ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతుల్లా కలీ ఖమేనీ ఒక సందేశంలో ధ్రువీకరించారు. కాగా, ఎంతోకాలంగా రైసీ నీడలోనే ఉన్న ముఖ్‌బర్‌కు గొప్ప పాలనా దక్షుడిగా మంచి పేరు ఉంది. బోన్యాడ్లు లేదా స్వచ్ఛంద సంస్థలలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇరాన్ 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత స్వాధీనం చేసుకున్న విరాళాలు, ఆస్తుల ద్వారా ఆ సమూహాలు బలపడ్డాయి. ప్రభుత్వాధికారులతో సంబంధాలు మెరిగాయి. అలాంటి బలమైన నేపథ్యం ఉండడంతో, ముఖ్‌బర్ దేశ ఫస్ట్ వైస్‌ప్రెసిడెంట్ స్థాయికి ఎదగగలిగారు.





# ఐదో విడత ప్రశాంతం

## ఇప్పటి వరకు 428 స్థానాలకు ఎన్నికలు

**ఓటింగ్ శాతం**

| రాష్ట్రం/యుటి | ఓటింగ్ శాతం |
|---|---|
| బిహార్ | 52.60 |
| జార్ఖండ్ | 54.46 |
| లద్దాఖ్ | 67.15 |
| మహారాష్ట్ర | 48.88 |
| ఒడిషా | 60.72 |
| ఉత్తర్‌ప్రదేశ్ | 57.79 |
| పశ్చిమబెంగాల్ | 73 |
| మొత్తం | 57.47 |

(రాత్రి 7:45 గంటల వరకు)





ఢిల్లీ : దేశవ్యాప్తంగా చెదురుమదురు ఘటనలు మినహా సోమవారం నాడు లోక్‌సభ ఎన్నికల ఐదవ దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 8 గంటల ప్రాంతానికి 57.47 శాతం ఓటింగ్ నమోదైంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఆరంబాగ్, బారక్‌పూర్, బన్‌గావ్ నియోకజవర్గాలలోని కొన్ని ప్రాంతాలలో టిఎంసి, బిజెపి కార్యకర్తలు కొట్టుకున్నారు. ఒక చోట రెండు నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, కేంద్ర బలగాలు పరిస్థితిని అదుపు చేసి పోలింగ్ కొనసాగించారు. మహారాష్ట్రలో తమ పార్టీకి అత్యధికంగా ఓట్లు పడే ప్రాంతాలలో కావాలనే ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభించారని మహారాష్ట్ర మాజీ సిఎం ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం లోజమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా లోక్‌సభ నియోజకవర్గంలో 35 ఏళ్ళలో తరువాయి 2లో

## ముంబయిలో ఓటేసిన సినీ, రాజకీయ ప్రముఖులు

మహారాష్ట్రలో వివిధ రంగాల ప్రముఖులు ఉత్సాహంగా ఓటు వేశారు. సిఎం ఏక్‌నాథ్ షిండే, శివసేన నేతలు ఉద్ధవ్‌ఠాక్రే, వ్యాపారవేత్తలు రతన్ టాటా, ముకేష్ అంబానీ, అనిల్ అంబానీ తదితరులు కుటుంబాలతో కలిసి ఓటు వేశారు. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్, హాకీ ఇండియా చీఫ్ దిలీప్ టిర్కీ ఓటు వేశారు. క్రికెటర్ సచిన్ టెండూల్కర్, కుమారుడితో కలిసి, అజింక్య రహానే భార్యతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నటులు అమితాబ్ బచ్చన్, జాన్వీ కపూర్, దర్శకుడు జోయా అక్తర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రకుల్ ప్రీత్ సింగ్, జాకీ బాగ్నానీ, సంజయ్ దత్, మనోజ్ బాజ్‌పేయ్, అనిల్ కపూర్, హేమా మాలిని తదితరులు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకుని, ఓటు ఆవశ్యకతను వివరించారు. నాసిక్‌లో స్వతంత్ర అభ్యర్థి శాంతిగిరి మహారాజ్ పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన తర్వాత ఓటింగ్ యంత్రానికి పూలమాల వేశారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతు

ప్రజాపక్షం / హైదరాబాద్

ఖమ్మం, నల్లగొండ, వరంగల్ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కు సిపిఐ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సోమవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, సిపిఐ తెలంగాణ రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూడా కూటమిగా పోటీ చేశాయని గుర్తు చేశారు. అలాగే మతోన్మాద బిజెపిని ఓడించేందుకు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు సిపిఐ మద్దతు ప్రకటించిందని తెలిపారు. శాసన మండలి ఉప ఎన్నికలో మద్దతును ఇవ్వాలని కాంగ్రెస్ చేసిన విజ్ఞప్తిపై పార్టీలో చర్చించి, కాంగ్రెస్ అభ్యర్థిని సమర్థించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ విజయం కోసం సిపిఐ శ్రేణులు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు కృషి చేయాలని కూనంనేని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో మూడు రోజులు వర్షాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాగల మూడు రోజుల పాటు రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈనెల 22వ తేదీ నాటికి ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇది వాయువ్య దశలో కదిలి ఈ నెల 24 నాటికి మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండగా బలపడే అవకాశం ఉందన్నారు. ఉపరితల ఆవర్తనం సోమవారం దక్షిణ కోస్తా, తమిళనాడు పరిసర ప్రాంతాల మీదుగా సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తుకు విస్తరించిందన్నారు. ఎత్తుకు వెళ్లేకొద్ది నైరుతి దిశగా వంగి ఉందన్నారు. మరో ద్రోణి దక్షిణ కోస్తా, తమిళనాడు మీదుగా ఉపరితల ఆవర్తనం ఇంటీరియర్ కర్ణాటక వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల కొనసాగుతుందని వివరించారు. ఈ నెల 22 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో సోమవారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. మంగళవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. 22న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్ల బాధ్యత
# కలెక్టర్లకు అప్పగింత

**రాష్ట్ర కేబినేట్ నిర్ణయం**

జూన్ 2న ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

సోనియాగాంధీకి ఆహ్వానం



ప్రజాపక్షం / హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్లపై పూర్తి బాధ్యత కలెక్టర్లకే అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రైతులకు నష్టం జరగకుండా చివరి గింజ వరకూ కొనాలని సిఎం ఆదేశించారు. రైతులకు బోనస్‌పై స్పష్టతనిస్తూ ఈ సీజన్ నుంచి సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మూడు గంటలకు పైగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే సేకరించాలని నిర్ణయించారు. ఎంఎస్‌పి కంటే ఒక్క రూపాయి కూడా తక్కువ చెల్లించకూడదని నిర్ణయించారు. రాష్ట్రానికి అవసరమైన సన్న బియ్యం అంతా రాష్ట్రంలోనే సేకరించాలని, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. నకిలీ విత్తనాల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు రూ.600 కోట్లు కేటాయించింది. అమ్మ ఆదర్శ తరువాయి 2లో

**తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను జూన్ 2న ఘనంగా నిర్వహించాలని, ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ఆహ్వానించాలని తెలంగాణ మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. వేడుకల నిర్వహణకు అనుమతి కోసం కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని మంత్రివర్గం తీర్మానించింది.**



## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

19 మంది మృతి, ఎనిమిది మందికి గాయాలు

ప్రజాపక్షం/ ఖమ్మం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కవర్ధా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం తునికాకు సేకరణకు వెళ్లి గిరిజనులు 40 మంది ఒక వాహనంలో తిరిగి వస్తుండగా కుక్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహ్పని గ్రామ సమీపంలో వారు ప్రయాణిస్తున్న వాహనం లోయలో పడిపోయింది. అదుపు తప్పి వాహనం 20 అడుగల లోయలో పడడంతో 19 మంది మృతి చెందారు. ఇందులో డ్రైవర్ మరో వ్యక్తి మరణించగా మిగిలిన 17 మంది మహిళలే కావడం శోచనీయం. ఎనిమిది మందికి తీవ్ర తరువాయి 2లో

## ప్రభుత్వ వైద్య కళాశాలలో
# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల అమ్మకాలు?

అర్హులైన వారికి మొండిచేయి

కలెక్టర్ నేరుగా నియామకాలు చేపట్టాలి

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి




జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో 32 ఔట్‌సోర్సింగ్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే..డి సెక్షన్ సంబంధించిన అటెండర్స్(4),స్టోర్ కీపర్స్,కప్యూటర్ ఆపరేటర్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్స్10),ఆఫీస్ సబార్డినేటర్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్స్(10), ఆఫీస్ సబార్డినేట్స్(8), ల్యాబ్ అటెండర్స్ (4), రికార్డ్ అసిస్టెంట్లు(4) పోస్టులను అంగట్లో బేరాలు ఆడుతూ అర్హులైన వారికి మొండి చేయి చూపే విధంగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతుదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.ఒక్కో పోస్టుకు 3 లక్షల నుండి 5 లక్షల వరకు బేరమాడుతున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. గతంలో మునిసిపాలిటీ అవుట్సోర్సింగ్‌లో జరిగిన అక్రమాలే ఈ సారి కూడా వైద్య కళాశాలలో సైతం జరుగుతున్నాయని, కలెక్టర్ దృష్టిసారించి నేరుగా ఎంపిక చేసే విధంగా చూడాల్సిన అవసరం ఉందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఓ పత్రికకు మాత్రమే నోటిఫికేషన్ ప్రకటన ఇవ్వడం పట్ల పలు అనుమానాలకు ఆజ్యం పోస్తుంది. ఇప్పటికే కొందరు నిరుద్యోగులు పైరవీ కారులను ఆశ్రయించి నష్టపోతున్న విషయం తెలిసిందే. అందిన తరువాయి 8లో

## గగన్‌దీప్‌సింగ్‌ను హత్య చేసిన
# దోషులను శిక్షించాలి

ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్... ఓయు ఆర్ట్స్ కళాశాల వద్ద ఘననివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్



ఎఐఎస్‌ఎఫ్ రాజస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు గగన్‌దీప్ సింగ్‌ను హత్య చేసిన దోషులను శిక్షించాలని రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. గగన్ దీప్ సింగ్‌పై దాడి చేసి 19 రోజులు అవుతున్నా ఇంతవరకు నిందితులను రాజస్థాన్ పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడం గర్హనీయమని పేర్కొంది. గగన్‌దీప్ సింగ్ హత్యను నిరసిస్తూ ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ గగన్‌దీప్ సింగ్‌పై దాడి జరిగి 20 రోజులు కావస్తున్నా, రాజస్థాన్ పోలీసులు నిందితులను ఇంకా అరెస్టు చేయలేదన్నారు. గగన్ దీప్ సింగ్ ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడుగా కొనసాగుతూ గత కొన్ని నెలల కింద తరువాయి 8లో

## ఖాతాదారులకు
# రూ.200 కోట్లు కుచ్చుటోపీ

బిచాణా ఎత్తివేసిన శ్రీప్రియాంక ఎంటర్ ప్రైజెస్

సూత్రధారి అపెక్స్ బ్యాంక్ జిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్



అధిక వడ్డీకి ఆశపడిన ఖాతాదారులు నిలువున మునిగిపోయారు. ఖాతాదారులకు రూ.200 కోట్లు కుచ్చుటోపి పెట్టిన ఆబిడ్స్‌లోని శ్రీప్రియాంక ఎంటర్ ప్రైజెస్ బిచాణా ఎత్తి వేసింది. ఈ విషయం తెలుసుకున్న ఖాతాదారులు లబోదిబోమన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. తమ సంస్థలో డిపాజిట్లు పెడితే అధిక వడ్డీలు ఇస్తామని ఆబిడ్స్‌లో శ్రీప్రియాంక ఎంటర్ ప్రైజెస్ అనే సంస్థ ప్రతినిధులు నమ్మించారు. అందమైన ఓచర్లను ముద్రించి ఖాతాదారులను ఆకర్షించారు. అధిక వడ్డీలకు ఆశపడిన 517 మంది ఖాతాదారులు ఒక్కోక్కరు రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు ఆ సంస్థలో డిపాజిట్లు పెట్టారు. మొదటి నాలుగు నెలల వరకు అధిక వడ్డీలు సంస్థ ఖాతాదారులకు చెల్లించడంతో సంస్థపై ఖాతాదారులకు మరింత నమ్మకం ఏర్పడింది. దీంతో తరువాయి 8లో

# డొమినికన్ రిపబ్లిక్ అధ్యక్షుడుగా లూయిస్ అబినదర్ తిరిగి ఎన్నిక



**శాంటో డొమింగో :** కరీబియన్ సముద్రంలో ఉన్న డొమినికన్ రిపబ్లిక్ అధ్యక్షుడుగా లూయిస్ అబినదర్(56) రెండోసారి ఎన్నికయ్యారు. ఆదివారంనాడు జరిగిన ఓటింగ్ ప్రక్రియలో అబిందర్‌కు 58.85 శాతం ఓట్లు లభించాయి. మూడుసార్లు దేశాధ్యక్షుడుగా పనిచేసి ఈసారి ఎన్నికల్లోమళ్ళీ బరిలో నిలిచిన లియోనిల్ ఫెర్నాండెజ్‌కు 27.29 శాతం ఓట్లు లభించాయి. దాంతో ఆయన రెండో స్థానంలో నిలిచారు. మొత్తం 56 శాతం సెంటర్లనుండి ఈ ప్రాధమిక సమాచారం లభించింది. దేశ ఐక్యత, నిష్పక్షపాతంతో కూడిన పరిపాలనే తన లక్ష్యమని రెండోసారి అధ్యక్షుడుగా ఎన్నికైన అబినదర్ తన సందేశంలో ప్రజలకు చెప్పారు. రనాఫ్‌ను తప్పించుకోవాలంటే 50 శాతం ఓట్లు లభిస్తే సరిపోతుంది. ఈ లెక్కన చూస్తే అబినదర్‌కు అంతకంటే ఎక్కువగా 56 శాతం ఓట్లు రావడంతో ఆయన గెలుపు ఖాయమైపోయింది. తన మోడ్రన్ రివల్యూషనరీ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద విజయం అనంతరం గుమిగూడిన ప్రజలతో ఆయన తన సంతోషాన్ని పంచుకున్నారు. దేశ ప్రజలందరికీ తాను అధ్యక్షుడుగా వ్యవహరిస్తానన్నారు. ఈనాడు డొమినికన్ రిపబ్లిక్ దేశం తనదైన ప్రతిభతో ఒక నక్షత్రంలా ప్రపంచదేశాలమధ్య వెలిగిపోతోందని ఈ సందర్భంగా అబినదర్ అన్నారు. పార్టీ జెండాలకు అతీతంగా, వివక్షకు తావులేకుండా దేశంలో ప్రజలందరికీ సుపరిపాలన అందిస్తానని ఆయన అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన అబినదర్‌కు మెక్సికో విదేశీమంత్రిత్వశాఖ అభినందనలు తెలియజేసింది. ప్యూర్టోరికో మాజీ గవర్నర్, అంతర్జాతీయ పరిశీలకుడు లూయిస్ ఫోర్చినో మాట్లాడుతూ, ఆదివారం జరిగిన ఓటింగ్ సందర్భంగా, దేశంలోని ఓటర్లు ఈ ఎన్నికల ప్రక్రియపట్ల సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. కరీబియన్ ప్రాంతం గ్రేటర్ అటిల్లెస్ ద్వీప సమూహంలోని హిస్పానియోలా ద్వీపంలో ఉన్న దేశం డొమినికన్ రిపబ్లిక్. దీంతోపాటు హైతీ దేశం కూడా రెండు భాగాలుగా ఈ ద్వీప భూభాగాన్ని పంచుకుంటున్నాయి. మంచినీటి సరస్సులు, విభిన్నమైన జీవరాసులున్న ఈ దేశం గత ఏడాదిలో ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం ఐదూశాతం ఆర్థికవృద్ధిని సాధించింది. అతి తక్కువ సమయంలోనే పర్యాటకరంగంలో అభివృద్ధిని సాధించింది.

## లండన్ కోర్టులో జూలియన్ అస్సాంజ్‌కు ఊరట



**లండన్ :** వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అస్సాంజ్‌కు (52) లండన్ హైకోర్టులో సోమవారం ఊరట లభించింది. తనను అమెరికాకు తరలించి విచారణ జరపించే విషయంలో అప్పీలు చేసుకునే మానవహక్కులు ఉన్నాయని కోర్టు పేర్కొంటూ ఆయనకు ఒక అవకాశం ఇచ్చింది. అస్సాంజ్ తన మీడియా వ్యవస్థ ద్వారా అనేక రహస్య పత్రాలను లీక్ చేసి ప్రసంశలతోపాటు జర్నలిస్టులు, ఇతర ప్రముఖుల విమర్శలకు కూడా గురయ్యారు. అదేసమయంలో ఆమెరికా సైనిక రహస్య పత్రాలు, మిలిటరీ రికార్డులు బయటకు పొక్కేట్టు చేశారన్న ఆరోపణలపై ఆస్ట్రేలియా జాతీయుడైన అస్సాంజ్‌ను అమెరికాకు తరలించి విచారణ జరిపించే విషయంపై భయాందోళనల నెలకున్నాయి. ఆయనకు మరణశిక్ష పడుతుందని ఆయన న్యాయవాదులు, ఆయన భార్య స్టెల్లా అస్సాంజ్ కూడా ఆందోళన చెందుతున్న తరుణంలో లండన్ హైకోర్టులో ఆయనకు అప్పీలు చేసుకునేందుకు అవకాశం లభించింది. ప్రస్తుతం ఆస్సాంజ్ దక్షిణ లండన్ జైలులో ఉన్నారు. అస్సాంజ్‌ను 18 రకాల ఆరోపణలపై విచారణ చేసేందుకు వీలుగా అస్సాంజ్‌ను అమెరికాకు తరలించే విషయంపై లండన్ కోర్టులో విచారణ జరుగుతున్నది. అస్సాంజ్‌కు అప్పీలు చేసుకునే హక్కును నిలిపివేయాలని అమెరికా తరపు న్యాయవాదులు లండన్ కోర్టును కోరారు.

# నాలుగోసారి విశ్వాస పరీక్షలో గెలిచిన ప్రచండ



**కాఠ్మండు :** నేపాల్ ప్రధానమంత్రి పుష్పకమల్ దహల్ (ప్రచండ) మరోసారి విశ్వాస పరీక్షలో గెలిచారు.గడచిన 18 నెలల్లో ఇప్పటివరకూ నాలుగుసార్లు ఆయన ప్రభుత్వం ఒడిదుడుకుల్లో పడటంతో ప్రతిసారీ ఆయన విశ్వాస పరీక్షలో గెలుస్తూ వచ్చారు. తాజాగా సోమవారం నేపాల్ పార్లమెంటులో జరిగిన బలపరీక్షలో కూడా ఆయన తన సత్తా చాటుకుని సంకీర్ణ ప్రభుత్వ నిర్వహణలో ఆరితేరిన వ్యూహకర్తగా, దేశంలో తిరుగులేని నాయకుడనిపించుకున్నారు. 275 మంది సభ్యులు ఉన్న దిగువసభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో 157 సభ్యులు పుష్పకమల్ దహల్ ప్రభుత్వానికి మద్దతు తెలియజేశారు. పుష్పకమల్ దహల్ ప్రభుత్వానికి 138 మంది సభ్యుల మద్దతు ఉంటే సరిపోతుంది. కానీ ఆయనకు అదనంగా మరో 19 మంది ఎంపీలు కూడా మద్దతు ఇచ్చారు. గడచిన ఎన్నికల్లో గెలిచాక ప్రచండకు అండగా ఉన్న నేపాలీ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఆయనకు ఎదురు తిరిగింది. సభలో నేపాలీ కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శనలు చేశారు. వారు ఈ ఓటింగ్‌లో పాల్గొనలేదు. సభలో విశ్వాసపరీక్షకు సంబంధిచిన ప్రక్రియ ప్రారంభం అవుతుందని స్పీకర్ దేవరాజ్ ఘిమిర్ ప్రకటించగానే, నేపాలీ కాంగ్రెస్ సభ్యులంతా సభామధ్య ప్రదేశంలోకి చేరుకున్నారు. నిరసన ప్రదర్శన ప్రారంభించారు. కో–ఆపరేటివ్ అవినీతిలో భాగస్వామిగాఉన్న ఉప ప్రధానమంత్రి, హోమ్‌మంత్రి రవి లామించాన్ అక్రమాలపై దర్యాప్తు జరపాలని వారు డిమాండ్ చేశారు. మే 5వ తేదీన అధికార కూటమిలో విభజన రావడంతో జనతా సమాజ్‌వాదీపార్టీ, నేపాల్ మద్దతు ఉపసంహరించుకుంది దాంతో నేపాల్ రాజ్యాంగంలో 100 (2) అధికరణకు అనుగుణంగా పుష్పకమల్ దహల్ సభలో మరోసారి తన బలాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం వచ్చింది. 2022 డిసెంబరులో సిపిఎన్–యుఎంఎల్ పార్టీ మద్దతుతో ఆయన ప్రధానమంత్రి పదవి చేపట్టిన తర్వాత మొదటిసారి 2023 జనవరి 10వ తేదీన జరిగిన బలపరీక్షలో ఆయనకు 268 మంది మద్దతు లభించింది. రెండోసారి 2023 మార్చి 20న జరిగిన బలపరీక్షలో 172 మంది మద్దతు లభించింది. మూడోసారి 2024 మార్చి 13వ తేదీన జరిగిన బలపరీలో 157 మంది సభ్యుల మద్దతు లభించింది. ఆనాడు 268 మంది సభకు హాజరయ్యారు. ఇప్పుడు నాలుగోసారి కూడా ఆయనకు 157 మంది సభ్యుల మద్దతు లభించింది. మంగళవారం ఉదయం 11 గంటలకు పార్లమెంటు తిరిగి సమావేశం అవుతుంది.

ప్రపంచం

# నేతన్యాహూకు అరెస్టు వారెంటివ్వాల్సిందే

## ఐసిజె కోర్టు ప్రాసిక్యూటర్



**హేగ్ :** గాజాలో అమానుషమైన, ఈ శతాబ్దలు మానవ హననానికి పాల్పడిన ఇజ్రాయిల్ ప్రధానమంత్రి జూలియస్ అసాంజ్‌కు అరెస్టు వారెంట్ ఇవ్వాల్సిందేనని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు చీఫ్ ప్రాసిక్యూటర్ కరీమ్ ఖాన్ అన్నారు. డచ్ రాజధాని ప్రాంతంలోని ది హేగ్ లో గాజాలో అమానుషాలపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో విచారణ జరుగుతున్నది. నేతన్యాహూతోపాటు మరో ముగ్గురు హమాస్ నాయకులు కూడా ఈ అరెస్టు వారెంటుకు పూర్తి అర్హులని, ఇందుకు తగినన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయని కరీమ్ ఖాన్ అన్నారు. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు ప్రాసిక్యూటర్ జాబితాలో ఇజ్రాయిల్ రక్షణమంత్రి యోవ్ గాలంట్, హమాస్ నాయకుడు మహ్మద్ డైఫ్, ఇస్మాయిల్ హనియేఫ్‌ల పేర్లు కూడా ఉన్నారు.గత ఏడాది అక్టోబరు 7వ తేదీ నుండి ఇప్పటివరకూ అటు ఇజ్రాయిల్‌లో, ఇటు గాజా, రఫా ప్రాంతాలలో దారుణ మారణకాండ కొనసాగడానికి వీరు ప్రధాన కారకులుగాఉనన్నారనీ, వీరికి అరెస్టు వారెంటులు ఇవ్వడానికి పూర్తి అర్హులని కరీమ్ ఖాన్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ సైన్యం దాడుల కారణంగా గడచిన 15 రోజులలుగా రఫా ప్రాంతం నుండి ఎనిమిది లక్షల మంద ప్రజలు ప్రాణాలు అరచేతిలో పట్టుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోయారు. రఫాలో దారుణ మానవహక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆయన విమర్శించారు. ఇప్పటివరకూ ఎనిమిది నెలలుగా 35,500 మంది పైగా పాలస్తినా ప్రజలు ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో మరణించారు. కాగా గాజా ప్రాంతంలో అమలు చేయడానికి వీలుగా ఈ యుద్ధానికి భవిష్యత్ రాజకీయ వ్యూహాన్ని జోడించాలని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహూకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జాతీయ భద్రతా సలహాదారు జాక్ సుల్లెవాన్ సలహా ఇచ్చారు. సౌదీ రాజు ప్రిన్స్ మహ్మద్‌తో చర్చల సందర్భంగా ఆయన ఈ సూచన చేశారు.

## జూన్ 2న మెక్సికోలో సార్వత్రిక ఎన్నికలు

# వామపక్ష కూటమి మహిళా అభ్యర్థి షెయిన్ బామ్





**మెక్సికో సిటీ :** మెక్సికోలో జూన్ రెండవ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో మెక్సికో చరిత్రలో మొదటిసారి ఇద్దరు మహిళలు దేశాధ్యక్ష పదవికోసం పోటీ పడుతున్నారు. ఒక జాతీయపార్టీతో పాటు వివిధ పార్టీలతో కూడిన వామపక్ష కూటమితో పాటు మరో మూడు పార్టీల కూటమి కూడా పోటీ పడుతున్నది. ఆరేళ్ళపాటు అధికారంలో కొనసాగే అధ్యక్షపదవికి ఎన్నికలతోపాటు 500 మంది సభ్యులు గల ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌కు, 128 మంది సభ్యులు గల సెనేట్ ఆఫ్ రిపబ్లిక్‌కు కూడా ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుత దేశాధ్యక్షుడు ఆండ్రూస్ లోపెజ్ అబ్రెడార్ తిరిగి ఎన్నికల్లో పోటీ చేసేందుకు మెక్సికో రాజ్యాంగం ప్రకారం అనర్హులు. అబ్రెడార్ పార్టీ "మోరెనా" (జాతీయపునరుజ్జీవనోద్యమ పార్టీ) తరపున క్లాడియా షెయిన్ బామ్ ఈసారి పోటీ చేస్తున్నారు. 2024 మెక్సికో సార్వత్రిక ఎన్నికలకుగాను ఏర్పడిన వామపక్ష కూటమి "సిగమోస్ హసియాండో హిస్టీరియా" కు సహజంగానే అంగీకృత అధ్యక్ష అభ్యర్థిగా షెయిన్ బామ్ పార్డో ఎంపికయ్యారు. ఈ కూటమిలో ఇంకా లేబర్ పార్టీ, ఎకొలోజిస్ట్ గ్రీన్ పార్టీ ఆఫ్ మెక్సికో కూడా సభ్యులుగా ఉన్నాయి. క్లాడియా మెక్సికో రాజకీయవేత్త మాత్రమేకాదు, సైంటిస్టు విద్యావేత్త. 2018 నుండి 2023 వరకూ రాష్ట్ర గవర్నర్ పదవితో సమానమైన మెక్సికో సిటీ అధినేత్రిగా పదవీ బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు. అదేవిధంగా మరో మూడు పార్టీలు కలిసి ఏర్పాటు చేసిన ఫ్యూయెర్జా కొరజాన్ పోర్ మెక్సికో కూటమి అధ్యక్ష అభ్యర్థిగా జ్యోచిట్ గాల్వెజ్ పోటీ చేస్తున్నారు. నేషనల్ యాక్షన్ పార్టీ, ఇనిస్టిట్యూషనల్ రివల్యూషనరీ పార్టీ, పార్టీ ఆఫ్ డెమోక్రటిక్ రివల్యూషన్ మూడు ఈ కూటమిలో సభ్యులుగా ఉన్నాయి. ఇక ఎలాంటి కూటమి లేకుండా పోటీ చేస్తున్న జాతీయ పార్టీ సిటిజెన్స్ మూమెంట్ తరపున జోర్జ్ మేనెర్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నారు. ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌లో ఉన్న 500 స్థానాలకుగాను 300 స్థానాలకు సింగిల్ మెంబర్లు ఎన్నిక అవుతారు. మిగిలిన 200 స్థానాలకు భాగస్వామ్య ప్రాతినిధ్యం కింద ఐదు జిల్లాల నుండి బహుముఖ సభ్యులుఎన్నిక అవుతారు. సెనేట్‌కు కూడా 32 మంది జాతీయ నియోజకవర్గాల నుండిఎన్నిక అవుతారు. మిగిలిన 96 మంది సభ్యులూ రాష్ట్రాల నుండి భాగస్వామ్య ప్రాతినిధ్యం కింద ఎన్నిక అవుతారు. మూడు సీట్లు ఉండే నియోజకవర్గాలలో అత్యధికంగా ఓట్లు వచ్చిన పార్టీలకు రెండు సీట్లు లభిస్తాయి. రెండోస్థానంలోఉన్నపార్టీకి ఒకొక్క సీటు దక్కుతుంది.

# తక్షణం సైనిక బెదిరింపులు ఆపండి

## చైనాకు తైవాన్ కొత్త అధ్యక్షుడు లీ విజ్ఞప్తి



**తైపే :** తైవాన్ దేశాధ్యక్షుడుగా లీ ఛింగ్ తే (64) సోమవారం నాడు ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్ష భవనం వద్ద వేలాది మంది ప్రజలు ఈ ప్రమాణ స్వీకారం తిలకించేందుకు వచ్చారు. 12 దేశాలకు చెందిన ప్రతినిధులు, రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైన్యం కళ్ళు మిరుమిట్లు గొలిపేలా విన్యాసాలు చేసింది. ఎనిమిది సంవత్సరాలు దేశాన్ని పాలించిన సై ఇంగ్ వెన్ నుండి అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నారు. సార్వత్రిక ఆరోగ్య రక్షణ, ఉన్నతవిద్యా సదుపాయాలు, మైనారిటీలకు పూర్తి మద్దకతు, స్వలింగ సంపర్కులకు వివాహాలు చేయడంలో ఆసియాలోనే ప్రథమస్థానంలో ఉండటం వంటి అంశాలకు తాను ప్రాధాన్యం ఇస్తానని దేశ రాజధానిఇ తైపేలో దేశాధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలి ప్రసంగం లో చెప్పారు. అదేవిధంగా, చైనా సైనిక బెదిరింపులు తక్షణం ఆపేయాలని కోరారు. సైన్యంతో తమ దేశాన్ని చుట్టుముట్టి భయపెట్టే పద్ధతులు విడనాడాలన, చైనాతో తమ దేశం శాంతి, సుస్థిరతలను కోరుకుంటున్నదని ఆయన అన్నారు. తైవాన్ స్వతంత్ర దేశమని, సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకుంటూ ప్రపంచదేశాలతో సత్సంబంధాలు కొనసాగిస్తుండగా చైనా మాత్రం తైవాన్ సార్వభౌమాధికారాన్ని తిరస్కరిస్తున్నదని ఆయన అన్నారు. "చైనా వాస్తవాలు గుర్తించాలి, తైవాన్ ప్రజల మనోభిప్రాయాలను గుర్తించాలి, తైవాన్ స్వతంత్ర్య జీవన విధానాన్ని గుర్తించాలి, వివాదాలు ఏమైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కారానికి ముందుకు రావాలి, సైనిక బెదిరింపులు ఆపాలి" అని లీ ఛింగ్ తే కోరారు. చైనా చొరబాట్లు, ఇతర బెదిరింపులను ఎదుర్కొంటామనీ, దేశ ప్రజాస్వామ్యాన్ని, స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటామని అన్నారు. చైనా తాము స్వాతంత్ర్యం కోరుకోవడంలేదనీ, తైవాన్ ఎప్పటినుండో ఒక స్వతంత్ర దేశమని, దేశ ప్రజాస్వామ్యాన్ని తాము రక్షించుకుంటామని లీ అన్నారు. లీ కు చెందిన డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ మొదటినుండీ తైవాన్ ఒక స్వతంత్ర్య దేశమనీ, తమకు ప్రత్యేకంగా చైనా నుండి స్వాతంత్ర్యం కోరుకోవాల్సిన అవసరం లేదనీ వాదిస్తున్నది.

# నేడు సిఐఎస్‌సిఇ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్స్ కౌన్సిల్ (సిఐఎస్‌సిఈ) సమావేశం మంగళవారం హైదరాబాద్, హబ్సిగూడలోని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌లో జరగనుంది. ఈ సమావేశానికి సిఐఎస్‌సిఈ ఛైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్,సెక్రటరీ జోసెఫ్ ఇమ్మాన్యూయేల్ అధ్యక్షత వహించనున్నారు. తెలుగు రాష్ట్రాల నుండి 200లకు పైగా సిఐఎస్‌సిఈ పాఠశాలలకు సంబంధించిన మేనేజర్లు, ప్రధానోపాధ్యాయులు,సీనియర్ ఉపాధ్యాయులు హాజరుకానున్నారు. ఈ ప్రిన్సిపల్స్ మీట్ లో నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్ వర్క్ స్కూల్ ఎడ్యుకేషన్ 2023 నిర్దేశాల ఆధారంగా సిఐఎస్‌సిఈ పాఠశాలల్లో వ్యవస్థీకృత సంస్కరణల అమలు అంశంపైన చర్చించనున్నారు.

ప్రధానంగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ప్రకారం పాఠ్య ప్రణాళిక, బోధనా పద్ధతుల పునర్వ్యవస్థీకరణ, అనుభవపూర్వక, ఆవిష్కార బోధనా పద్ధతులను ఉపయోగించి చురుకైన, ఆనందకరమైన అభ్యసభ అనుభవాల్లో విద్యార్థులను నిమగ్నం చేయడం అంశంపై చర్చించనున్నారు.నిరంతర వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాలతో ఉపాధ్యాయుల్లో సాధికారత సాధించడం, సామర్థ్య ఆధారిత విద్య, ఉపాధ్యాయ వనరుల కల్పన, వినూత్న సంస్కరణల ద్వారా సిఐఎస్‌సిఈ పాఠశాలల్లో విద్య నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రణాళికలు రచించడం తదితర అంశాలపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించనున్నారు. కాగా విద్యా, వృత్తిపరమైన అభివృద్ధిని పెంపొందించే లక్ష్యంతో ఉపాధ్యాయ శిక్షణ, స్టూడెంట్ ఎంగేజ్ మెంట్ ప్రోగ్రాం, వార్షిక కార్యకలాపాలకు సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రంగా నిలవనుంది.

# జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

## నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో భారీ ఏర్పాట్లు

## బత్తిని అమర్‌నాథ్ గౌడ్ వెల్లడి



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ఉబ్బసం వ్యాధి నివారణకు ప్రతి ఏటా మృగశిర కార్తె రోజున అనవాయితీగా బత్తిని సోదరులు ఇస్తున్న చేప ప్రసాదాన్ని జూన్ 8న పంపిణీ చేయనున్నట్లు బత్తిని అమర్‌నాథ్ గౌడ్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం పంపిణీ 8వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమై 9వ తేదీ ఉదయం 11 గంటల వరకు కొనసాగిస్తుందని ఆయన వెల్లడించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో బత్తిని హరినాథ్ తనయుడు అమర్‌నాథ్ గౌడ్, గ్రవాల్ సేవాదళ్ కన్వీనర్ అజితాగుప్తా, కైలాష్ కేడియాలతో కలిసి ఆయన మాట్లాడారు. ఉబ్బసం బాధితుల కోసం చేప ప్రసాదం పంపిణీ కోసం ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అమర్‌నాథ్ గౌడ్ కోరారు. సమావేశంలో కుటుంబసభ్యులు శివశంకర్ గౌడ్, గౌరీశంకర్ గౌడ్, శివశేఖర్‌గౌడ్, సంతోష్ గౌడ్, రోషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

గాయాలు కాగా క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటన తెలియగానే పోలీసులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన పట్ల ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తామని తెలిపారు. ఈ ప్రమాదం పై విచారణ జరిపిస్తామన్నారు.

# టిఎస్ ఇసెట్ ఫలితాలు విడుదల

## 96.12 శాతం మంది ఉత్తీర్ణులు

ప్రజాపక్షం/హైదరాబాద్: టిఎస్ ఈసెట్ పరీక్షలో 96.12 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 24,272 మంది దరఖాస్తు చేసుకోగా 23,330 మంది హాజరయ్యారు. ఈ మేరకు ఈసెట్ ఫలితాలను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, టిఎస్ ఈ సెట్ ఛైర్మన్ ప్రొఫెసర్ దండబోయిన రవీందర్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్,ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్ హైదరాబాద్‌లో సోమవారం ఈసెట్ ఫలితాలను విడుదల చేశారు. 'ఈసెట్'కు ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ జారీ చేయగా, ఈనెల 6న పరీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 92 పరీక్ష కేంద్రాలు, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు పరీక్ష కేంద్రాల్లో ఈసెట్ ఫరీక్షలను నిర్వహించారు. రాష్ట్రంలో అత్యధికంగా ఇసిఇలో 6197 మంది దరఖాస్తు చేసుకోగా, 6002 మంది పరీక్షలు రాశారు. కాగా మైనార్టీ గురుకులాలలో మొత్తం 1176 మంది ఉత్తీర్ణులయ్యారు. టాప్ వెయ్యి ర్యాంక్‌లో ముగ్గురు, 10 వేల ర్యాంకులలో 25 మంది, ఇంజినీరింగ్‌లో పదివేల లోపు ర్యాంక్‌లో 8 మంది ఉత్తీర్ణత సాధించారు.

## ఐదో విడత ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

అత్యధికంగా రికార్డు స్థాయిలో 54.49 శాతం ఓటింగ్ జరిగిందని ఎన్నికల సంఘం ప్రకటించింది. పునరావాస కేంద్రాలలో నివసిస్తున్న కశ్మీరీ వలస ఓటర్ల కోసం ఢిల్లీ, జమ్మూ, ఉద్ధంపూర్‌లలో మొత్తం 21 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలియజేసింది. లద్దాక్‌లో కూడా 67.15 శాతం ఓట్లు పోలయ్యాయి. ఐదవ దశలో ఎనిమిది రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 49నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కడపటి వార్తలు అందేసరికి ఈ దశలో అత్యధికంగా 73 శాతం మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. జమ్ముకశ్మీర్‌లో ఉదయం నుంచే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముంబైలో రాజకీయ, వ్యాపార, సినీ ప్రముఖులు ఓటు వేశారు. అమేథీ లోక్‌సభ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా బరిలో ఉన్న కేంద్రమంత్రి స్మృతి ఇరానీ గౌరీగంజ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మహారాష్ట్రలో మొత్తం 48 లోక్‌సభ స్థానాలు ఉండగా, మొదటి నాలుగు దశల్లో 35 స్థానాలకు ఓటింగ్ జరిగింది. ఐదో విడతలో దేశ వ్యాప్తంగా 1,31,38,526 మంది పురుషులు, 1,15,28,278 మంది మహిళలు, 2,740 మంది థర్డ్ జెండర్‌తో సహా మొత్తం 2,46,69,544 మంది ఓటర్లు ఉన్నారు. కాగా, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అక్షయ్ కుమార్ పిలుపునిచ్చాడు. ఎవరికి నచ్చిన వారిని వారు ఎన్నుకోవాలని, ఆలోచించి ఓటు వేయాలని సూచించాడు. నటుడు, దర్శకుడు ఫర్హాన్ అక్తర్ కూడా ఇలాంటి సందేశమే ఇచ్చాడు. ప్రజలందరి బాగోగులు చూసే ప్రభుత్వం రావాలని, సుపరిపాలన జరగాలని కోరుకుంటూ తాను ఓటు వేసినట్టు చెప్పాడు.

### ఊపిరి పీల్చుకున్న ప్రముఖ నేతలు

ఏడు విడతల లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సోమవారం ఐదో దశ పోలింగ్ ముగియడంతో ఎంతో మంది ప్రముఖులు ఊపిరి పీల్చుకున్నారు. జయాపజయాలు ఎలావున్నా, ప్రస్తుతానికి అప్పటి వరకూ అనుభవించిన టెన్షన్ నుంచి కొద్దోగొప్పో విముక్తి పొందారు. ఫలితాలు ఎలా ఉంటాయనే ఆలోచన తప్ప, తమతమ నియోజకవర్గాఓటర్లను ప్రసన్నం చేసుకోవం ఎలా? అనుసరించాల్సిన వ్యూహాలు ఏమిటి? అనే సమస్య నుంచి బయటపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని 14, మహారాష్ట్రలో 13 స్థానాలు ఉన్నాయి. ఒడిశాలో 5, బీహార్‌లో 5, జార్ఖండ్‌లో 3, జమ్మూకశ్మీర్లో ఒకటి, లడఖ్‌లో ఒకటి చొప్పున మొత్తం ఎనిమిది రాష్ట్రాల్లోని 49 స్థానాలకు ఓటింగ్ జరిగింది. ఐదో దశలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నవారిలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, చిరాగ్ పాశ్వాన్, రాజీవ్ ప్రతాప్ రూడీ, రోహిణి ఆచార్య, ఒమర్ అబ్దుల్లా, పీయూష్ గోయల్ వంటి దిగ్గజాలు ఉన్నారు. ఇంతకు ముందు జరిగిన 4 దశల పోలింగ్‌లో 379 లోక్ సభ స్థానాలకు ఓటింగ్ ప్రక్రియ పూర్తయింది. ఐదో దశతో మొత్తం 428 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ నెల 25న ఆరో దశ, జూన్ 1న చివరిదైన ఏడో విడత పోలింగ్‌తో దేశంలో సార్వత్రిక ఎన్నికల కోలాహలం ముగుస్తుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలు విడుదల చేస్తారు.

# నేడు దేవాదాయ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ ఆధ్వర్యంలో మంగళవారం దేవాదాయ శాఖ పై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, డిప్యూటీ కమిషనర్ లు, అడిషనల్ కమిషనర్ లు, ఈవోలు తదితరులు పాల్గొంటారు.

## ఇరాన్ అధ్యక్షుడు రైసీ మృతి

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ దేశాలతో అణు చర్చల్లో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అయితే, ఇరాన్‌లో అధ్యక్షుడి కన్నా సుప్రీమ్ లీడర్‌కే అధికారాలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుత సుప్రీమ్ లీడర్‌గా అయతొల్లా అలీ ఖమేనీ కొనసాగుతున్నారు. ఆ స్థానాన్ని రైసీ భర్తీ చేయడం ఖాయమన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమైంది. ఆయన పదవిలో ఉన్నప్పుడు ఇరాన్‌లో అనేక ఆర్థిక సంక్షోభాలు తలెత్తాయి. ప్రజల జీవితాలు భారమయ్యాయి. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది. ఇరాన్ కరెన్సీ మారక విలువ పతమైంది. మత పెద్దల ప్రవర్తన, వారు అనుసరిస్తున్న విధానాల కారణంగా అప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉన్న ఇరాన్‌పై అమెరికా మరిన్ని ఆంక్షలు విధించిది. ఇవన్నీ.. అక్కడి ప్రజలను చాలా ఇబ్బంది పెట్టాయి. కాగా, రాజకీయ విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడే వ్యక్తిగా, నిరసనలపై ఉక్కుపాదం మోపే వ్యక్తిగా ఇరాన్ అధ్యక్షుడు రైసీకి పేరుంది. అంతేకాదు.. ఈయనకు 'బుచర్ ఆఫ్ టెహ్రాన్'గా కూడా పేరుంది. 1980వ దశకంలో ఇరాన్‌లో చెలరేగిన హింస అనంతర పరిణామాల్లో అరెస్టయిన వేలాది మంది రాజకీయ ఖైదీలను ఉరి తీయాలని షాకింగ్ ఆదేశాలిచ్చిన నలుగురు న్యాయమూర్తుల్లో ఈ రైసీ ఒకరు. ఇదే విషయంపై, 2019లో ఐక్యరాజ్య సమితి ట్రెజరీ విభాగం రైసీపై ఆంక్షలు కూడా విధించింది. రైసీ వీరమరణం పొందినట్టు ఇరాన్ మీడియా ప్రకటించగా, వివిధ దేశాలకు చెందిన నాయకులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఇరాన్ అధ్యక్షుడు రైసీ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త విన్న తర్వాత చాలా బాధపడ్డానని పేర్కొన్నారు. భారత్, ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల మెరుగు కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తు ఉంటుందని మోదీ తెలిపారు.

## కలెక్టర్లకు అప్పగింత

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాల పనులపై మంత్రి శ్రీధరబాబు అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో మరమ్మతులు చేయాలని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై నిపుణుల కమిటీ ఏమి చెబితే అది చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. తక్కువ ఖర్చుతో నీటి ని లిఫ్ట్ చేయడానికి అవకాశం ఉంటె పరిశీలించాలని కేబినేట్ నిర్ణయించింది.

కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు మీడియాకు వెల్లడించారు. మంత్రివర్గంలో మేడిగడ్డపై ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన మధ్యంతర నివేదికపైనా చర్చించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం విషయంలో ఎన్డీఎస్‌ఏ సూచనలకనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పారు. 'మేడిగడ్డకు మరమ్మతులు చేస్తే.. సరి అవుతుందన్న గ్యారెంటీ లేదని, నీరు నిల్వ చేసే పరిస్థితి కూడా లేదని ఎన్డీఎస్‌ఏ కమిటీ చెప్పింది. అందుకే తాత్కాలికంగా ఏమైనా ఏర్పాటు చేసైనా సరే రైతులకు నీరు ఇవ్వాలని భావిస్తున్నాం' అన్నారు.

### రైతులు ఎవ్వరూ ఆందోళన చెందొద్దు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఒక్క రూపాయి కూడా తగ్గకుండా కనీస మద్దతు ధరకు తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతన్నలు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భరోసనిచ్చారు. ప్రధాన ప్రతిపక్షం రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తుందని,ఆ పార్టీ మాయ మాటలు నమ్మకూడదని సూచించారు. పదేళ్ల కాలంలో గత ప్రభుత్వంలో పంటను అడ్వాన్స్‌గా సేకరించిన సందర్భం లేదని,సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ధాన్యాన్ని సేకరించి, మూడు రోజుల్లోనే డబ్బులు ఇచ్చామని తెలిపారు. వచ్చే సీజన్ నుండి సన్న వడ్లకు క్వింటాకు రూ.500ల బోనస్‌ను చెల్లిస్తామని, సన్న రకాలను వ్యవసాయ శాఖ ప్రకటిస్తుందన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. కంపెనీల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, విడిగా కిలోల చొప్పున విత్తనాలను కొనుగోలు చేయకూడదన్నారు. విద్య రంగానికి చెందిన ఫీజుల నియంత్రణ కమిటీకి కూడా మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారన్నారు.

### రిపేర్ చేసినా మేడిగడ్డ ఉంటుందో.. ఉండదో గ్యారంటీ లేదంట

కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశంలో మరమ్మతులు చేసినా, వాటిపై నిధులు ఖర్చుపెట్టినా బ్యారేజీ ఉంటుందో, ఉండదో కూడా గ్యారంటీ లేదని , బ్యారేజీలో చుక్క నీరు నిల్వ పెట్టకూడదని ఎన్‌డిఎస్‌ఎ కమిటీ స్పష్టం చేసిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. మూడు డ్యామ్‌లకు సంబంధించి కేంద్ర సంస్థలతోనే డ్యామ్ పరీక్షలను నిర్వహించాలని, ఒక్క డ్యామ్‌కు రెండు వేర్వేరు కంపెనీల అభిప్రాయాలను సేకరిస్తామని, వారి సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. తాత్కాలికంగా ర్యాక్‌ఫిల్ డ్యామ్‌ను ఏ ర్పాటు చేసి నీటిని ఎత్తిపోసే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించినట్టు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన ఖర్చులు వృదా కాకుండా, రైతులకు ఇబ్బందులు రాకుండా ఉండేలా, తాత్కాలిక పద్ధతి నీటిని ఎత్తిపోసి , రైతులకు సాగు నీటిని ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి, సోనియాగాంధీతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసిన వారిని కూడా ఆహ్వానించి, వారిని సన్మానించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీర్మానాన్ని ప్రవేశపెట్టారని వివరించారు.

### మార్పు చేసిచూపిస్తాం... విద్యకు పెద్దపీట : మంత్రి శ్రీధర్‌బాబు

విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. విద్య రంగంలో మార్పును చేసి చూపిస్తామన్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు జరిగిన నష్టాన్ని పూరించి, నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. మంత్రివర్గంలో విద్యా రంగంపైన సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. రాబోయే కాలంలో మానవ వనరులను తయరు చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించి, అన్ని హంగులను ఏర్పాటు చేస్తామని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతామన్నారు. మేడిగడ్డ బ్యారేజీ అంశంలో ఎన్‌డిఎస్‌ఎ కమిటీ మధ్యంతర నివేదిక సిఫార్సులు, నీటిపారుదల నిపుణుల సూచన మేరకే ప్రభుత్వం పనిచేస్తుందని, గతంలో నిపుణుల సూచనలను పట్టించుకోకపోతే ఏం జరిగిందో రాష్ట్ర ప్రజలకు తెలుసని అన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఒక్క గింజ తరుగులేకుండా కొనుగోలు చేస్తామన్నారు. క్రమబద్ధీకరణ పేరుతో గత ప్రభుత్వం పేదలను విద్యకుదూరం చేశారని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

### జూన్ 5 తర్వాత మాట్లాడుతా.... : కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

రైతుల పట్ల ఎవరికి ప్రేమ ఉన్నదనేది అందరికీ తెలుసని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గతంలో రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేసిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, నాడు కేంద్రలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.70వేల కోట్ల రైతు రుణాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. ఆ నిధులు ప్రస్తుతం రూ. 7లక్షల కోట్లకు సమానమని చెప్పారు. మరిన్ని అంశాలను తాను జూన్ 5వ తేదీ తర్వాత మాట్లాడుతానన్నారు. గత ప్రభుత్వం కేవలం ఒక లక్ష రైతు రుణమాఫీని ఆరు, ఏడు విడతలుగా చేసిందన్నారు. గత ప్రభుత్వం కనీసం డిఎస్సి కూడా వేయలేదని విమర్శించారు.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## హజారీబాగ్ జిల్లాల్లో ఎన్నికలను బహిష్కరించిన ఓటర్లు

**జార్ఖండ్ :** జార్ఖండ్ రాష్ట్రం హజారీబాగ్ జిల్లాల్లో 2 వేల మందికి పైగా ఓటర్లు ఎన్నికలను బహిష్కరించారు. తమ ప్రాంతంలో వంతెను నిర్మించాలనే దీర్ఘకాలిక డిమాండ్‌ను పట్టించుకోకపోవడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజధాని రాంచీ నుండి 105 కిలోమటర్ల దూరంలో ఉండే కుసుంభా గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని అప్‌గ్రేడెడ్ మిడిల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 183, 184 పోలింగ్ బూత్‌లలో ఒక్క ఓటు కూడా పోల్ కాలేదని పోలింగ్ అధికారి సుబోధ్ ప్రసాద్ వర్మ వెల్లడించారు. విషయం తెలిసిన వెంటనే తానూ, ఎస్‌పి అరవింద్ కుమార్ ఆ గ్రామానికి వెళ్ళి ప్రజలను ఒప్పించేందుకు ప్రయత్నించినట్లు హజారీబాద్ డిప్యూటీ కమిషనర్ నాన్సీ సహాయ్ తెలిపారు. అయితే గ్రామస్తులు మాత్రం అంగీకరించాలేదు. తమకు అవసరమైన వంతెనను కాకుండా ఎన్‌టిపిసి అండర్‌పాస్‌ను నిర్మిస్తున్నదని వారు ఆరోపించారు.

## అందరూ ఇంట్లో కూర్చొని ఓటు వేద్దామనుకుంటారు : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** పోస్టల్ బ్యాలెట్‌ను కోరుతూ ఒక వృద్ధురాలు చేసిన వినతిని తిరస్కరిస్తూ ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలును సుప్రీంకోర్టు త్రోసిపుచ్చింది. మంచం నుండి కదలలేని స్థితిలో ఉన్న తనకు మే 7న తమ నియోజకవర్గంలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసేందుకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాలని కోరుతూ ఛత్తీస్‌గడ్ హైకోర్టులో 78 ఏళ్ళ మహిళ పిటిషన్ వేసింది. ఈ మేరకు సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఆ మహిళకు సూచిస్తూ, ఆ అధికారి కచ్చితంగా చట్ట ప్రకారం పరిశీలించాలని ఏప్రిల్ 29న హైకోర్టు ఆదేశించింది. ఎన్నికల అధికారిక దరఖాస్తు చేసుకున్నప్పటికీ, 40 శాతానికి పైగా శారీరక అసౌకర్యం లేనందున పోస్టల్ బ్యాలెట్ ఇవ్వలేమని తిరస్కరించినట్లు ఆమె తరపు న్యాయవాది తెలిపారు. దీనిపై మళ్ళీ మే 6న హైకోర్టుకు వెళ్ళగా, 24 గంటల్లో పోలింగ్ ఉన్నందున పోస్టల్ బ్యాలెట్ సాధ్యం కాదని హైకోర్టు ఆమె దరఖాస్తును తిరస్కరించింది. దీనిపై సుప్రీం కోర్టును ఆశ్రయించగా, ఆమె మెడికల్ సర్టిఫికెట్‌ను పరిశీలించి 40 శాతం శారీరక వైకల్యం లేనందున, నిబంధనల ప్రకారం పోస్టల్ బ్యాలెట్‌ను తిరస్కరించారని సుప్రీం కోర్టు పేర్కొంది. ప్రతి ఒక్కరూ ఇంట్లో కూర్చొనే ఓటు వేయాలనుకుంటారని, ఇటువంటి దరఖాస్తులను తాము ఆహ్వానించబోమని స్పష్టం చేసింది. పిటిషన్‌దారుకు 80 ఏళ్ళలోపు వయసు కూడా లేదని, కాబట్టి పోస్టల్ బ్యాలెట్‌కు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించి, హైకోర్టు తీర్పుపై వేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 80 ఏళ్ళు దాటిన ఓటర్లు, 40 శాతానికి పైగా అంగ వైకల్యం కలిగిన ఓటర్లకు దరఖాస్తు చేసుకుంటే ఇంటి దగ్గరే ఓటేసేందుకు వీలుగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తారు.

# మళ్లీ అవే వివాదాస్పద వ్యాఖ్యలు



సార్వత్రిక ఎన్నికల వేళ బిజెపి నాయకులు తమ తీరు మార్చుకోవడం లేదు. విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ, వివాదాస్పద వ్యాఖ్యలను మానుకోవడం లేదు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ తాజా వ్యాఖ్యలు మరోసారి దుమారం రేపాయి. మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని మరోసారి ప్రకటించుకున్న శర్మ, ఒకవేళ వారికి రిజర్వేషన్లు ఉండితీరాలని అనుకుంటే లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్‌జెడికి, రాహుల్ గాంధీ పర్యవేక్షణలో నడుస్తున్న కాంగ్రెస్ వంటి పార్టీలకు ఓటు వేయాలని వ్యాఖ్యానించారు. ముస్లింల రిజర్వేషన్లను సమర్థించిన లాలూ ప్రసాద్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. హిందువులకు రిజర్వేషన్లు పొందే అర్హత లేదా? అని నిలదీశారు. అంబేద్కర్ మనకు అందించిన రాజ్యాంగం ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు మాత్రమే రిజర్వేషన్లు ఉండాలని, అందులో మతం గురించిన ప్రస్తావన లేదు కాబట్టి, ముస్లిం రిజర్వేషన్లను ప్రోత్సహించకూడదని శర్మ కొత్త సిద్ధాంతాన్ని తెరపైకి తీసుకొచ్చారు. రిజర్వేషన్లు కావాలని కోరుకునే ముస్లింలు పాకిస్తాన్‌కు వెళ్లాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కర్నాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలను ఉటంకిస్తూ, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తే, వెనుకబడిన తరగతుల వారికి నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వంటి పలువురు నేతలు ముస్లిం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ తమతమ ప్రసంగాల్లో వ్యాఖ్యానలు చేస్తున్న విషయం తెలిసిందే. మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారంటూ మోదీ, అమిత్ షా తదితరులపై అందిన ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల కమిషన్ (ఇసిఐ) పట్టించుకున్నట్టు కనిపించడం లేదు. నామమాత్రపు నోటీసులు జారీ చేయడంతో సరిపుచ్చుకుంది. అయితే, వారిపై తీసుకున్న లేదా తీసుకోవాల్సిన చర్యల పురోగతిపై వివరణ ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించడంతో అటు ఇసిఐ, ఇటు ఢిల్లీ పోలీస్ శాఖలో కదలికలు వచ్చాయి. అయోధ్య మందిరాన్ని నిర్మించామని, మరోసారి అధికారంలోకి వస్తే, కృష్ణ జన్మభూమి (మధుర), జ్ఞానవాపి (వారణాసి) దేవాలయాలను కూడా నిర్మిస్తామని బిజెపి నేతలు అంటున్నారు. సిఎఎను సమర్థంగా అమలు చేయడానికి, హిందువుల మనోభావాలకు అనుగుణంగా మందిరాల నిర్మాణాలకు అవసరమైనంత బలాన్ని ఇవ్వాలని ప్రజలను కోరారు. 400 స్థానాలను అప్పచెప్తే అద్భుతాలు చేస్తామని అంటున్న బిజెపి నేతలు దేశాన్ని హిందూ రాజ్యంగా ప్రకటించే ప్రయత్నం చేస్తారనడంలో అనుమానం లేదు. మతాన్ని, మత విశ్వాసాలను అడ్డం పెట్టుకొని ఓట్ల రాజకీయం చేస్తున్న బిజెపికి ఎదురుదెబ్బ తప్పదని విశ్లేషకుల అభిప్రాయం. ఏదిఏమైనా, ఇసిఐ హితబోధలు చేస్తున్నా, ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా, బిజెపి నేతల్లో మార్పు రావడం లేదు. విద్వేషపూరిత ప్రసంగాలకు తెరదించడం లేదు.

## కంగనా రనౌత్‌కు చుక్కెదురు

### 'గో బ్యాక్' అంటూ నల్ల జెండాలతో నిరసన



**సిమ్లా :** హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నియోకవర్గం నుండి బిజెపి తరుపున లోక్‌సభకు పోటీ చేస్తున్న ప్రముఖ బాలీవుడ్ నటి కంగ నా రనౌత్‌కు చుక్కెదురైంది. ఆమె ప్రచారం లో భాగంగా సోమవారం నాడు లాహౌల్, స్పితి ప్రాంతాలకు వెళ్ళినప్పుడు స్థానిక ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు నల్లజెండాలను ప్రదర్శించారు. 'కంగనా గో బ్యాక్' , 'కంగనా వంగనా నహీ చలేగీ' అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద పెట్టున్న నినాదాలు చేశారు. టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామాపై గత ఏడాది ఏప్రిల్ మాసంలో కంగనా చేసిన వ్యాఖ్యల పట్ల ఆమెపై ఈ ప్రాంతంలో తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దలైలామా, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కలిసిన ఫోటోను ఫోటో షాప్ చేసి ఆమె వివాదాస్పద వ్యాఖ్యలతో ట్వీట్ చేశారు. దీనిపై అప్పుడే బౌద్ధులు ముంబైలోని కంగనా కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తరువాత ఆమె క్షమాపణలు చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలే కావాలని తమ ప్రచారాన్ని భగ్నం చేసేందుకు తమ కార్లపై రాళ్ళు విసిరారని కంగనాతో పాటు ప్రచారానికి వెళ్ళిన బిజెపి ప్రతిపక్ష నాయకుడు జైరామ్ ఠాకూర్ ఆరోపించారు. కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలు పరస్పరం ఎదురుపడడంతో కొంత తోపులాట జరిగింతే తప్ప గొడవలు జరగలేదని, ఎవరికీ గాయాలు కాలేదని, ఒకరికి మాత్రం కాలు బెణికిందని లాలౌల్ , స్పితి ఎస్‌పి మయాంక్ చౌదరి స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు శాంతియుతంగా నిరసనలు తెలుపుతుండగా, గతంలో దలైలామాపై కంగనా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆగ్రహంతో ఉన్న స్థానికులు పెద్ద సంఖ్యలో తమతో పాటు నిరసనలోచేరినట్లు లాహౌల్, స్పితి కాంగ్రెస్ ఎన్నికల సమన్వయకర్త భీషన్ షాశ్నీ తెలిపారు.

# మమతా సోదరుని ఓటు గల్లంతు



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్సీ తమ్ముడు బాబున్ బెనర్జీ ఓటు గల్లంతైంది. హౌరా పట్టణలో ఓటే వేసేందుకు పోలింగ్ బూత్ వెళ్ళిన ఆయన, అక్కడ ఓటరు జాబితాలో తన పేరు లేనట్లు గుర్తించారు. ఓటర్ల జాబితా వ్యవహారమంతా ఎన్నికల సంఘం చూసుకుంటుందని, ఆ వ్యవహారం ఎలా జరిగిందో ఈ సంఘటన చూస్తే అర్థమవుతోందని టిఎం సి అధికార ప్రతినిధి శాంతను సేన్ తెలిపారు. అయితే, సిట్టింగ్ ఎంపి ప్రసూన్ బెనర్జీకే తిరిగి హౌరా లోక్‌సభ స్థానం ఇవ్వడం పట్ల గతంలో బాబున్ బెనర్జీ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆయనతో సంబంధాన్ని తెంచుకుంటున్నట్లు మమతా బెనర్జీ నిర్ణయించుకున్నారు. బాబున్ బెనర్జీ ఈ సారి టిఎంసి తరుపున ఎంపిగా పోటీ చేయాలని భావించారు. తనకే టికెట్ లభిస్తుందని ఆశించినప్పటికీ, అలా జరగలేదు. దీంతో హౌరా లోక్‌సభ నియోజకవర్గం నుండి బాబున్ బెనర్జీ స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేస్తారని, లేదంటే ఆయన బిజెపిలో చేరుతారనే ప్రచారం జరిగింది. ప్రస్తుతం బెంగాల్ ఒలింపిక్ అసోసియేషన్, బెంగాల్ హాకీ అ సోసియేషన్‌లకు బాబున్ అధ్యక్షులుగా ఉన్నారు. అలాగే బెంగాల్ బాక్సింగ్ అస్సోయేషన్ కార్యదర్శిగా, టిఎంసి క్రీడల విభాగం ఇన్‌ఛార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

## కేజ్రీవాల్‌ను బెదిరిస్తూ ఢిల్లీ మెట్రోలో రాతలు



**ఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను బెదిరిస్తూ ఢిల్లీలో పలు మెట్రో రైళ్ళు, మెట్రో స్టేషన్‌లలో చేతి రాతలు ప్రత్యక్షమయ్యాయి. ఇవన్నీ కూడా బిజెపి గుండాగిరిలో భాగంగా జరుగుతున్నవని ఆప్ ఆరోపించింది. దీనిపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మెట్రోలో రాసిన రాతలకు సంబంధించిన ఫోటోలు ఒక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వైరల్ అయినట్లు గుర్తించామని పోలీసులు వెల్లడించారు. కేజ్రీవాల్ ఢిల్లీని వదిలిపెట్టి వెళ్ళిపో, లేదంటే గత ఎన్నికలకు ముందు మూడు చెంపదెబ్బలు గుర్తుకు తెచ్చుకో, త్వరలోనే నీకు పంచ్‌లు, చెంప దెబ్బలు తప్పవంటూ మెట్రో రైలులో గుర్తు తెలియని వ్యక్తి ఎర్రటి స్కెచ్ పెన్‌తో రాసారు. చివరిలో అంకిత్.గోయల్_91ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ అని ఉంది. ఇలా పటేల్‌నగర్, రమేశ్‌నగర్, రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్‌లలో కూడా రాసి ఉన్నట్లు గుర్తించారు.

# ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

### బ్లాక్ మెయిలర్లను ఓడించండి
### పట్టభద్రులకు కెటిఆర్ పిలుపు



**ప్రజాపక్షం / ఖమ్మం :** శాసన సభలో ఏకపక్ష ధోరణి వస్తే ప్రజాస్వామ్యాన్ని సమతుల్యం చేసేందుకు శాసన మండలిని ఏర్పా టు చేశారని తెలంగాణ శాసన మండలిలో ప్రశ్నించే గొంతుక అవసరమని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటి రామారావు తెలిపారు. పట్టభద్రులు పార్టీలకు అతీతంగా నిబద్ధత కలిగిన ప్రజల పక్షాన మాట్లాడే వ్యక్తులను గెలిపించాలన్నారు. ఖమ్మం ఎస్‌బిఐటి కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల తరుపున పోరాడే రైతు కుటుంబానికి చెందిన ఏనుల రాకేష్‌రెడ్డిని బిఆర్ఎస్ బరిలోకి దించిందని కాంగ్రెస్ నుంచి బ్లాక్ మెయిల్ రాజకీయాలు, బూతు పురాణం మాట్లాడే వ్యక్తి రంగంలో ఉన్నారని పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలని ఆయన కోరారు. రాకేష్‌రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చి ఉన్నత విద్యను అభ్యసించి అమెరికా లో పెద్ద కంపెనీలలో ఉద్యోగం చేస్తూ సమా జ సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాడని ఆ యన తెలిపారు. ఆడపిల్లల గౌరవానికి భం గం కలిగే రీతిలోచండాలపు పని చేసిన వ్యక్తి ని కాంగ్రెస్ తన అభ్యర్థిగా నిలబెట్టిందని పలు కేసులు ఉండి పలుమార్లు జైలుకు వెళ్లిన వ్యక్తిని శాసన మండలికి పంపితే ఏమి జరుగుతుందో పట్టభద్రులు ఊహించాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇస్తానన్న నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాల గురించి పట్టించుకోవడం లేదని రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే వాటి కోసం పోరాడతారన్నారు. ఖమ్మం నగరం పదేళ్లలో సుందరంగా మారిందని అభివృద్ధిని కూడా పట్టభద్రులు గమనించాలన్నారు. రేవంత్‌రెడ్డి ఒక నోటిఫికేషన్ అయినా ఇచ్చారా అని కేటిఆర్ ప్రశ్నించారు. వరంగల్, ఖమ్మంకు బిఆర్ఎస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలను తీసుకు వచ్చిందని రేవంత్‌రెడ్డి వచ్చాకా మహేంద్ర లాంటి కంపెనీలు వెనక్కి తిరుగుతున్నాయన్నారు. తెలంగాణలో ఐటి విలువ 2014లో రూ. 55వేల కోట్లు ఉంటే 2023 నాటికి రూ.రెండు లక్షల కోట్లకు పెంచామని కేటిఆర్ తెలిపారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరు ఓటింగ్‌లో పాల్గొని రాకేష్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇంత వరకు ఆ ప్రయత్నమే చేయలేదన్నారు. ఐ దు నెలల కాలంలో కాంగ్రెస్ అ భ్యర్థి మల్లన్న ఏనాడైనా ఈ ప్రభుత్వాన్ని ప్ర శ్నించారా ప్రజల పక్షాన నిలబడ్డారా అని పట్టభద్రులు తెలుసుకోవాలన్నారు. సేవా భా వంతో రాజకీయాల్లోకి వచ్చానని నాలాంటి వ్యక్తులను ఆశీర్వదించి గెలిపిస్తే మరింత మంది రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉం దని ఆయన తెలిపారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంపి నా మ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంఎల్‌సి తాతా మధుసూద న్, శాసన సభ్యులు పల్లా రాజేశ్వరరెడ్డి, కొం డబాల కోటేశ్వరరావు, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమా ర్, మదన్‌లాల్, ఆర్‌జెసి కృష్ణ, కూరాకుల నా గభూషయ్య తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగం గా సోమవారం ఇల్లం దు, కొత్తగూడెంలో జరిగిన పట్టభద్రుల సమావేశాల్లో కేటిఆర్ బిఆర్ఎస్ నాయకులతో కలి సి పాల్గొన్నారు.

# టీచర్లపై లాఠీలు... బడుగు జీవులకు ఝూటా హామీలు

### గ్యారెంటీల అమలులో ప్రభుత్వ చర్యలు శూన్యం: మాజీ మంత్రి హరీష్‌రావు





**ప్రజాపక్షం/దేవరకొండ:** బడి పంతుల్లపై లాఠీ చార్జీ హేయమైన చర్య అని, గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడలేదని కారకులైన అధికారులపై సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సోమవారం దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కనీలాల్ ఇటీవల మరణించడంతో ఆయన చిత్రపటానికి పూలామాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ వంద రోజుల హామీలు అమలు కాలేదని, విద్యార్థులకు ఐదు లక్షల భరోసా కార్డు రాలేదని, విద్యార్థినిలకు స్కూటీ, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని ఇలాంటి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలంటే పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రభుత్వానికి చెంపపెట్టులాంటి తీర్పు నివ్వాలని కోరారు. ఎన్నికల ముందు ప్రియాంక, రాహుల్, రేవంత్ ఇచ్చిన ఏ హామీ కూడా అమలుకు నోచుకోలేదని, ఉద్యోగులకు మూడు డీఏలు అన్నారు కానీ ఒక్క డీఏ కూడా రిలీజ్ చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను దారుణంగా మోసం చేసిందని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్ ఇవ్వలేదని, మెరుగైన పీఆర్సీని ఉద్యోగులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యావంతులు, నిరుద్యోగుల్లారా ఆలోచన చేసి ఓటు వేయాలని మీ ఓటుతో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పండని అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రశ్నించే గొంతు రాకేష్‌రెడ్డిని గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేయడమంటే కాంగ్రెస్ మోసాన్ని బలపరిచినట్లవుతుందని మొద్దు నిద్రపోతున్న ప్రభుత్వాన్ని లేపాలంటే బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయని, యాజమాన్యాలు, విద్యావంతులు, మేధావులు బిఆర్ఎస్ ఎంఎల్‌సి అభ్యర్థిని బలపర్చాలని అన్నారు. జర్నలిస్టులకు వంద కోట్లు ఇస్తామని వంద పైసలు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం గడపదాటడం లేదని అన్నట్లుందని అన్నారు. వడ్లకు రైస్ మిల్లుల్లో నాలుగు, ఐదు కేజీల తరుగు పెడుతున్నారని ముప్పై రోజులైనా వడ్లు కొనలేదని, తడిసిన ధాన్యంతో రైతులు ఇబ్బంది పడుతుంటే పట్టించుకునే నాధుడు లేదని అన్నారు. బోనస్ విషయంలో చేతులేత్తేసిన సిఎం దొడ్డు రకం వడ్లకు బోనస్ ఇవ్వమని చేతులెత్తేసారని అన్నారు రైతుల ముఖాల్లో బిఆర్ఎస్ పాలనలో చిరునవ్వు ఉంటే కాంగ్రెస్ పాలనలో కన్నీరు మిగిలిందని అన్నారు. కాంగ్రెస్ గ్యారంటీల బాండ్ పేపర్ బౌన్స్ అయ్యిందని ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్‌కు శిక్ష తప్పదని అన్నారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ముప్పైవేల ఉద్యోగాలు ఇచ్చింది అన్నారు. ఒక్క నోటిఫికేషన ఇవ్వకుండా ఎలా ఇచ్చారని వంట అంతా బిఆర్ఎస్ వండితే వడ్డించిన కాంగ్రెస్ ఉద్యోగాలు ఇచ్చినమనడం సిగ్గుచేటని అన్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల బిఆర్ఎస్ ఎంఎల్‌సి అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులకు హరీష్‌రావు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంఎల్‌ఏలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, జెడ్పి చైర్మన్ నరేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, మండల అధ్యక్షులు టివిఎన్‌రెడ్డి, దస్రు, లింగారెడ్డి, సుభాష్, శ్రీనివాస్‌గౌడ్, రాజు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌దే పైచేయి... సూర్యాపేటలో పూర్వవైభవం

### ఫలించనున్న దామన్న శ్రమ



**ప్రజాపక్షం / సూర్యాపేట ప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికల్లో ఈ సారి కాంగ్రెస్ పార్టీదే పై చెయి కానుందని రాజకీయ విశ్లేషకులు ఘట్టిగా చెబుతున్నారు. వివిధ సర్వే సంస్థలు కూడా ఇదే విషయాన్ని ముందుగానే చెప్పడం జరిగింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న సూర్యాపేట స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత పట్టు కోల్పోయింది. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో లేకున్నా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడకుండా అంటిపెట్టుకోని ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో పార్టీకి నియోజకవర్గంలో పూర్వ వైభవం సంతరించుకుంది. శాసన సభ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఓటమి పాలైన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కాలుకు బలపం కట్టుకోని తన కుమారుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డితో కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో పై చెయి సాధించేందుకు గత నెల రోజులుగా పడిన శ్రమ ఫలించనుందని ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కాకముందు సూర్యాపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది. రాష్ట్ర ఏర్పాటుతో 2014,2018, 2024లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి స్వల్ప ఓట్ల తేడాతో మూడుసార్లు ఓటమి చవిచూశారు. అతనిపై వరసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ గా చెబుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఈ మూడుసార్లు గెలుపు కూడా చావుతప్పి కళ్లు లొట్టబోయిన చందన్న విషయం అందరికి తెలిసిందే. ఓటమి, విజయాన్ని సమానంగా స్వీకరించిన దామోదర్ రెడ్డి రాష్ట్రంలో అధికారంలో లేకున్నా.. సూర్యాపేటలో తాను గెలవకున్నా... నియోజకవర్గాన్ని వీడకుండా పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారన్నది అక్షర సత్యం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడంతో ఆయన సూర్యాపేట నియోజకవర్గ ఇన్ చార్జీగా బాధ్యతలు నిర్వహిస్తూ ఫుల్ జోష్‌తో ముందుకు సాగుతున్నారు. నిత్యం ప్రజల మద్యన ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాదర్బార్‌ను ఏర్పాటు చేసి ఏళ్ళ తరబడి పరిష్కారం కాని సమస్యలకు క్షణాల్లో పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. బిజెపి,బిఆర్ఎస్ పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ గూటికి చేరారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో నేనున్నానంటూ దామోదర్ రెడ్డి భరోసా ఇస్తుండడంతో ప్రజల్లో మరింత నమ్మకం పెరిగింది. తాను శాసన సభ ఎన్నికల్లో ఓటమి చెందినా నిరుత్సాహానికి గురికాకుండా పార్లమెంట్ ఎన్నికలతో తన పట్టును నిలుపుకునేందుకు ఎన్నికలకు ముందు నెల రోజుల నుండి ఎంతగానో శ్రమించారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ప్రచారం నిర్వహిస్తూ ప్రత్యర్థి పార్టీల నేతల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ పై చెయి సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. తనతో పాటు ఆయన కుమారుడు ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి కూడా తండ్రికి కుడిభుజంలా నిలబడి నియోజకవర్గాన్ని కలియతిరిగాడు. పార్లమెంట్ ఎన్నికల్లో కందూరు రఘువీర్ రెడ్డిని గెలుపు కోసం తన వాణి భాణి వినిపించి ప్రజల్లో చరగని ముద్ర వేసుకున్నారు. ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలు, యువకులతో ఆప్యాయంగా పలకరిస్తూ వారికి నేనున్నాంటూ భరోసా కల్పించారు. దీంతో రాబోయో రోజుల్లో సూర్యాపేట కాంగ్రెస్‌కు ఆశా కిరణం సర్వోత్తముడేనని నాయకులకు, కార్యకర్తలకు నమ్మకం కలిగించారు. సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు తిరిగి పూర్వ వైభవం సంతరించుకుంది. పార్టీ పునఃనిర్మాణం కోసం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి చేసిన శ్రమ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో ఫలించనుంది. సూర్యాపేట నియోజకవర్గంలో 2,44,116 మంది ఓటర్లు ఉండగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో 1,78,378 ఓట్లు పోలయ్యాయి. గతంలో ఎన్నడు లేని విధంగా పోలింగ్ శాతం పెరిగింది. 73.07శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డికి 46వేల మెజార్టీ రానుందని బల్లగుద్ది చెబుతున్నారు. ఇదే విషయాన్ని దామోదర్ రెడ్డి సైతం పదే పదే ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించడం గమనార్హం. ఏది ఏమైనా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థుల గ్రాఫ్ పూర్తిగా పడిపోయినట్లేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట.

# ఆదరించండి అండగా ఉంటా

### ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే అండగా ఉంటానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, డాక్టర్ కత్తి వెంకటస్వామి తదితరులు మాట్లాడుతూ పట్టభద్రులు ఎంతో విజ్ఞత గల వారని వారికి ఎవరు ప్రతినిధిగా ఉంటే న్యాయం జరుగుతుందో వారికి తెలుసన్నారు. కాంగ్రెస్‌తోనే నిరుద్యోగుల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఏ అధికారం లేనప్పుడే ప్రజా సమస్యలపై పోరాడిన నిఖర్సాయిన మనిషి మల్లన్న అని అధికారం ఉంటే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంత దూరమైన వెళ్లి పరిష్కరిస్తాడని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా యువతకు అన్ని హామీల అమలుకు కృషి చేస్తానని తెలిపారు. పట్టభద్రులంతా తమ అమూల్యమైన ఓటును రెండవ నెంబరు వద్ద మొదటి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, రాయల నాగేశ్వరరావు, వడ్డెబోయిన నర్సింహారావు, నాగా సీతారాములు, శ్రీనివాస్ యాదవ్, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్ గౌడ్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, మదూరి ప్రసాద్, సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
మంగళవారం, మే 21

## ప్రపంచ రాజకీయాల్లో పెనుమార్పులు?

ఇరాన్ అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం రైసీ విమాన ప్రమాదంలో మృతి చెందడం విషాదకరం. ఈ దుర్ఘటనతో ప్రపంచ రాజకీయాల్లో పెనుమార్పులు ఖాయంగా కనిపిస్తున్నాయి. ఇరాన్‌లో పరిణామాలు, భౌగోళిక రాజకీయ సమీకరణలు ఎలాంటి మలుపులు తిరుగుతాయోనని ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. పశ్చిమాసియా ప్రాంతంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడి మృతి ఆందోళన కలిగించే అంశం. హమాస్ ఏరివేత పేరుతో గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ మారణ హోమం సృష్టిస్తూనే ఉంది. దాడులు, ఆస్తి ప్రాణ నష్టాలు కొనసాగుతునే ఉన్నాయి. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా సిరియాలో హౌతీలు ప్రతిదాడులకు పాల్పడడం, లెబనాన్ మద్దతునివ్వడం అశాంతికి ఆజ్యం పోస్తున్నాయి. గత నెల ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు ప్రయోగించడం ఇక్కడి ఉద్రిక్తతల మరో కోణం. సిరియాలో తమ రాయబార కార్యాలయంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాడి చేసినందుకు ఇరాన్ నుంచి ఎదురైన ప్రతిఘటనే డ్రోన్ దాడి. తమ జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేయడమే రైసీ లక్ష్యం. దెబ్బకుదెబ్బ చెల్లించిన తర్వాత ఇరాన్ సంయమనం పాటించడం వెనుక రైసీ దార్శనికత ఉంది. ఆయన మృతి తర్వాత, చిరకాల శత్రువు ఇజ్రాయెల్‌పై ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడు మహమ్మద్ మొఖ్‌బెర్ దూకుడుగా వెళతారా లేక ఆచితూచి అడుగులు వేస్తారా అనేది ముఖ్యం. ఏమాత్రం తొందరపాటు ప్రదర్శించినా, పశ్చిమాసియా మొత్తం యుద్ధ భూమిగా మారుతుంది. రైసీ హెలికాప్టర్ ప్రమాదంలో కుట్ర దాగుందని ఇరాన్ అనుమానిస్తే, పరిస్థితులు మరింతగా దిగజారుతాయి. అమెరికాతో టెహ్రాన్ సంబంధాలు ఎప్పుడో దెబ్బతిన్నాయి. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి తర్వాత పతనం అంచున నిలిచాయి. ఇరాన్ అణ్వస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నదని అమెరికా అనుమానం. అవసరమైతే ఎంతకైనా తెగిస్తామని ఇరాన్ సమాధానం. ఇస్లామిక్ షరియా చట్టాలను తు.చ తప్పకుండా అమలు చేసే రైసీ పదవిలో ఉన్నంత కాలం అమెరికా, ఇరాన్ మధ్య సయోధ్యను ఊహించే సాహసం ఎవరూ చేయలేదు. 2021లో అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత, పశ్చిమాసియాలో వివాదాలు తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్ అంతరంగిక వ్యవహారాల్లో ఆయన వైఖరి వజ్రకఠినం. హిజాబ్‌కు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగసిపడిన ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసిన రైసీ, ఉద్యమకారులకు బహిరంగంగా ఉరివేసిన కాఠిన్యం. అంతర్గత సమస్యలను తొక్కిపెట్టి, అంతర్జాతీయ సంబంధాల్లో తనదైన ముద్ర వేసిన రైసీ మరణం తర్వాత ఇరాన్ ప్రయాణం ఎటువైపు అన్నది ప్రశ్న. ఇరాన్ విదేశీ వ్యవహారాలు తాత్కాలిక అధ్యక్షుడి కనుసన్నల్లో ఏ విధంగా మారతాయనేది మరో ప్రశ్న. ఇక, ఇరాన్‌తో భారత సంబంధాల అంశం కూడా చర్చకు వస్తున్నది. మధ్య ఆసియాతో వాణిజ్యాన్ని విస్తరించే లక్ష్యంతో చాబహార్ ఓడరేవును నిర్వహించడానికి ఇరాన్‌తో సుమారు వారం రోజుల క్రితమే భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పంద ప్రణాళిక 2003లోనే సిద్ధమైనప్పటికీ, ఇరాన్ అణు కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్న అనుమానంతో అమెరికా విధించిన ఆంక్షల నేపథ్యంలో వాయిదాపడుతూ వచ్చింది. ఇరాన్‌తో ఎలాంటి ఒప్పందం కుదుర్చుకున్నా, తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా పదే పదే హెచ్చరికలు జారీ చేస్తున్న తరుణంలో, భారత్ తీసుకున్న నిర్ణయ ప్రభావాన్ని ఇప్పటికిప్పుడు అంచనా వేయడం కష్టం. అమెరికా అహంకారపూరిత చర్యలను, ఆంక్షల హెచ్చరికలను పక్కనబెట్టి, ఇరాన్‌తో భారత్ కుదుర్చుకున్న చారిత్రక ఒప్పందం అమలుపై రైసీ అకాల మృతి ప్రభావం ఉండకపోవచ్చు. కానీ, ఎప్పుడు, ఏం జరుగుతుందో చెప్పలేని ఉద్రిక్త వాతావరణం... భారత్ కూడా ఆచితూచి వ్యవహరించాల్సిన తరుణం. అనంతరం భారత్‌లో వచ్చే రాజకీయ మార్పులపై కూడా ఇరాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు ఆధారపడతాయి. ప్రస్తుతానికి నిశ్శబ్ద నిరీక్షణమే ఏకైక మార్గం.

# ఒడిశాలో పట్నాయక్‌కు బిజెపి మద్దతు అనవసరం



**వికె పాండియన్ ఇంటర్వ్యూ**

ఒరిస్సాలో 90 శాతం గృహవినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలకు హామీ ఇవ్వటం వెనుక బలమైన ఆర్థిక వనరుల మద్దతు ఉందని, బిజూ జనతాదళ్ (బిజెడి) నాయకుడు 5 టి చైర్మన్ వికె పాండియన్ చెపుతున్నారు. ఒరిస్సా రాష్ట్రంలో 2 కోట్ల మంది మహిళలకు రూ.50వేల వంతున ఓచర్ ఇస్తామని బిజెపి ఎన్నికల హామీ ఇవ్వడం తనకు దిగ్భ్రాంతి కలిగిస్తోందని కూడా పాండియన్ అంటున్నారు. తనపై 'పరాయివాడు లేదా బయటి వ్యక్తి' అని ముద్రవేసి ప్రచారం చేయటంపై కూడా ఒడిశా ప్రజలే తీర్పు చెబుతారని కూడా ఈ విశ్రాంత ప్రభుత్వ ఉన్నతాధికారి అంటున్నారు. ఆ వివరాలు సంక్షిప్తంగా...

**ప్రశ్న :** మీరు ఒడియా రాష్ట్రీయుడు కాదన్న వాస్తవాన్ని ప్రస్తావిస్తూ ఒడియా స్వాభిమానం లేదా ఒడియా అస్మిత అనే పేరుతో బిజెపి విస్తృత ప్రచారం చేస్తోంది.

**సమాధానం :** ఎవరు బయటి వ్యక్తి అనే విషయాన్ని ప్రజలు నిర్ణయిస్తారు. నేను నా అంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించే ఇందులో పూర్తిగా నిమగ్నమయ్యాను. అంతేకాదు. ఒక రాష్ట్రం లేదా ఒక ప్రాంత ఆత్మాభిమానం 4 లేదా 5 అంశాలద్వారా నిర్ణయించబడుతుంది. మొట్టమొదటిది భాష. మార్చినెల 2014లో కేంద్రంలోని ఆనాటి యుపిఎ ప్రభుత్వం నవీన్ బాబు(ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్) విజ్ఞప్తికి అనుగుణంగా ఎన్నికలకు కొద్దిరోజులు ముందుగా ఒరియా భాషను ప్రాచీన భాషగా ప్రకటించింది. కానీ 10సంవత్సరాల ఎన్‌డిఎ ప్రభుత్వ పరిపాలనా కాలంలో, తెలుగు, సంస్కృతం, తమిళం తదితర భాషలకోసం చేసినంతగా ఒరియా భాషను ప్రోత్సహించటం కోసం ఏమీ చేయలేదు. రెండవది ఒడిస్సీ సంగీతానికి ప్రాచీన శాస్త్రీయ సంగీతహోదా ఇవ్వాలని ఓ ప్రతిపాదన చేశారు. కేంద్రప్రభుత్వం అందుకు అణుమాత్రం కూడా స్పందించలేదు. ఇక మూడవది, ఒక ప్రాంతానికి లభించే గుర్తింపు కూడా మీరు ఆ రాష్ట్ర నాయకులను ఎంతగా గౌరవిస్తున్నారనేదానిమీద కూడా ఆధారపడి ఉంది. బిజూబాబు(దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్) కేవలం మన దేశంలోనే కాదు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రముఖ వ్యక్తులలో ఒకరు. ఆయన కన్నుమూసినపుడు భౌతికకాయంపై నాలుగుదేశాల జాతీయ పతాకాలను ఉంచారు. అందులో ఇండోనేషియా జాతీయ పతాకం కూడా ఉంది. 1947లో ఆయన ఇండోనేషియా స్వాతంత్ర్య సమరయోధులను కాపాడారు. భారతదేశానికి ఆయన గొప్ప సేవ చేశారు. బంగ్లాదేశ్ యుద్ధం సమయంలో ఇండోనేషియా నౌకాదళ యూనిట్లను మోహరించకుండా అడ్డుకోవడంలో కావచ్చు లేదా శాస్త్రీయ విజ్ఞానానికి సామాన్య ప్రజల్లో ప్రాచుర్యం కల్పించేందుకు ఒక అంతర్జాతీయ అవార్డును నెలకొల్పడం కావచ్చు ఆయన సేవలు అనిర్వచనీయం. భారతదేశంలో అత్యంత ప్రగతిశీల రాష్ట్రాల్లో ఒకటిగా చేయడంలో ఆయన ఆధునిక ఒడిశా జాతిపిత. బిజెపి ప్రభుత్వం ఎంతోమందికి భారతరత్న అవార్డులు ఇచ్చింది. ఎవరెవరికి ఆ అవార్డులు ఇచ్చారనే జోలికి నేను వెళ్లడం లేదు. కానీ ఒడిశాలో భారతరత్న అవార్డు ఇవ్వటానికి ఎవరూ కేంద్రప్రభుత్వానికి కనిపించలేదా? పదేళ్లపాటు మొద్దునిద్ర పోయి ఆకస్మికంగా నిద్రలేచి ఎన్నికలకు కొద్దిరోజులముందు మీరు ఈ విషయాల గురించి మాట్లాడుతున్నారా?

ఇక నాలుగో విషయం ఒక ప్రాంత ఆత్మాభిమానం అనేది మీరు ఆ రాష్ట్రాన్ని ఏ విధంగా చూస్తున్నారు అనే దానిపై ఆధారపడి ఉంటుంది. 2004 నుంచి బొగ్గు యాజమాన్యహక్కులు, పన్ను పున: సమీక్ష గురించి మేం పోరాటం చేస్తున్నాం. కానీ అది నెరవేరలేదు. మహానది కోల్ ఫీల్డ్స్(ఎంసిఎల్) కేంద్రప్రభుత్వరంగ విభాగం. ఈ ఎంసిఎల్ ఒడిశా నుంచి రూ. 27,000 కోట్లు సంపాదించుకుంటోంది. కానీ ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు మాత్రం ముడుతున్నది కేవలం రూ.4,000కోట్లు మాత్రమే. ఆ విషయంలో మీరు ఏం చేయగలిగారు? మేం దాని గురించి అడుగుతున్నాం. భౌగోళికంగా ఒడిశా ఉన్న పరిస్థితులను బట్టి ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ గురించి మేం ప్రశ్నిస్తున్నాం. ఈ విషయంలో ఒడిశాకు ఒక ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వాలి. కానీ కేంద్రప్రభుత్వం పెదవి విప్పటం లేదు.

**ప్ర :** బిజెపి, బిజెడి పార్టీలు రెండూ ఎన్నికల పొత్తుపై చర్చలు జరిపాయి. దాని ఫలితం ఏమైంది?

**స :** నిజాయితీగా చెప్పాలంటే అది ఇద్దరు నాయకుల మధ్య జరిగిన సంభాషణ. రాష్ట్రం కోసం, దేశం కోసం, సంతృప్తికరంగా ఏదైనా చేయాలన్న ఉద్దేశంతో ఆ చర్చలు జరిగాయి. కానీ నవీన్ బాబుకు ఒడిశా రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి బిజెపి మద్దతు అవసరం లేదు. బహుశా బిజెపికి కూడా నవీన్ బాబు మద్దతు అవసరం లేదు.

**ప్ర:** ప్రజాజీవితంలో మసులుకునే నియమ నిబంధనలపై పట్నాయక్ మీకు బోధించిన గురుమంత్రం ఏమిటి?

**స:** మీ చెవులు ఎప్పుడూ నేలను తాకి ఉండాలి. ప్రజలు ప్రయోజనాలు సాధించటంకోసం మీ హృదయాన్ని అందుకు అనుగుణంగా మలచుకోవాలి.

**ప్ర:** పట్నాయక్ అడుగుజాడల్లో ఆయన చేయిపుచ్చుకుని ఆయన మార్గదర్శకత్వంలో ఈ కూటనీతికే అతీతంగా మీరు మమేకమైపోయారు. ఈ పాత్రను మీరు ఎలా పోషిస్తున్నారు?

**స :** నేను అలవాటుగా చేస్తున్నాను. 2000 సం.నుండి 2004 వరకు మధ్యకాలంలో ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా దీర్ఘకాలంగా ప్రతిపక్షం చేస్తున్నదే. ఎవరో ఒకరికి వ్యతిరేకంగా వాళ్లు ఈ పని చేశారు. 2004 నుండి 2011 వరకు ప్యారీ బాబు(ప్యారీ మోహన్ మహాపాత్ర)పై వాళ్లు దాడి చేశారు. కానీ నవీన్‌బాబు ఉనికి అనే పెద్ద విషయాన్ని వాళ్లు మరిచిపోయారు. ఇది నవీన్‌బాబుకు కూడా చాలా ఉపయోగపడింది. ఇది అలాంటిదే అయితే గనుక నేను చాలా సంతోషిస్తాను.

**ప్ర:** బిజెపి, కాంగ్రెస్ నాయకత్వాన గల ప్రతిపక్షానికి మీ పార్టీ సమానదూరం పాటిస్తోంది. ఎన్నికల తర్వాత వాళ్లు కోరితే మద్దతుకు మీరు అంగీకరిస్తారా?

**స :** ఇప్పటివరకు అయితే మనం ఎన్నికల ప్రక్రియ మధ్యలో ఉన్నాం. అందుచేత ఇలాంటి ఊహాజనితమైన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు.

**ప్ర:** గడచిన వారం రోజులుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పట్నాయక్‌కు వ్యతిరేకంగా చాలా తీవ్రమైన దాడి చేస్తున్నారు. ఇది చాలా అసాధారణంగా కనిపిస్తోంది.

**స :** జూన్ 10వ తేదీన బిజెపి పదవీ ప్రమాణ స్వీకారం చేస్తుందని నరేంద్రమోదీ చెబుతున్నారు. మేమైతే నవీన్‌బాబు ముఖ్యమంత్రిగా మళ్లీ ప్రమాణస్వీకారం చేయటానికి జూన్ 9వ తేదీ ఒక శుభదినంగా ప్రకటించాం. 2019లో నరేంద్రమోదీ 'వీడ్కోలు' అనే పదాన్ని ఉపయోగించారు. ఈసారి ఆయన 'ముగిసిన గడువుతేదీ' అనే పదాన్ని ఉపయోగించారు. కానీ నవీన్‌బాబు ఆనాడూ విజయం సాధించారు. మళ్లీ ఇప్పుడు కూడా ఆయన మరోసారి పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారు.

**ప్ర :** ఉచిత విద్యుత్ వాగ్దానం ద్వారా బిజూ జనతాదళ్ పార్టీ కూడా "ఉచితాలబాట" పట్టిందన్న ఆరోపణలు ఉన్నాయి?

**స :** ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ఇచ్చిన వాగ్దానం నెరవేర్చడానికి వీలైనన్ని ఆర్థిక వనరుల సామర్థ్యం ఒడిశా ప్రభుత్వానికి ఉంది. కానీ నాకు ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే 'ఉచితా సంస్కృతి'కి వ్యతిరేకమని బిజెపి ప్రకటించుకున్న తర్వాత కూడా ఆ పార్టీ ఉచిత హామీలు ఇస్తున్న తీరును చూస్తే నాకు చాలా ఆశ్చర్యం కలుగుతున్నది. ఒడిశాలో ఉన్న రెండు కోట్లమది మహిళలకు రూ.50,000 లు ఓచర్ ఇస్తామని ఎన్నికల ప్రణాళికలో ఒక హాస్యాస్పదమైన పథకాన్ని ప్రకటించారు. మొట్టమొదగా ఆలోచించాల్సింది అసలు ఆ ఓచర్ ఏమిటా అని? మనం ఏమీ షాపింగ్ మాల్ నడపడంలేదు. అదీకాకుండా మొత్తం ఒడిశా వార్షిక బడ్జెట్టే రెండు లక్షల కోట్ల రూపాయలు కాగా, అందులో సగం లక్షకోట్ల రూపాయలు ఈ హాస్యాస్పద పథకానికే ఖర్చవుతాయి. అభివృద్ధిక ఆర్థిక వ్యవస్థను ఇది వంచించడమే అవుతుంది. బిజెపి ప్రణాళికలన్నీ ఒడిశాను మరో 25 సంవత్సరాలు వెనక్కు నెట్టేసేవిగా ఉన్నాయి. ఒడిశాలో 90 శాతం గృహ వినియోగదారులకు బిజెడి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రకటించింది. ఒడిలశా మిగులు ఆదాయాలు చూస్తే రూ.25,000 కోట్లుగా ఉన్నాయి. దేశంలో ఈ విధంగా మిగులు ఆదాయాకలు ఉన్న అతి కొద్ది రాష్ట్రాలలో ఒడిశా కూడా ఒకటిగా ఉంది. ఈ ఉచిత విద్యుత్ పథకం కింద మాకు రూ.2,000 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుంది.

(హిందూ సౌజన్యంతో)

# విదేశాల్లో ఉద్యోగం.. అప్రమత్తత అవసరం

'విదేశాల్లో పెద్ద ఉద్యోగం. ఏసీ రూముల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ పని. రూ.లక్షల్లో సంపాదన' అని చెప్పి నిరుద్యోగ యువతను నమ్మించి విదేశీ ముఠాలకు విక్రయిస్తున్న ముగ్గురు సభ్యులను విశాఖ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. ఫారిన్ జాబ్స్ పేరుతో గతంలోనూ రష్యా ఆర్మీలో భారత యువతను చేర్పించిన విషయం బయటికొచ్చింది. అంతేకాకుండా చాలా మంది గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల పేరుతో విజిటింగ్ వీసాలపై పంపి మోసం చేస్తున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తూనే ఉన్నాయి. అందుకే విదేశాల్లో ఉద్యోగం అంటే ఒకటికి రెండు సార్లు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ముఠాలకు విక్రయించి.. మోసాలు

విశాఖలో వెలుగుచూసిన ఫారిన్ జాబ్ స్కామ్‌లో విస్తుగొలిపే విషయాలు వెలుగుచూశాయి. కంబోడియాలో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పని చేయడానికి పిలిచి.. వారిని చైనా కంపెనీ ఏజెంట్లకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అక్కడ వారితో జాబ్ స్కామ్‌లు, టాస్క్ గేమ్ వంటి సైబర్ ఫ్రాడ్స్ చేయిస్తున్నట్లు నిర్ధారించారు. రెండేళ్లలో ఏజెంట్ల ద్వారా తెలంగాణ, ఎపితోపాటు దేశవ్యాప్తంగా ఐదువేల మంది కంబోడియా వెళ్లినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. వీరిని చైనా ముఠాలు కొనుక్కొని.. సైబర్ నేరాలపై శిక్షణ ఇచ్చి మోసాలు చేయిస్తున్నట్లు గుర్తించారు. ఎవరైనా నిరాకరిస్తే చీకటి గదుల్లో పెట్టి చిత్రహింసలకు గుర్తిచేస్తున్నారని ఓ బాధితుడు పోలీసులకు తెలిపాడు. అంతేకాకుండా కొంత కాలం క్రితం రష్యాలో ఉద్యోగాల పేరిట కొందరు ఏజెంట్లు భారతీయులను తీసుకువెళ్లి రష్యా ఆర్మీలో సహాయ సిబ్బందిగా చేరుస్తున్నారని విదేశాంగ శాఖ గుర్తించింది. అలాంటి ఉద్యోగాల్లో చేరి తమ ప్రాణాలను ప్రమాదంలో పడేసుకోవద్దని హెచ్చరించింది.

### విజిటింగ్, స్టూడెంట్ వీసాలపై..

టర్కీ సమీపంలోని అజర్ బైజాన్‌కు 29 మందిని స్టూడెంట్ వీసాపై తీసుకెళ్లి.. ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేసిన ఘటన గతంలో శ్రీకాకుళంలో వెలుగుచూసింది. అక్కడి పోలీసులు గుర్తించి బాధితులను ఇండియాకు తిరిగి పంపించారు. విశాఖపట్నంలో ఓ కన్సల్టెన్సీ సంస్థ సౌదీలో రెండేళ్ల పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని 76 మంది నుంచి రూ. 60వేల చొప్పున వసూలు చేసింది. విజిటింగ్ వీసాపై సౌదీకి తీసుకెళ్లి పని కల్పించింది. అయితే ఆరు నెలలకే వీసా గడువు ముగియడంతో ఆ దేశం వారందరినీ ఇండియాకు వెనక్కి పంపించేసింది. బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు.

### డబ్బులు వసూలు చేసి..

విదేశాల్లో ఉద్యోగాల ఆశ చూపి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటనలు గతంలో అనేకం వెలుగుచూశాయి. స్వీడన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విశాఖలో ఓ సంస్థ నిరుద్యోగులకు టోకరా వేసింది. 70 మంది నుంచి రూ.కోటి వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. యూరప్, మలేషియా పంపిస్తామని ఏజెంట్లు మోసం చేశారని జగిత్యాలలో చాలా మంది పోలీసులను ఆశ్రయించారు. అంతేకాకుండా తెలంగాణ వంటి రాష్ట్రంలో గల్ఫ్ మోసాలు తరచూ బయటపడుతూనే ఉంటాయి. గల్ఫ్ పంపిస్తానని నిజామాబాద్ జిల్లాలో ఓ ఏజెంట్ రూ. 4 కోట్ల వరకు వసూలు చేసి పరారయ్యాడు.

### తరచూ హెచ్చరిస్తున్న విదేశీ మంత్రిత్వ శాఖ

విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలు ఎక్కువగా తూర్పు ఐరోపా దేశాలు, గల్ఫ్ కంట్రీస్, ఇజ్రాయెల్, కెనడా, మయన్మార్ వెళ్లే నిరుద్యోగులకు ఎదురవుతున్నట్లు భారత విదేశాంగ శాఖ గుర్తించింది. అందుకే విదేశాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు చేయాలనుకుంటే రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెంట్స్ ను మాత్రమే సంప్రదించాలని, చట్టపరమైన నిబంధనలను అనుసరించి మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచిస్తున్నది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడేవారు ఎక్కువగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారానే సంప్రదిస్తున్నారని, తమ ఆఫీసు అడ్రస్ గానీ, ఇంటి అడ్రస్‌గానీ తెలియనివ్వడం లేదని గుర్తించింది. అందుకే రిజిస్టర్డ్ ఏజెంట్లందరూ తమ కార్యాలయం ఎదుట ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్ ను కచ్చితంగా డిస్‌ప్లే చేయాలని కేంద్రం ఆదేశించింది. ప్రభుత్వ గుర్తింపులేని రిక్రూటింగ్ ఏజెంట్లెవరైనా నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి విదేశాలకు పంపిస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించింది. ఇమ్మిగ్రేషన్ చట్టం1983 ప్రకారం ఇది మానవ అక్రమ రవాణా కిందికి వస్తుందని స్పష్టం చేసింది.



### నిశిత పరిశీలన అవసరం..

మెరుగైన ఉపాధి కోసం చాలా మంది భారతీయులు విదేశాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే చాలా మంది నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోతూ, ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అందుకే విదేశీ ఉద్యోగ ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రిజిస్టర్ చేయని రిక్రూట్‌మెంట్ ఏజెంట్ల ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవద్దని పేర్కొంటున్నారు. ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారు ముందుగా ఏజెంట్ వివరాలను తెలుసుకోవాలి. విదేశాంగ శాఖలో ఏజెంట్‌గా నమోదు చేసుకున్నారా లేదా పరిశీలించాలి. ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ నంబర్ చెక్ చేయడానికి emigrate.gov.in అనే భారత ప్రభుత్వ వెబ్‌సైట్‌ను విజిట్ చేయాలి. అసలైన ఏజెంట్ల రిజిస్ట్రేషన్ నంబర్లు ఈ వెబ్‌సైట్‌లో లిస్ట్ అయి ఉంటాయి. అంతేకాకుండా ఆఫర్ లెటర్‌ను నిశితంగా పరిశీలించాలి. ఉద్యోగ నిబంధనలు, షరతులతో పాటు జీతం, జాబ్ కాంట్రాక్ట్ వివరాలు లేకుంటే ఆ ఆఫర్ లెటర్ మోసపూరితమని గ్రహించాలి.

**మహమ్మద్ ఆరిఫ్, 7013147990**

**మే 21 జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా..**

## ఉగ్రవాదంపై ఉక్కు పాదంమోపాలి




ఉగ్రవాదం సాధారణ పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగించి దేశ సార్వభౌమత్వానికి దెబ్బ తీయడానికి ప్రయత్నించే అనాగరిక చర్య. అధునాతన సాంకేతికతలు ఉపయోగించి ఉగ్రవాదులు దేశంలో ప్రతికూల పరిణామాలను కలుగజేస్తారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి చాలా పెట్టుబడి పెట్టాలి. అది నిఘా, మానవ శక్తి, ఆర్థిక వనరులు లేదా మరేదైనా రూపంలో కావచ్చు.

**జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం:** మద్రాసు సమీపంలోని శ్రీపెరంబుదూర్ అనే గ్రామంలో 1991 మే 21న హత్యకు గురైన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి జ్ఞాపకార్థం మే 21న జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని భారతదేశంలో జరుపుకుంటారు.

**ఈ దినోత్సవం యొక్క ప్రాముఖ్యత:** దేశం ప్రజలలో ఉగ్రవాదం, హింస ప్రమాదం గురించి అవగాహన కల్పించడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు.సమాజంపై ఉగ్రవాదం, హింస యొక్క దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించడం ఈ రోజు లక్ష్యం. ఇది శాంతిని ఎంచుకొని జాతీయ ఐక్యత సామరస్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలను ప్రోత్సహిస్తుంది. ఈ దినం పాటించడం వెనుక ఉన్న లక్ష్యం ఉగ్రవాదం, హింస నుండి ప్రజలను దూరం చేయడమే. ఉగ్రవాదాన్ని అన్ని రకాలుగా ఎదుర్కొనేందుకు భారత్ కృతనిశ్చయంతో ఉందని ఈ రోజు ప్రపంచమంతటా సందేశాన్ని పంపుతోంది. ఉగ్రవాదం లేని ప్రపంచం, దాని వినాశకరమైన ప్రభావం కోసం ఆశిస్తూ ఈ రోజు తీవ్రవాద బాధితులందరినీ గౌరవిస్తుంది.

**గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ (జిటిఐ)2024:** ఈ నివేదిక గత దశాబ్దంలో ఉగ్రవాదంలో కీలకమైన ప్రపంచ పోకడలు, నమూనాల సమగ్ర సారాంశాన్ని అందిస్తుంది. జిటిఐ ర్యాంకింగ్స్‌లో ఈ సంవత్సరం భారత్ మెరుగుపడింది. జిటిఐ 2024 ప్రకారం భారతదేశంలో ఉగ్రవాద మరణాల సంఖ్య తగ్గింది. ఈ సంవత్సరం జిటిఐ ర్యాంకింగ్లో 14వ స్థానంలో నిలిచింది. గత సంవత్సరంతో పోల్చితే ఒక స్థానం మెరుగుపడింది. రాను రాను మరణాల సంఖ్య తగ్గుతూ వస్తున్నాయి. 202021లో 49 మరణాలు, 202122లో 45 మరణాలు, 202223లో 18 మరణాలు తగ్గాయి. దక్షిణాసియాలో ఉన్న ఏడు దేశాలలో భారతదేశం మూడవ స్థానంలో ఉంది. ఒకటవ, రెండవ స్థానాలలో పాకిస్థాన్ (4), ఆఫ్ఘానిస్థాన్ (6) ర్యాంకుల్లో ఉన్నాయి. ఈ ప్రాంతంలో జిటిఐ స్కోరు సున్నా ఉన్న ఏకైక దేశం భూటాన్. ఇది గత ఐదేళ్లలో ఉగ్రవాద దాడిని నమోదు చేయలేదు.

**సాధారణంగా ఉగ్రవాదులు చేసే దాష్టీకాలు:** విమానాలను హైజాక్ చేయడం, రైల్వే ట్రాక్‌లను ధ్వంసం చేయడం, పౌరులను కిడ్నాప్ చేయడం, ఆత్మాహుతి దాడులు, ప్రార్థనా స్థలాలు, రవాణా వ్యవస్థలు, భద్రతా దళాలు, ఆర్థిక కేంద్రాలపై దాడులు, తీవ్ర హింస తర్వాత మతపరమైన అల్లర్లు సృష్టించి భయాందోళనలు కలిగిస్తారు.

**మనదేశంలో నిఘా వ్యవస్థలు:** నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కేంద్ర స్థాయిలో పని చేస్తున్న అగ్రగామి సంస్థ. ఉగ్రవాదానికి సంబంధించి ఏదైనా గూఢచారాన్ని సేకరించి విశ్లేషించడాన్ని ఇంటెలిజెన్స్ బ్యూరో చూస్తుంది. బాహ్య బెదిరింపులకు సంబంధించి నిఘాను సేకరించడం, సరిహద్దు కదలికలను నిరంతరం పర్యవేక్షించడం, విదేశీ ఏజెన్సీల సహకారంతో పనిచేయడం వంటివి రీసెర్చ్ అండ అనాలిసిస్ వింగ్ చేస్తుంది. ప్రత్యేక భద్రతా బలగాలు పారామిలటరీ బలగాలు పోలీసు బలగాలు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో చురుకైన ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఫైనాన్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ అనేది అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సమాచారాన్ని సేకరించి, మనీలాండరింగ్ కేసులు, ఉగ్రవాద సంస్థల మూలాలను ట్రాక్ చేస్తుంది. ఈ సంస్థలన్నీ సమన్వయంతో ఉగ్రవాదాన్ని మట్టు పెట్టడానికి నిరంతరం కృషి చేస్తుంటాయి. సైన్యం సాధారణంగా చివరి ప్రయత్నంగా ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో పాల్గొంటుంది.ం

**రూపుమాపడం:**

**ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి**

ప్రభుత్వానికి దేశ ప్రజలందరూ బాధ్యతగా సహకారం అందించాలి. ఇదే తీవ్రవాద నిరోధక చర్యలను పటిష్టం చేయడం కొనసాగిస్తే భవిష్యత్తులో మరింత మెరుగుదలను సాధించి మన దేశంలో ఉగ్రవాదం అంతం అవుతుందని ఆశిద్దాం.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

**లేఖలు**

# ఉచిత విద్య, ఉద్యోగం ఎక్కడ?

ఓట్లు పండుగ వచ్చిందంటే చాలు మేధావి వర్గం ప్రజలకు ఏం ఇవ్వాల్సిన అవసరం లేదు నాణ్యమైన విద్య, వైద్యం ఇస్తే చాలు అనే చర్చ చేస్తది. పాపం వారి మాటలు రాజకీయ పార్టీలకు రుచించవనుకోండి. రాజకీయ పార్టీలు మాత్రం విద్య, వైద్యం తప్ప అన్ని ఫ్రీగా ఇస్తాం అన్నట్లుగా మాట్లాడతాయి. జాతీయ విద్యా విధానం ప్రతిపాదించి, పార్లమెంట్‌లో ఆమోదించి, 60 ఏండ్లు గడిచినా, అనేక మంది పాలకులు మారిన దేశంలో నేటికి కామన్ స్కూల్ (కామన్ స్కూల్ ఎడ్యుకేషన్) అమలు నోచుకోని హామీగా, కలగానే మిగిలింది.

తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన మొదటి ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం కేజీ టు పీజీ అమలుకు నోసుకోలేదు. కేవలం గురుకులాలను ప్రోత్సహిస్తూ మిగతా బడులను నిర్లక్ష్యం చేసింది. కలెక్టర్ పిల్లవాడైన కడుపేద పిల్లవాడైన ఒకే బడిలో చదివేలా విద్యావిధానాన్ని రూపొందించి అమలు చేస్తామని నాడు హామీ ఇచ్చారు. విద్యారంగంలో ఉన్న వివిధ యాజమాన్యాలను ఒకే యాజమాన్యానికి కిందికి తీసుకవచ్చి కామన్ స్కూల్ సిస్టంగా ఏర్పాటు చేస్తామని (కేజీ టు పీజీ) చెప్పింది. ఒకే యాజమాన్యం ఒకే సిలబస్, అమీర్ నుంచి గరిబ్ అందరూ చదువుకునే చదివే కామన్ స్కూల్ ఎడ్యుకేషన్. నేటి ప్రభుత్వం మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ పెడతామని, వాటిలో మంచి వసతులు కల్పించి, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన విద్యను ఉచితంగా అందిస్తామని అంటుంది.

విద్యారంగంలో కామన్ స్కూల్ ఆశయాన్ని మొట్టమొదటిసారిగా 1964– 66లో ప్రస్తావించింది కొఠారి కమిషన్. దేశంలోని పాఠశాల విద్యారంగాన్ని, ఉన్నత విద్యారంగాన్ని పరిశీలించి తగిన సిఫారసులు చేయడం కొరకు నాటి యుజిసి చైర్మన్ డి ఎస్ కొఠారి అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది నాటి కేంద్ర ప్రభుత్వం. కొఠారి కమిషన్ ఏర్పడే నాటికి దేశవ్యాప్తంగా వివిధ యాజమాన్యాల కింద వివిధ రకాలుగా పాఠశాలలు నడపబడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థలు నడుపుతున్న పాఠశాలలు, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు స్వచ్ఛంద సంస్థ నడుపుతున్న పాఠశాలలు, కొన్ని గుర్తింపు లేని పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ విద్యారంగ విస్తరణ కోసం పాఠశాల సంఖ్యను పెంచడం కంటే కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, ఆవేశ ప్రాంత పాఠశాల విధానం మీద ఆధారపడి ఈ కామన్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉండాలని కొఠారి కమిషన్ చెప్పింది. 1968లో మొదటి జాతీయ విద్యా విధానంలో, 1986లో రెండవ విధానంలో, 1992లో సవరించిన సంస్కరణలో ఈ కామన్ స్కూల్ ఎడ్యుకేషన్ పొందుపరచబడింది. 1986, 1992 విధాన ప్రకటనలను పార్లమెంటు కూడా ఆమోదించింది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఏదో ఒక రూపంలో కామన్ స్కూల్ విధానం అమలులో ఉంది.

సమాజంలో ధనవంతులకు, పేదవారికి మధ్య చదువుకున్నవారికి చదువు రాని వారికి మధ్య వివిధ మతాల, కులాల మధ్య ఉన్న దూరం విద్యారంగాన్ని ప్రభావితం చేసిందని ఈ విభేదాలు అంతరాల్లో చిక్కుకొని ప్రజలు విభజింపబడి ఉన్నారని సామాజిక విభజన ఒక సాధారణ ప్రభుత్వ పాఠశాలను సమాజానికి దూరంగా ఉంచిందని కొఠారి కమిషన్ గ్రహించి, ప్రత్యామ్నాయంగా కామన్ స్కూల్ విధానాన్ని చూపింది. సామాజిక విభజనకు సంబంధించిన ప్రభావాలు పాఠశాల మీద పడకూడదని, పాఠశాల స్థానిక సమాజంతో సన్నిహితంగా కలిసిపోవాలని, సామాజిక భాగస్వామ్యం పెరిగి జాతీయ అభివృద్ధికి ముఖ్యంగా సామాజిక సమగ్రతకు, జాతీయ సమగ్రతకు దోహదపడాలని కొఠారి కమిషన్



భావించింది. కామన్ స్కూల్ విధానంలో ప్రభుత్వ పాఠశాలలకు స్థానిక సంస్థల పాఠశాలలకు మాత్రమే కాకుండా ప్రైవేట్ పాఠశాలలకు కూడా కొఠారి కమిషన్ చోటు కల్పించింది. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలు మాదిరిగానే పని చేస్తూ సేవా దృక్పథం కలిగి ఉండాలని భావించింది. ఆవాస ప్రాంత పాఠశాల విధానంలో ఒక పాఠశాలకు దాని ఆవాస ప్రాంతాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో ఉన్న విద్యార్థులందరూ కుల, మత, జాతితో సంబంధం లేకుండా ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా సామాజిక హోదాతో సంబంధం లేకుండా ఆవాస ప్రాంతంలో ఉన్న పాఠశాలలకు మాత్రమే వెళ్లాలి.

సమాజంలోని ఉన్నత వర్గాలకు చెందినవారు కూడా ఆవాస ప్రాంతం పాఠశాలకు రావడం వలన వారికి సాధారణ విద్యార్థులతో జీవిత అనుభవాలను పంచుకునే అవకాశం కలుగుతుందని, కుల మత తత్వాలకు అతీతంగా ప్రజల్లో లౌకికతత్వం పెరుగుతుందని భావించింది. ఆర్థికంగా సామాజికంగా పలుకుబడి కలిగిన వర్గాలకు చెందినవారు ఆవాస ప్రాంత పాఠశాలలకు రావడం వలన పలుకుబడి గల వర్గాలు కామన్ స్కూల్ మీద ఆవాస ప్రాంత పాఠశాలల మీద మొత్తంగా ప్రభుత్వ విద్యా రంగం మీద ఆసక్తి కలిగి ఉంటాయని కమిషన్ అభిప్రాయపడింది.

కామన్ స్కూల్ విధానం విద్యారంగంలో ఒక విప్లవం వంటిదని సమాజంలో జరగవలసిన సామాజిక ఆర్థిక సంస్కృతిక విప్లవాలకి అది బాట వేస్తుందని కొఠారి కమిషన్ భావించింది.ఈ కామన్ స్కూల్ లక్ష్య సాధన కోసం ప్రభుత్వాలకి కాలవ్యవధిని నిర్ణయించింది. దీర్ఘకాలికంగా 20 సంవత్సరాల కాలంలో కామన్ స్కూల్‌లు ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలని భావించింది. ఆ గడువు 1986తో ముగిసిపోయింది. ఇప్పటికీ పాలకులు పట్టించుకున్న దాకలాలు లేవు. కుల మతాల పేరుతో గురుకులాలను ఏర్పరచి పసిప్రాయంలోనే కులమత బీజాలను బాలలలో నాటుతున్నారు.

విద్య వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ 1980 దశకంలో ప్రారంభమైంది.1990లో విద్యా వ్యాపారం బాగా విస్తరించింది. నేడు విద్యారంగం ప్రైవేటు కార్పొరేటివ్ శక్తుల కదంబ హస్తాల్లో బంధీ అయి విలవిల లాడుతుంది. దేశంలోని ప్రజలకు కామన్ స్కూల్ కలగానే మిగిలిపోయింది.నూతన జాతీయ విద్యా విధానం (NEP 2020) ప్రకారం విద్య లో పెట్టిన పెట్టుబడులు మానవ వనరులు తయారు చేస్తాయని, అవి ప్రపంచ మార్కెట్ లను అభివృద్ధి పరుస్తాయని, నైపుణ్యవంతమైన ప్రపంచ స్థాయి విద్యార్థులను తయారు చేసే విధంగా రూపొందించబడింది. కామన్ స్కూల్ ఏర్పాటు దిశగా చర్యలు లేవు.

భారతదేశపు భవిష్యత్తు తరగతి గదిలో రూపొందుతుందని కొఠారి కమిషన్ ఆశించింది. ఆ తరగతి గది కులమతాలకతీతంగా, సామాజిక అసమానతలకతీతంగా రూపొంది జాతీయ సమగ్రతకు తోడ్పడుతుందని, లౌకికత్వాన్ని కలిగి ఉంటుందని కొఠారి కమిషన్ ఆశించింది. కమిషన్ ఏర్పడి 60 ఏళ్లు గడిచిన కమిషన్ ఆశయ సాధనకు నాటి నుండి నేటి వరకు చిత్తశుద్ధితో కృషి చేసిన పాలకులు లేరు స్వతంత్ర భారతంలో విద్యా కమిషన్లు ఏర్పాటు చేయడం కమిషన్ల ప్రతిపాదనలను పక్కన పెట్టడం జరుగుతూనే ఉంది. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా కామన్ స్కూల్ ఆశయాన్ని అమలు చేసే దిశగా, భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యసాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

మొన్నటివరకు కేజీ టూ పీజీ, నేడు ఇంటర్నేషనల్ స్కూల్ అంటూ పాలకులు మాట్లాడుతున్నారు. ఏండ్లుగా కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి, ప్రీ ప్రైమరీలను ప్రారంభించి, ఉన్నత పాఠశాలలను మినీ గురుకులాలుగా మార్చి,ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకొని, కుల,మత, సామాజిక ఆర్థిక అసమానతలకు అతీతంగా అందరికీ నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటే కామన్ స్కూల్ కల కొంతవరకైనా నిజమయ్యే అవకాశం ఉంటుంది.

**పాకాల శంకర్‌గౌడ్ 9848377734**

# ఎస్‌యులో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం విచారించాలి

'శాతవాహన' ఎదుట బోధనేతర సిబ్బంది నిరసన




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి** : శాతవాహన యూనివర్సిటీలో వైస్‌చాన్స్‌లర్ సంకశాల మల్లేష్ చేసిన జివో 1222లో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం విచారణ చేయాలని కోరుతూ యూనివర్సిటీ బోధనేతర సిబ్బంది సోమవారం ఎస్‌యు గేటు వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా బోధనేతర సిబ్బంది కుమార్, సతీష్, రమేష్‌లు మాట్లాడుతూ ఎస్‌యులో 2009 నుంచి పలు విభాగాల్లో మొత్తం 37 ఓది పనిచేస్తున్నామని, 2013లో యూనివర్సిటీ అన్ని హాస్టళ్లను కాంట్రాక్ట్ ఇచ్చి 59 మందిని చేశారని తెలిపారు. 2021లో వైస్‌చాన్స్‌లర్ సంకశాల మల్లేష్ వచ్చిన తర్వాత తమను మభ్యపెట్టి ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పిస్తామని ఆశ చూపి పాత జీవో స్థానంలో 2023లో కొత్త జీవో 1222 తీసుకువచ్చి దానిల్లో మమ్మల్ని కలిపి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి ఇచ్చారని పేర్కొన్నారు. అందులో విద్యార్హత , సీనియార్టీ ఉన్న వారిని పక్కనపెట్టి గత ప్రభుత్వ పెద్దల సిఫారసుతో 2022లో విసి నియమించుకున్న ఉద్యోగులను 1222 జీవోల కలిపి వారికి డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ప్రమోషన్ కల్పించారన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో పనిచేస్తున్న తమతో పాటు , గోధావరిఖని పిజి క్యాంపస్ ఉద్యోగులకు మాత్రం ఎలాంటి ప్రయోజనం చేయలేదని వాపోయారు. దయచేసి జివో 1222లో జరిగిన అవకతవకలపై తగు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని, విశ్వవిద్యాలయాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఐఐటి జెఇఇ బిఆర్క్, బి ప్లానింగ్ ఫలితాల్లో అల్ఫోర్స్‌కు అద్భుత ర్యాంకులు





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఐఐటి జెఇఇ2024 బి.ఆర్క్, బి.ప్లానింగ్ ఫలితాల్లో అల్ఫోర్స్ విధ్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయ స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వినాయక్ గుగులోత్ బిఆర్క్‌లో 403 వ ర్యాంకు, బి.ప్లానింగ్‌లో 375వ ర్యాంకు సాధించాడు. బిఆర్క్‌లో కె.హర్షితరెడ్డి 535,వై.శివమణి 936, ఎ.మౌనిక 1239, టి.పూజిత 1359, ఐ.యోషిత 2096, సి.అర్పిత 2439, ఎస్.సాయి ప్రసన్న 2511, ఆర్.మణిశ్రీ 3516 వ ర్యాంకు సాధించగా కె.శ్రేష్ట బిఆర్క్‌లో 4292 ర్యాంకు, బి.ప్లానింగ్‌లో 2498 వ ర్యాంకు సాధించింది. ఈ సంధర్భంగా విధ్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. పోటీ పరీక్షలలో అల్ఫోర్స్ విధ్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారని, పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విధ్యార్థుల పట్టుదల , అహర్నిషల కృషి వల్ల అల్ఫోర్స్ ఇంతటి ఘన విజయం సాధించగలిగిందని తెలియజేశారు. జాతీయస్థాయి అత్యున్నత ర్యాంకులు సాధించిన అల్ఫోర్స్ విధ్యార్థులను, వారి తల్లిదండ్రులను మన స్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. ఘనవిజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ధరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం / అయిజ :** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. రాములు తెలిపారు.ఇందులో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు విద్యార్థినీలు అర్హులని మొదటి విడత మే 31వ తేది వరకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. జూన్ 1వ తేది నుండి తరగతులు ప్రారంభం అవుతాయని, కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఈసి, హెచ్ఈసి గ్రూపులు ఉన్నాయి విద్యార్థులకు స్కాలర్‌షిప్, మరియు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామని ఆయన అన్నారు. కార్పోరేట్ కళాశాలలకు ధీటుగా నిలబడి వారితో సమానంగా ఉన్నత విద్యను అందిస్తూ విద్యార్థులకు ఎప్పటి కప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ పోటీ ప్రపంచంలో నిలబడేలా లెక్షరర్లుతో బోధన చేస్తున్నామని అన్నారు. అందుకు సాక్ష్యం కొన్ని సంవత్సరాలుగా మా కళాశాలలో విద్యార్థులు సాదించిన మార్కులే నిదర్శనమని అన్నారు.

# లాటరీ పద్ధతుల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల ఎంపిక



**ప్రజాపక్షం / గద్వాల :** జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేసేందుకు వివధ పోస్టులకు వచ్చిన ధరఖాస్తుల నుండి అర్హులైన అభ్యర్థులను నిబంధనల ప్రకారం సోమవారం పాత ఎంపిడిఓ కార్యాలయంలో లాటరీ పద్దతిలో ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ ( స్థానిక సంస్థలు) తెలిపారు. ఆయా పోస్టులకు సంబందించి జిల్లా సెలెక్షన్ కమిటి అధ్యక్షులు అపూర్వ చౌహాన్ ఎంపిక చేసేందుకు మొత్తం 24 పోస్టులకు గాను 2,370 ధనఖాస్తులు చేసుకున్నారు. ఇందులో డాటా ఎంట్రీ పోస్టులు 11, ఆఫీస్ సభార్డినేట్ పోస్టులు 9,లాబ్ అటెండెంట్ పోస్టులు 3, థియేటర్ పోస్టు 1,పోస్టుల కోసం ధరఖాస్తులు చేసుకోగా రోస్టర్ ప్రకారం రిజర్వేషన్ల వారిగా అభ్యర్థులను మీడియా ప్రతినిధుల సమక్ష్యంలో లాటరీ తీశారు. థియేటర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఉషారాణి, ల్యాబ్ అటెండెంట్ ఉద్యోగాలకు భవాని,సమ్రిన్ బేగం, ఎండి సమీర్‌లు, డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలకు సులోచన రాణి, పూజిత, జయలక్ష్మి , హారిక, లక్ష్మి ,శేఖర్ రెడ్డి, సువర్ణ, యశోద, ప్రసాదరావు,శైలజ, భాస్కర్,లు ఆఫీస్ సభార్డినేట్‌ల ఉద్యోగాలకు అనిత,సుందర్‌రాజు, కళావతి, మంజుల, సుమలత, అన్వర్ బాష, పుష్పలత, ఉమలత, రేవల్లె జనార్ధన్‌లు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈఓ కాంతమ్మ, ఎస్సీ కార్పోరేషన్ ఈడి,రమేష్‌బాబు, జిల్లా ఉపాధి కల్పనాధికారిని ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# నేడు హుజూర్‌నగర్‌లో కెటిఆర్ ప్రచారం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశంలో మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొనున్నట్లు నియోకవర్గ బిఆర్‌ఎస్ ఎన్నికల సమన్వయ ఇంచార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు.సోమవారం ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు సమావేశం ఉంటుందని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, పాల్గొంటారన్నారు.కార్యక్రమంలో జడ్‌పిటిసి కొప్పుల సైదిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, బిఆర్‌ఎస్ పట్టణ కార్యదర్శి బెల్లంకొండ అమర్,శ్రీహరి,ఇరుగు పిచ్చయ్య,గుగులోతు కృష్ణానాయక్, కోటానాయక్ పాల్గొన్నారు.

# నిలిచిపోయిన చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొంటుంది

టెస్కో ద్వారా పేరుకుపోయిన నిల్వ రూ.1.50 కోట్ల విలువైన చేనేత వస్త్రాల కొనుగోలుకు కృషి

మంత్రి తుమ్మల దృష్టికి కార్మికుల సమస్యలు

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెల్లడి




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను పేరుకుపోయిన నిల్వలను టెస్కో ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా కృషి చేసి చేనేత పరిశ్రమను ఆదుకుంటానని కార్మికుల క్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు. చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షుడు భారత లవ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి సోమవారం ఆయన హాజరయ్యారు. పోచంపల్లి చేనేత ముఖ్య కార్మిక ,వివిధ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. సహకార సంఘంలో జరిగిన సమావేశంలో ఆయన చేనేత పరిశ్రమ, కార్మికుల వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలనూ పేరుకుపోయిన వస్త్ర నిల్వల గురించి గత ప్రభుత్వంలో నిరాధారణకు గురైన విధానం గురించి, ఆయన ముందు చేనేత కార్మిక నాయకులు గోడు వెళ్ళబోసుకున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత పర్యటనలో సహకార సంఘం తరఫున చేనేత చీరల స్టాల్స్ ఏర్పాటుకు నోచుకోలేదని అవేదన వ్యక్తం చేశారు. కొందరు అధికారులు పనిగట్టుకొని సొసైటీని నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడు దయనీయ పరిస్థితుల్లో ఉన్న చేనేత పరిశ్రమను కార్మికులను ఆదుకోవాలని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని గత ప్రభుత్వ వైఫల్యంతో ఈ దుస్తితి వచ్చిందని అవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మిక సంఘ నాయకులు సహకార సంఘం నాయకుల ప్రధాన డిమాండ్ అయిన రూ.1.50 కోట్ల రూపాయల విలువ చేసే నిల్వలో ఉన్న చేనేత వస్త్రాలను టెస్కో ద్వారా ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో సొసైటీకి బకాయిలు ఉన్న డబ్బులు ప్రభుత్వం ద్వారా రావలసిన రిబేట్ డబ్బులను కూడా చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీ తగ్గింపు కేంద్ర పరిధి అని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందున చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి అవరోధంగా మారిందని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రతి సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. త్వరలో చేనేత కార్మికుల ముఖ్య నాయకుల సంఘ నాయకులతో రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఒక సమావేశం ఏర్పాటు చేసి చేనేత కార్మికుల సమస్యలను చెప్పుకొని చేనేత కార్మికుల సంక్షేమం కోసం అనుసరించవలసిన ప్రణాళికలు ప్రతి పాదనలు చేసుకునే అవకాశం కల్పిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పద్మశాలి వర్కింగ్ కమిటీ జిల్లా కన్వీనర్ తడక రమేష్, కౌన్సిలర్ భోగ భానుమతి విష్ణు, ఏడి విద్యాసాగర్, భారత వాసుదేవ్ వాసుదేవ్ సూరేపెల్లి శ్రీనివాస్, అంకం మురళి, గంజి కృష్ణ, దుద్యల పాపయ్య, భూషణం తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ దాడుల రిపోర్టును బహిర్గతం చేయాలి

విసిపై సిబిఐ విచారణ చేపట్టాలి

ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగుల అక్రమ బదిలీలు, నియమాకాలు, అక్రమ ప్రాజెక్టుల ఆమోదం తదితర అంశాలపై ప్రభుత్వం చేపట్టిన విజిలెన్స్ దాడుల రిపోర్టును బహిర్గతం చేసి కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పై సిబిఐ విచారణ చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ విసిగా 2021 మే లో బాధ్యతలు చేపట్టిన తాటికొండ రమేష్ పదేళ్ల అనుభవం లేకున్నా పైరవీలతో విసిగా నియమింపబడ్డారన్నారు. అప్పటి రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తో కలిసి ప్రొఫెసర్ల ప్రమోషన్లలో అక్రమాలకు పాల్పడ్డారని అనేక విమర్శలు వచ్చాయన్నారు. రూల్స్‌కు విరుద్ధంగా 16 మంది అర్జెంట్ ఫ్యాకల్టీలకు సుమారు నెలకు రూ. 8లక్షలు చెల్లించారని, ఎలాంటి క్లాసులు బోధించని ప్రొఫెసర్లకు సుమారు రూ. 98 లక్షలు చెల్లించారని రామకృష్ణ విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీ భూములు ప్రైవేటు వ్యక్తులు అక్రమిస్తున్నా చూసి చూడనట్లుగా వ్యవహరించారన్నారు. ఫేక్ ప్రాజెక్టుల పేరిట డబ్బుల వసూళ్లు, ఆర్ట్స్ కాలేజీ విద్యార్థుల ఫీజుల రూపంలో యూనివర్సిటీకి రావాల్సిన సుమారు రూ. 5కోట్లు స్వాహా చేసిన వారితో విసి కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపించాయన్నారు. నాక్ బృందం యూనివర్సిటీ సందర్శన సమయంలో తప్పుడు సమాచారం ఇవ్వడం, అర్హులైన ప్రొఫెసర్లకు పదోన్నతులు ఇవ్వకుండా అనర్హులకు పదోన్నతులు ఇవ్వడం ఆయనకు అనుకూలమైన వ్యక్తికి మూడు విభాగాలలో ఇంచార్జి బాధ్యతలు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటన్నింటిపై విజిలెన్స్ దాడులతో పాటు సిబిఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్టను దెబ్బతీస్తున్న విసి రమేష్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, చందులాల్, నవీన్, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నేనున్నాను.. మీ పిల్లలందర్నీ చదివిస్తా..



భర్తను కోల్పోయి దుఃఖంలో ఉన్న మహిళకు మంత్రి కోమటిరెడ్డి హామీ

**ప్రజాపక్షం/భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన మంత్రి మార్గమధ్యలో కార్యకర్తల అభ్యర్థన మేరకు భువనగిరి పట్టణ బైపాస్ రోడ్డులో వివేరా హోటల్ దగ్గర ఆగారు కార్యకర్తలతో మాట్లాడి బయటకు వస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ముగ్గురు పిల్లలతో దీనంగా ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా, మోత్కూరు మండలం, ఆరేగూడెం గ్రామానికి చెందిన మమత అనే మహిళను చూసి ఏ ఊరమ్మా అంటూ అడిగారు. మంత్రి పలకరింపుతో దుఃఖాన్ని దిగమింగుకుంటూ తన భర్త హార్ట్ స్ట్రోక్‌తో చనిపోయాడని, ముగ్గురు పిల్లల్ని చదవించడం, కుటుంబాన్ని పోషించడం ఇబ్బందిగా మారిందంటూ తన దీనగాథను మొత్తం మంత్రికి వివరించింది. చలించిపోయిన మంత్రి పిల్లలను ఎంత చదివితే అంతవరకు తానే చదివిస్తానని, ప్రస్తుతం కుటుంబ పోషణ కోసం ఆర్థిక భరోసా కల్పించారు. మంత్రి సాయంతో భావోద్వేగానికిగురైన మమత ఆ దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలంటూ చేతులెత్తి వేడుకుంది. ఏదో ప్రభుత్వ సాయం కోసం అడుగుదామని వస్తే మా జీవితాలను మార్చివేశాడని సంతోషం వ్యక్తం చేసింది. ఈకార్యక్రమంలో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మి నరసింహా రెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, మోత్కూరు పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, మెంట నగేష్, గొలుసుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఉచితాలు సరే.. బస్సులేవి?

బస్సుల సంఖ్య పెరగక ప్రయాణికులు, సిబ్బంది సతమతం

సిబ్బందికి పెరిగిన పని భారం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో తొలిసారిగా డిసెంబరు తొమ్మిది నుంచి ఆర్టిసి బస్సులలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. పల్లె వెలుగుతో పాటు ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోను తెలంగాణ రాష్ట్ర మంతటా ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం మహిళలకు కల్పించారు. ఉచిత బస్సు ద్వారా ప్రయాణించడం వరకు బాగానే ఉంది కాని ఉచిత బస్సు సౌకర్యం తర్వాత బస్సుల సంఖ్యను పెంచకపోవడం, అటు ప్రయాణికులకు ఇటు సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. బస్సుల సంఖ్య సరిపడ లేకపోవడంతో బస్టాండ్ కిక్కిరిసిపోతున్నాయి. 55 మంది ప్రయాణించాల్సిన బస్సులో 110 నుంచి 120 మంది ప్రయాణిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అవగతం చేసుకోవచ్చు. సోమవారం ఖమ్మం బస్టాండ్‌లో 80 మందితో బయలు దేరిన భద్రాచలం డిపో బస్సు ఖమ్మం నగరం దాటే సరికి 115 మంది ప్రయాణికులకు చేరుకుంది. భద్రాచలం వెళ్లెంత వరకు దిగి ఎక్కే సమయాల్లో ఒకరిద్దరు పెరిగారు తప్ప తగ్గలేదంటే అతిశయోక్తి కాదు. రెండు వరుసల్లో వెనక సీటు నుంచి దిగే మెట్ల వరకు కిక్కిరిసిపోతున్నారు. ఇక బస్టాండ్లు కొన్ని సందర్భాలలో జాతరను తలపిస్తున్నాయి. ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన ప్రభుత్వం ఆ రీతిలో బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి రెండు మూడు గంటలు వేచి చూసినా బస్సు ఎక్కే పరిస్థితి లేదు. బస్సులో కాలు మోపడానికి కూడా సందు ఉండడం లేదు. దీనితో వేలాడుతూ చేసే ప్రయాణం ప్రాణాల మీదకు తీసుకు వస్తుంది. మెట్ల మీద ప్రయాణిస్తూ ఓ మహిళ జారి కింద పడి ప్రాణాలను కోల్పోయింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ప్రయాణికుల ఇబ్బందులు ఈవిధంగా ఉంటే సిబ్బంది తిప్పలు వర్ణణాతీతం. 100 మందికి పైబడిన బస్సులో టికెట్లు ఇచ్చేందుకు కండక్టర్లకు ముందుకు కదిలే అవకాశమే లేదు. ప్రయాణికులు పూర్తి స్థాయిలో సహకరించకపోవడంతో కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే సిబ్బంది కొరత కారణంగా పని గంటల కాలం పెరగడం దానికి తోడు కిక్కిరిసిన ప్రయాణికులతో సతమతమవుతున్నారు. డ్రైవర్ల ఇబ్బందులు మరో రకంగా ఉన్నాయి. డోరులో కూడా నిలబడి ప్రయాణిస్తున్న కారణంగా ఎడమ వైపు రోడ్డు కనిపించడం లేదని ప్రమాదం జరిగితే కేసులు నమోదు అవుతున్నాయని వాపోతున్నారు. దీనికి తోడు కిక్కిరిసిన బస్సులు స్టేజీలలో ఎలా ఆపుతారంటూ బస్సులో ఉన్న వారు తమతో ఘర్షణ పడుతున్నారని ఆపకపోతే రోడ్డుపై అడ్డంగా నిలబడి అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడులకు తెగబడుతున్నారని పల్లె వెలుగు నడిపే ఓ డ్రైవర్ వాపోయాడు. ఈ విషయంలో మిగిలిన డ్రైవర్ల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ప్రభుత్వం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తక్షణం బస్సుల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఉచిత హామీతో సిబ్బంది పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది నియమాకం జరపాల్సి ఉంది. కండక్టర్లు, డ్రైవర్లతో పాటు మెకానికల్ ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉంది. మండుటెండల్లో ప్రయాణికులను చేరవేస్తున్న సిబ్బందికి తగిన విధంగా ప్రోత్సహాకాలు అందించాలని కోరుతున్నారు. దాంతో పాటు ప్రభుత్వం ఆర్టిసిని విలీనం చేస్తున్నట్లు ప్రకటించిన ఇంత వరకు అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించ లేదని వెంటనే ప్రకటించాలని బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న డిఏలు ఇతరత్రా బకాయి పడిన ఆర్థిక అంశాలను తక్షణం పరిష్కరించాలని కోరుతున్నారు.

# అధికారికంగా టిజి అమలు

జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టర్ :** ప్రభుత్వ ఆదేశాలతో ఇకపై టిఎస్‌కు బదులు టిజి అని అధికారికంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, అధికారిక పత్రాలు(లెటర్ హెడ్, రిపోర్ట్సు, నోటిఫికేషన్ ఇతరాత్ర) ప్రభుత్వ కార్యాలయాలు, వెబ్ సైట్లు, ఆన్లైన్ ప్లాట్ఫామ్‌తో పాటు ఇతర అధికారిక సంప్రదింపుల్లో టిజి అని అమలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రధాన అధికారి కమ్యూనికేషన్ అంతర్గతంగా, బహిర్గతంగా టిజి అని ఉపయోగించాలని, టిజిగా నవీకరించిన ప్రచురించిన సామాగ్రిని వినియోగించాలన్నారు.

# రైతుసంఘం నేతను పరామర్శించిన పోటు ప్రసాద్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకులు కొప్పోజు సూర్యనారాయణను సోమవారం సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, సీనియర్ నాయకులు అడపా రామకోటయ్య పరామర్శించారు. ఖమ్మంలోని శ్రీరాం హిల్స్‌లో కుమారుని ఇంటి వద్ద ఉన్న సూర్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనను పరామర్శించిన వారిలో సూర్యాపేట జిల్లా రైతు సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీలు పకడ్బందీగా చేపట్టాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టర్ :** జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెటరీ పరీక్షల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి ఈనెల 24తేదీ నుండి జూన్ 3తేదీ వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఏలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్, ప్రథమ చికిత్స కేంద్రం, తాగునటీ సౌకర్యం కల్పించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి జీరాక్స్ కేంద్రాలు మూసివేయాలన్నారు. సూర్యాపేటలో 8 పరీక్ష కేంద్రాలు, తుంగతుర్తి, తిరుమలగిరి, నెమ్మికల్, నడిగూడెం, నెరేడుచర్ల, మఠంపల్లిలో ఒక్కోక్క కేంద్రం, కోదాడలో 5, హుజూర్‌నగర్‌లో రెండు కేంద్రాల చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 4తేదీ నుండి 8వ తేదీ వరకు ఉదయం నిర్వహించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్‌లను ప్లేయింగ్ స్క్వాడ్‌లుగా నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో పోలీసులు బందోబస్తు చేపట్టాలని సూచించారు. డిఐఈఓ కృష్ణయ్య, సెక్షన్ పర్యవేక్షకులు పద్మరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కలెక్టర్ హనుమంతు జెండగే



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అరికట్టడంలో డీలర్లు సహకరించాలని అన్నారు. కలెక్టరేటు సమావేశ మందిరంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర,జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తో కలిసి జిల్లాలోని విత్తన డీలర్లతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వానకాలం సీజన్ సంబంధించి రైతాంగానికి నాణ్యతతో కూడిన వితనాలను మాత్రమే డీలర్లు విక్రయాలు చేయాలని అన్నారు. రైతులు నష్టపోకుండా, నకిలీ విత్తనాల బారిన పడకుండా డీలర్లు సహకరించాలని, అమ్మకాలకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలని, ఎం.ఆర్.పి. రేట్లకంటే ఎక్కువ అమ్మకూడదని, లేబుల్ లేకుండా అమ్మకూడదని సూచించారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలు మార్కెట్లలోనికి రాకుండా నివారించేందుకు నాలుగు మండలాలకు ఒకటి చొప్పున 4 టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు, ప్రతి టీములో ఒక వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఇద్దరు అగ్రికల్చర్ ఆఫీసర్స్, ఇద్దరు పోలీసు అధికారులు ఉంటారని అన్నారు. ఎరువులు, విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తారని, లైసెన్సు లేకుండా విత్తనాలు అమ్మినా, మధ్య దళారులు విత్తనాలు అమ్మినా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. హెచ్.టి.కాటన్ (కలుపు మందును తట్టుకునే ఒక రకం) విత్తనాలకు మన దేశంలో అనుమతి లేదని, అమ్మితే పి.డి. యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే లూజ్ విత్తనాలు, ఎక్స్పైరీ దాటిన విత్తనాలు అమ్మినా చర్యలు ఉంటాయని తెలిపారు. డీలర్లు తమ షాపులలో రిజిష్టర్లు, బిల్స్ సరిగా నిర్వహించాలని, నిఘా బృందాలకు చూపించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విత్తనాలు, ఎరువులు అమ్మాలని, ఇ పాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు జరుగాలని సూచించారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు నకిలీ విత్తనాల పట్ల కలిగే నష్టాలపై, మేలు రకం బ్రాండెడ్ విత్తనాల ద్వారా వచ్చే లాభాలను వివరించాలని, వ్యవసాయ అధికారులు జర్మినేషన్ వస్తుందా లేదా తెలుసుకోవడానికి నాణ్యతా పరీక్షల కోసం విత్తన షాంపుల్స్ హైదరాబాదు రాజేంద్రనగర్ విత్తన పరీక్షా కేంద్రానికి పంపాలని సూచించారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ డీలర్లందరూ వ్యవసాయ, పోలీస్ శాఖలకు సహకరించాలని, రైతులకు మేలు చేయాలని అన్నారు. ముఖ్యంగా చట్టం గురించి అందరూ తెలుసుకోవాలని, విత్తనాలు అక్రమంగా స్టోర్ చేసినా, రవాణా చేసినా, లూజుగా అమ్మినా జరిమానాతో పాటు శిక్షకు కూడా గురికావాల్సి వస్తుందని చెప్పారు.ప్రతి ఏడాది రాచకొండ పరిధిలో రైతులను మోసం చేస్తున్న వారిపై పి.డి. యాక్ట్ నమోదు చేసామని,నకిలీ విత్తనాలపై నిఘా ఉందన్నారు.ఎవరైనా రైతులను మోసం చేస్తున్న విషయం తెలిస్తే పోలీస్ శాఖకు టోల్ ఫ్రీ ద్వారా తెలుపాలని, తద్వారా రైతులకు మేలు చేసిన వారవుతారని డీలర్లను కోరారు. సీడ్ సరిగా లేక రైతులకు పంట దిగుబడి సరిగా రాకపోతే కూడా పంట పరిశీలించి అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు అందరూ ప్రభుత్వం సూచించిన బ్రాండెడ్ విత్తనాలని అమ్మాలని, రైతు క్షేమం కోసం అందరూ సహకరించాలని కోరారు. జిల్లాలోని నేషనల్ హైవేలపై నకిలీ విత్తన రవాణా జరుగకుండా నిఘా పెట్టడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు దేవీసింగ్, పద్మావతి, వెంకటేశ్వర్లు, నీలిమ, జిల్లా విత్తన డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు బజ్జూరి రవి, పడిగెల రాజేశ్వర్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# మేధావి వర్గం ఆలోచించి ఓటు వేయాలి

మాజీ మంత్రి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పట్టభద్రులను ఓటు అడిగే హక్కు లేదని ఆశ చూపి ఉద్యోగుల, నిరుద్యోగుల ఆశలను ఆడిఆశలు చేశారని బిజెపి నాయకులు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి నాలుగు వేలు ఇవ్వకుండా ఏ ముఖం పెట్టుకుని నిరుద్యోగులను ఓట్లు అడుగుతారని రాజేందర్ ప్రశ్నించారు. నిరుద్యోగులకు నాలుగు డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పిఆర్‌సి ఊసే లేదని పిఆర్‌సి బకాయిలు చెల్లించకుండా ఓట్లు ఎలా అడుగుతారని ఆయన అన్నారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డు ఎక్కడ పని చేయడం లేదని ఆసుపత్రికి బకాయిలు చెల్లించకపోవడం వల్ల సౌకర్యాలు పొందలేక పోతున్నారని ఆయన తెలిపారు. కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలను బెదిరించి ఓటు వేయించాలని మంత్రులు చెబుతున్నారని ఈ సందర్భంగా విద్యా సంస్థల యాజమాన్యాలు సైతం ఆలోచన చేయాలని, రూ. 7,500 కోట్ల బకాయిలు విడుదల చేయలేదని ఆర్థిక ఇబ్బందుల్లో సంస్థలు నడుపుతున్న యాజమాన్యం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలన్నారు. ఆరు నెలలుగా డయాగ్నస్టిక్ సెంటర్లలో పని చేస్తున్న వారికి వేతనాలు రావడం లేదని చిన్న ఉద్యోగులకు ప్రతి నెల వేతనాలు చెల్లించాలని రాజేందర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనతికాలంలోనే ప్రజల చిత్కరణకు గురవుతున్నారని రాష్ట్రంలో మహిళలకు నెలకు రూ. 2,500 ఇవ్వలేని ప్రభుత్వం రూ.8,500లను దేశ మంతటా ఎలా ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. మోసపు మాటలు చెప్పడంలో కాంగ్రెస్ నేతలు సిద్ధహస్తులని ఇటువంటి సమయంలో మేధావి వర్గం ఆలోచించి బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించి శాసన మండలికి పంపించాలని ఆయన కోరారు. మీడియా సమావేశంలో బిజెపి నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, వినోదరావు, గెంటెల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## 24న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** ఈ నెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా డిప్లమా కోర్సులలో ప్రవేశానికి పాలిసెట్ 2024 ఎంట్రన్స్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పాలిసెట్ 2024 ములుగు జిల్లా కోఆర్డినేటర్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ములుగు ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం పేర్కొన్నారు. జిల్లాలో రెండు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ డిగీ కళాశాల ములుగు నందు ఒక సెంటర్, టిఎస్ మోడల్ స్కూల్ బండారుపల్లి నందు మరో సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రెండు సెంటర్లలో ఇప్పటి వరకు 675 మంది విద్యార్థులను కేటాయించినట్లు తెలిపారు. ఈ పరీక్ష 24న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుంది. పరీక్షకు ఒక నిముషం ఆలస్యమైనా అనుమతించబడదన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



**ప్రజాపక్షం/నెక్కొండః**రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించినా, నాసిరకం ఎరువులు అమ్మినా, సంబంధిత దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, వారిపై పిడి యాక్ట్ నమోదు చేయాల్సి ఉంటుందని నెక్కొండ సిఐ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్ దుఖానదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అరికట్టడంలో వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్, ఇతర ప్రభుత్వ శాఖల ప్రత్యేక నిఘా ఏర్పాటు ఉంటుందని, ఎప్పటికప్పుడు ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ షాప్స్‌ను తనిఖీ నిర్వహిస్తామని, లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిపై, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామని సిఐ తెలిపారు. నెక్కొండ మండల వ్యవసాయ అధికారి , ఏఈఓలు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం కొనాల్సిందే



**ప్రజాపక్షం/శివ్వంపేట :** రైతులు పండించిన వరి ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులు పండించిన అన్ని రకాల పంటలకు రూ. 500 బోనస్ ఇస్తామని, నేడు సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పి సన్నవడ్లకే 500 బోనస్ ఇస్తామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. రైతులు పండించిన తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని లేని పక్షంలో వందలమంది రైతులతో రహదారులను దిగ్బంధిస్తామని అన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ నువ్వుల దశరథ, మాజీ సర్పంచ్‌లు బాలమణి నరేందర్, హర్జ్యనాయక్, నారాయణరావు, పాపారావు, రైతులు ఉన్నారు.

## ఆత్మహత్య కేసులో సుమన్ అరెస్ట్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని పడమటి కేశవాపూర్ గ్రామానికి చెందినరైతు కొమ్మాట రఘుపతి ఆత్మహత్య చేసుకున్న కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడైన సీనియర్ అసిస్టెంట్ కొలిపాక సుమన్‌ను సోమవారం అరెస్టు చేసి అతని వద్ద నుండి ఒక సెల్ ఫోన్, రూ.60వేల నగదును సీజ్ చేసి కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడం జరిగిందని ఎస్ఐ సతీష్ తెలిపారు.

## ఏడుపాయల హుండీ ఆదాయం లెక్కింపు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా మాత ఆలయ హుండీ సోమవారం గోకుల్ షెడ్‌లో జరిగింది. హుండీ ఆదాయం 47 లక్షల 50 వేలు 681 రూపాయల ఆదాయం వచ్చినట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయక కమిషనర్ శివరాజ్, ఇన్స్పెక్టర్ రంగారావు వెల్లడించారు. సిరిసిల్లకు చెందిన రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది లెక్కించారు.గడిచిన 70రోజులహుండీనిలెక్కించగా రూ.47,50,681 ఆదాయం సమకూరింది. బంగారం, వెండి ఆభరణాలను తిరిగిహుండీలోనేవేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.మోహన్ రెడ్డి, పాలకమండలి చైర్మన్ సాతెల్లి బాలా గౌడ్, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు. ఎస్సై నరేష్, సిబ్బంది ఆధ్వర్యంలో పర్యవేక్షణ కొనసాగింది.

## ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రజల సమస్యల పరిష్కారానికి పోలిసు అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసి బాధితులకు అండగా ఉంటూ, పిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల నుంచి వచ్చిన 13 మంది పిర్యాదుదారుల నుంచి ఎస్పి ఫిర్యాదులను స్వీకరించి, ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులు సత్వరంగా పరిష్కరించాలని ఎస్పి ఆదేశించారు. పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని పరిష్కరించడం, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సివిల్ వివాదాలను కోర్టులోనే పరిష్కరించుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతల పరిస్థితులకు భంగం కలిగించేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎస్పి కిరణ్ ఖరే పోలిసు అధికారులను ఆదేశించారు.

## పంట నష్టపరిహారం కోసం వినతి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం కారణంగా భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో దెబ్బతిన్న వరి పంటలకు నష్టపరిహారం అందించి నియోజకవర్గ రైతులను ఆదుకోవాలని తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని రాష్ట్ర సచివాలయంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరంలో ట్రైనీ అధికారుల బృందం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సోమవారం కేంద్ర అసిస్టెంట్ సెక్షన్ శిక్షణ అధికారుల బృందం పర్యటించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా కాళేశ్వరం ఎస్సీ కాలనీ సందర్శించి స్థానిక ప్రజల స్థితిగతులు తదితర అంశాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారులు అంకిత్ గుప్తా, సాహిల్, రిత్విక్, అన్సుల్ జైన్, అధిత్ సోని బృందం వెంట స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కారోబార్ సాయి ఉన్నారు.

# ఈ ఏడాదైనా సాగు కలిసొచ్చేనా...

### సాగుకు సిద్ధమవుతున్న రైతన్న

### అకాల వర్షాలకు మెట్ట దుక్కులు



**ప్రజాపక్షం/ఖమ్మం:** వ్యవసాయం జూదంగా మారింది. ఆరుగాలం కష్టపడిన పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందో రాదో తెలియని దయనీయ స్థితి. ఒక్కో ఏడాది ఒక్కో రకమైన చేదు ఫలితాలను రైతాంగానికి మిగులుస్తుంది. సహకరించని ప్రకృతి, కనికరించని పాలకుల నడుమ వ్యవసాయం మరింత మరింత సంక్షోభంలోకి కూరుకుపోతుంది. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు రైతులను కోలుకోలేనివిధంగా దెబ్బతీశాయి. వానాకాలం పంట పోయిందనుకుని కొంత మంది యాసంగి సాగు చేస్తే యాసంగిలోను అదే పరిస్థితి. పంట చేతికొచ్చే దశలో అకాలవర్షాలు రైతులను దెబ్బతీశాయి. ఒక ఏడాది పండితే రెండేళ్ల ఎండుదు రైతులకు శాపంగా మారింది. అయినా వ్యవసాయం తప్ప మరో పని చేయలేని వారు మరో మారు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇక చిన్న, సన్నకారు రైతులు పాలకుల పుణ్యమా అని కూలీలుగా పట్టణాలకు వలస వెళ్లిపోయారు. ఆటో కార్మికులు, గుమస్తాలుగా, అడ్డా పై కూలీలుగా జీవిస్తున్నారు. విధి ని పరిస్థితిలో సాగుపై ఆధారపడి కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి దయనీయం. గతేడాది కౌలు రైతులు నిండా మునిగారు. అయినా ఈ ఏడాది కూడా మరోసారి సాగు చేసుకునేందుకు గత అప్పులు తీర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గత వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు రైతులు మెట్ట దుక్కులను సిద్ధం చేస్తున్నారు. గతేడాది వేసిన పంట అవశేషాలను తొలగించి దుక్కులు దున్నుతున్నారు. వరణుడు గతేడాది ఇబ్బంది పెట్టినా ఈ ఏడాదైనా కరుణించకపోతాడన్న ఆశ రైతులను సాగుకు సమాయత్తం చేస్తుంది. కౌలు రైతులు సైతం మరోసారి అప్పు తెచ్చి భూ యజమానులకు చెల్లించి దుక్కులు మొదలుపెడుతున్నారు.

### రుణమాఫీ ముందే ఇస్తే ...

గతేడాది పెట్టిన పెట్టుబడి తిరిగి రాలేదు. వ్యవసాయోత్పత్తులను విక్రయిస్తే ఖర్చులు కూడా తిరని పరిస్థితి. మరల ఈ ఏడాది పెట్టుబడులు పెట్టాలంటే ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించక తప్పని స్థితి. గతేడాది 60 నుంచి 70 శాతం మంది రైతులు ప్రైవేటుగా తెచ్చిన అప్పులను చెల్లించలేకపోయారు. మరల వారి వద్దనో లేక ఇతరుల వద్దనో వడ్డీకి తెచ్చి పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలోగతంలోఉన్నరుణాలదృష్ట్యా బ్యాంకులు అప్పులు ఇచ్చే పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినట్లు ఆగస్టు 15 నాటికి అంటే వానాకాలం పంటకు సంబంధించి తొలిదశ పెట్టుబడి పూర్తవుతుంది. రుణమాఫీ జూన్‌లో పూర్తి చేస్తే కొత్త రుణాలు పొంది పెట్టుబడులకు వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ విషయమై ప్రభుత్వం ఆలోచన చేయాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికేపెట్టుబడులతోఇబ్బంది పడుతున్నామన్నారు.

## ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జిల్లాలో జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షల కోసం పకడ్బంది ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వార్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏసిపి అంకిత్‌కుమార్ శంక్వార్‌తో కలిసి ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్, సప్లమెంటరీ పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వయించారు.కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24 నుండి జూన్ 1 వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్, సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందు కోసం జిల్లాలో 11 సెంట్లు ఏర్పాటు చేయడం లజరిఇందన్నారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 1879 మంది, వొకేషనరల్ విద్యార్థులు 505 మంది మొత్తం 2వేల 384 మంది కాగా ద్వితియ సంవత్సరం జనరల్ విద్యార్థులు 1230 మంది, ఒకేషనల్ విద్యార్థులు 376 మొత్తం 1606 కాగా మొత్తం 3వేల 990 మంది పరీక్షలు వ్రాయనున్నారన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి మద్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మద్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. డిఐఈఓ ఆంజనేయరాజు, ఆర్‌డిఓలు కొమురయ్య, వెంకన్న, డిఈఓ రాము, డిఎంహెచ్ఓ హరీష్‌రాజ్, ఆర్‌టిసి డిఎం జ్యోత్స్నతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పోస్టల్ బ్యాలెట్ కోసం ఓటర్ ఫెసిలిటేషన్ ప్రారంభం**

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకోవడం కోసం జిల్లా కలెక్టరేటేలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నిక ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే వారి కోసం ఈ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## ఓట్ల లెక్కింపు కేంద్రాలవద్ద భారీభద్రత

### మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్:**పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ నోడల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాలు నందు అదనపు కలెక్టర్లు లోకల్ బాడీస్, రెవెన్యూ లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్ లతో కలిసి సంబంధిత నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారి పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి ఓట్ల లెక్కింపు ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందిని నియమించాలన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్స్ వంటి మెటీరియల్ సిద్ధం చేయాలని మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారికి సూచించారు. ఓట్ల లెక్కింపు హాళ్లలో బారికేడింగ్ పనులు చేపట్టాలని, సిబ్బంది పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్ లోనికి ప్రవేశ మార్గాలు, సూచికల బోర్డ్ లు ఏర్పాటు చేయాలని, పాత్రికేయుల కొరకు మీడియా సెంటర్ లో అవసరమైన చర్యలు చేపట్టాలని, కౌంటింగ్ సిబ్బంది వాహనాల పార్కింగ్ కు స్థలాన్ని పరిశీలించాలని,అధికారుల మొబైల్ ఫోన్స్ డిపాజిట్ కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. మే 27న జరగనున్న వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నికల పోలింగ్ కు జిల్లాలోని 34,933 ఓటర్లకు గాను 36 పోలింగ్ స్టేషన్లలో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని, ప్రతీ పోలింగ్ స్టేషన్ ను తనిఖీ చేయాలని ఏవైనా సమస్యలు ఉంటే త్వరగా పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో ఉన్న 58 బ్యాలెట్ బాక్స్ లను పోలింగ్ కు సిద్ధం చేయాలన్నారు.మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు ఎల్.అలివేలు, నరసింహారావు, డిప్యూటీ సీఈఓ నర్మద, మత్స్య శాఖ అధికారిణి నాగవాణి, డిపిఓ హరిప్రసాద్, సిపిఓ సుబ్బారావు,డిడిగ్రౌండ్‌వాటర్ అధికారి సురేష్, ఏ.డి. సర్వేల్యాండ్ అధికారి నరసింహమూర్తి ఉన్నారు.

## ప్రజావాణి సమస్యలపై ప్రత్యేక దృష్టి

### జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీజ



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వాటిని త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలు రెవెన్యూ శాఖకు సంబంధించినవి 9, ఉద్యోగాలకు సంబంధం చినవి 6, పెండింగ్ బిల్లులకు సంబంధించినవి 6, మొత్తం 20 దరఖాస్తు లను జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ ఆర్‌డిఓ సత్యపాల్‌రెడ్డి తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. డిఆర్‌డిఓ శ్రీనివాస్‌కుమార్, డిఎంహెచ్ఓ అప్పయ్య, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి తుల రవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ చంద్ర, డిడబ్ల్యూఓ స్వర్ణలత లేనినా, ఎల్‌డిఎం రాజ్‌కుమార్, సంక్షేమశాఖ అధికారి ప్రేమలత, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ములుగు ప్రతినిధిః** ఉపాధిహామీ పథకంలో పనులు చేసిన కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించే విధంగా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశమందిరం లో స్థానిక సంస్థలు పి శ్రీజ డిఆర్‌డిఏ శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి ఉపాధిహామీ పథకం పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పనిలో కూలీల సంఖ్య పెంచే విధంగా చూడాలని, దినసరి వేతనంరూ.250 కల్పించే విధంగా చూడాలన్నారు. ఉపాధిహామీ పనుల పెండింగ్ బిల్లులన్ని చెల్లించాలని, అర్హతలు ఉన్న వారందరికి పనులు కల్పించాలని తెలిపారు. ఏపిడి వెంకట నారాయణ, ఎంపిడిఓలు, ఏపిఓలు, ఈసిలు, సిబ్బంది పాల్గొన్నారు.



## భూ సేకరణ ప్రక్రియ వేగవంతం

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** సిద్దిపేట నుండి సిరిసిల్లకు రైల్వే లైన్ పనులకు పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి రైల్వే అధికారులకు అందజేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రైల్వే ప్రాజెక్టు,రెవెన్యూ ముఖ్య అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ..చిన్నకోడూర్‌మండలంలోనిపెద్దకోడూర్,మాచాపూర్, గంగా పూర్, విఠలాపూర్,నారాయణరావుపేట మండలంలో గుర్రాల గోంది,జక్కాపూర్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణను క్షేత్రయ స్థాయిలో పరిశీలించి రైల్వే అధికారులకు అప్పగించాలని తహశీల్దార్‌లకు సూచించారు. స్టోన్ బ్లాస్టింగ్ వలన నష్ట పోతున్న రైతులు నష్ట పరిహారంఇవ్వాకేపనులు ప్రారంభించాలని కోరుతున్నారని తెలుపగాఅందించాలనిరైల్వేఅధికారులకు తెలిపారు.

## సమన్వయంతోనే సత్ఫలితాలు



### జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** జిల్లాలో ఈ నెల 24 నుండి జూన్ 3 వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి అధికారులను అదేశించారు.సోమవారం జిల్లా కార్యాలయ సముదాయంలోని సంబంధిత అధికారులతోసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి సంవత్సరం పరీక్షలు సమయం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు సమయం మధ్యాహ్నం 2:30 గంటల నుండి 5:30 గంటల వరకు నిర్వాహనకు అన్ని ఏర్పాట్లు చేయాలని పరీక్షలు సజావుగా సాగేందుకు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని,విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.పరీక్షలకు జిల్లాలో మొత్తం 9981 హాజరు కానున్నారని ఇందులో ప్రథమ సంవత్సరం 5711, ద్వితి య సంవత్సరం 4270 మంది విద్యార్థులు ఉన్నట్లు, జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాస్,అడిషనల్ డిసిపి రాంచందర్ రావు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్థాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని పాలాట గ్రామానికి చెందిన మంచి నాగరాజు 28 సంవత్సరాల కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సిఎంఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్యులు మెరుగైన చికిత్స కొరకు హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించే ఆర్థిక స్తోమత లేక నాగరాజ్ ని వారి కుటుంబ సభ్యులు శనివారం ఇంటికి తీసుకెళ్లారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మెరుగైన చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేక కుటుంబ సభ్యులను బాధపెడుతున్నానని మనస్థాపానికి గురై ఆదివారం రాత్రి అందరూ పడుకున్న సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామానిర్వహించిమృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు




**ప్రజాపక్షం/మహబూబాబాద్ప్రతినిధి:** హెచ్సీఏ ఆధ్వర్యంలో డబ్ల్యూడిసిఏ సహకారంతో ఏప్రిల్ 20న ప్రారంభమైన సమ్మర్ క్రికెట్ కోచిం గ్ క్యాంప్ నెల రోజులు నేటికీ మే 20 నెల రోజులు కావస్తున్న సందర్భంగా క్యాంపు ఆధ్వర్యంలో హెచ్సీఏకు ధన్యవాదా లు తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాద్ క్రికెట్ అసోసియేషన్ ఇన్చార్జ్ బి అజయ్ సారధిరెడ్డి మాట్లాడుతూ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం ఈనెల 22న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నెల రోజులపాటు క్రీడాకారులకు క్రికెట్ మెలకువలు నేర్పించి గత వారం రోజుల నుండి అండర్ 19అండర్16 అండర్ 14 ఓపెన్ క్రికెట్ ఆడిపించడం జరిగిందన్నారు. ఈ ఓపెన్ క్రికెట్లో క్యాం పులో నేర్చుకున్న క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచారని అజయ్ సారధి రెడ్డి పేర్కొన్నారు. రాబోతున్నటువంటి వివిధ టోర్నమెంట్లో మహబూబాబాద్‌నుండి టోర్నమెంట్ లకు పాల్గొని మహబూబాబాద్ కీర్తిని తెలంగాణ రాష్ట్రంలో చాటి చెబుతారన్నారు. అసోసియేషన్ గౌరవ సలహాదారు బి విజయసారధి, కోచ్ మెతుకు కుమార్, సహాయక తోట వినయ్, ఉపాధ్యక్షుడు రావుల నవీన్ రెడ్డి, మెంబర్ అయిలి సంతోష్,శ్రీనివాస్,పెరుగు కుమార్, రేషపల్లి నవీన్,గాదం శ్యాంప్రసాద్ యాదవ్, క్రీడాకారులు చరిత్ రెడ్డి అనిర్వేశ్ ధర్మచరణ్ రెడ్డి బాబి ముజాహిద్ సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## 'నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించం'

**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధిః** రాష్ట్రంలోని ప్రభుత్వ ,ప్రైవేట్ పాలిటెక్నిక్ లోని మూడు సంత్సర ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుతో పాటుగా వ్యవసాయ డిప్లొమా వెటర్నిటి డిప్లొమా ప్రవేశం కోసం ఈ నెల 24జరిగే పాలిసెట్ 2024 నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంగారెడ్డి సమన్వయకర్త డాక్టర్ ఎం .శ్రీనివాసులు ఇస్మాయిల్ ఖాన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సంగారెడ్డి పట్టణంలో 2420 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పాలిసెట్ 2024 కు సంగారెడ్డి పట్టణంలో 7 పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష సమయం ఉదయం11.00గంటలనుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. విద్యార్థ పరీక్షా కేంద్రానికి ఉదయం 9.30 లోపు చేరుకోవాలని 10.00 గంటల నుంచి అనుమతిస్తామన్నారు. 11.00 గంటల తరువాత నిముషం ఆలస్యమైన అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి https// polycetts.nic ,in ద్వారా కొత్తగా హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్ పై పోటో ప్రింట్ కాని వారు పాస్ పోర్ట్ సైజ్ ఫోటో అతికించుకొని ఎవరైనా గజెటెడ్ అధికారితో ధ్రువీకరణ చేసుకోవాలన్నారు. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్ హెచ్. పెన్సిల్ ,బ్లూ /బ్లాక్ పాయింట్ పెన్, ఏరేజర్, తెచ్చుకోవాలని కోరారు.

## ఆరోగ్య సేవలు అందించాలి

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి పేర్కొన్నారు. సోమవారం కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఈదుల పూసల పల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరమును ఆకస్మికంగా తనిఖీ చేసి సూచనలు అందించారు. 12 వారాల్లోపు గర్భిణీ స్త్రీ లను నమోదు చేయాలని, గర్భిణీ స్త్రీలకు మొదటి, రెండు పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో చేయించాలని, మూడు నాలుగు పరీక్షలు జిల్లాలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో చేయించుకునేల అవగాహన కల్పించాలని సూచించారు.

# ప్రాజెక్టునగర్ గ్రామానికి మోక్షమెప్పుడో..!



**ప్రజాపక్షం/గోవిందరావుపేటః** గత సంవత్సరం జులై 27వ తేదీన కురిసిన వర్షానికి ఆ గ్రామం మొత్తం మునిగి మృత్యుఘోషగా మారి చావు బతుకుల మధ్యలో ఆ రాత్రి వారికి ఆ గ్రామానికి కాళరాత్రిగా మిగిలిపోయింది. గోవిందరావుపేట మండలంలోని ప్రాజెక్టునగర్ గ్రామం జులై 27 తేదీన రాత్రి వారి జీవితాలకు ఒక పీడ రాత్రిగా వారి జీవితంలో మరిచిపోలేని రోజుగా ఉన్నదని ఆ గ్రామస్తులు తలచుకొని బాధపడ్డారు. మరల ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభం కాబోతుందని వారి గుండెల్లో గుబులుగా ఉందని మరల అదే వరదలు వస్తే మమ్మల్ని ఆదుకునేది ఎవరని ఆ గ్రామస్తులు మదిలో మెదులుతున్న ప్రశ్న? గత సంవత్సరం కురిసిన ఒక్క రోజు వానకే దయ్యాలవాగు ఉప్పొంగి ప్రాణాలు బలిగొన్నదని అందరం తృటిలో మేల్కొని ప్రాణాపాయం నుండి తప్పించుకొని ప్రభుత్వ హాస్టల్ భవంతి ఎక్కి తమ ప్రాణాలు కాపాడుకున్నామని ఆ గ్రామస్తులు అంటున్నారు. వరదలు వచ్చిన సమయంలో కనబడిన రాజకీయ నాయకులు, అధికారులు ఎవరు మా వైపు కూడా చూడడం లేదని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న ఎంఎల్ఏ సీతక్క తమకు పక్కా ఇండ్లు మంజూరు చేయిస్తానని ముంపు ప్రదేశం కాకుండా వేరే ప్రదేశంలో ఇళ్లు నిర్మాణం చేస్తామనిహామీ ఇచ్చారని, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే తాము సీతక్కను రెండుసార్లు కలిశామని మాకు త్వరలో ఇళ్లు మంజూరు చేయిస్తానని ఆమె వాగ్దానం ఇచ్చిన ఇప్పటి వరకు ఎలాంటి యుద్ధ ప్రాథమిక చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. వర్షాకాలం వస్తుండడంతో భయం గుప్పిట్లో బతుకున్నామని అంటున్నారు. గత సంవత్సరం మృత్యు ఘడియలు మరల రాకముందే మాకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సమ్మయ్య, గ్రామ పెద్ద మనిషి కోట కృష్ణారావు, రఘుపతి, కోటే పవన్, రాగం వెంకన్న, పవన్, క్రాంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 15 లీటర్ల గుడుంబా స్వాధీనం



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రామగుండం కమీషనరేట్ పెద్దపల్లి జోన్ ధర్మారం పోలీస్ స్టేషన్ పరిధి లోని బొమ్మారెడ్డిపల్లిలో గుడుంబా అక్రమంగా తయారుచేసి అమ్ముతున్నారనే సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్, తన సిబ్బందితో తనిఖీ చేయగా అక్కడ సుమారు 15 లీటర్లు గుడుంబా గుర్తించడం జరిగిందని, గుడుంబా అమ్ముతున్న వ్యక్తి బొమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాడిగా గుర్తించామని తెలిపారు. స్వాధీన పరుచుకున్న గుడుంబా, నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం ధర్మారం పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం జరిగిందని టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు.

## హోటల్‌లో జూదం : 12 మంది అరెస్ట్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ హోటల్లో జూదం అడుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న నిర్మల్ జిల్లా ఎస్పి జానకి షర్మిల ఆదేశాల మేరకు నిర్మల్ పట్టన సిఐ అనిల్ కుమార్ ఆదివారం రాత్రి నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉన్న ఓ ప్రముఖ హోటల్‌లో జుదమాడుతున్న 12 మందిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.16.550లు నగదు, 12 మొబైల్ ఫోన్‌లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు కార్లును స్వాదీనం పరుచుకున్నారు. ఇందులో జుట్టు దినేష్, జగడం రాజు, నానం సాయికృష్ణ, ఆదుముళ్ళ వినోద్, సూరం నిఖిల్, కోరు కంటి రాకేష్, బట్టు రాజు, ఉల్లిగడ్డల రమేష్, పరుషరౌత బాలకృష్ణ, నల్లా రాఘవేంద్ర, మంత్రి సుధీర్, రావుల శ్రీనివాస్ యాదవ్‌లను అరెస్టు చేసి కేసును దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సిఐ అనిల్ కుమార్ వివరించారు.

## ‘బెస్ట్ అవైలబుల్’ స్కూల్‌లో ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం

### కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : 2024–25 సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశం కోసం పెద్దపల్లి జిల్లాలోని గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు జూన్ 6లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు మొత్తము (5) సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. మూడవ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి, ఎరుకుల బాలురకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందని తెలిపారు. ఐదవ తరగతిలో గోండు బాలురకు ఒకటి, 8వ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రెండు లక్షలు, రూరల్ ప్రాంతంలో ఒక లక్షా 50 వేలు ఉండాలని, ధ్రువీకరణ పత్రాలు ఆదాయం, కులం, బర్త్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ 2 సైజ్ ఫోటోలను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 6లోగా కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని, వచ్చిన దరఖాస్తుల నుండి జూన్ 12న లాటరీ పద్ధతిలో ద్వారా ఎంపిక చేయనున్నట్లు, ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 9652118867 నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## కొండగట్టు హనుమాన్ జయంతి పోస్టర్ విడుదల



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి/మల్యాల : ఈనెల 30 నుండి నుండి జూన్ 1 వరకు మూడు రోజులు కొండగట్టు ఆంజనేయ స్వామి వారి జయంతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష ఒక ప్రకటనలో తెలిపారు. ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా క్షేత్ర సంప్రదాయ సారముగా హోమ, పూజ, అర్చనాది సేవలతో పాటు ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు. ఈ సందర్భంగా జయంతోత్సవము ఆహ్వాన ప్రతులను, పోస్టర్‌ను కలెక్టర్ సోమవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, కలెక్టరేట్ ఏ. ఓ. హన్మంత రావు, కొండగట్టు ఆలయ ఈ. ఓ. చంద్ర శేఖర్, డిప్యూటీ ఈ . ఓ అంజయ్య పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై సమీక్ష

### కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఆయా స్కూళ్ళలో మరమ్మతు పనులు పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేయాల్సిన మరమ్మతు పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసి హాలులో జిల్లాలోని ఇఇలు, ఎంపిడిఓలు, ఎఇలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్కూళ్ళలో నీటి సరఫరా, విద్యుత్ పరికరాల ఏర్పాటు, మరుగుదోడ్ల మరమ్మతు, నీటి సదుపాయం, పాఠశాలల ఆవరణలో మరమ్మతు తదితర పనులపై ఆయా మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఎన్ని స్కూళ్ళలో పనులు మొదలు పెట్టారు? ఎన్ని పూర్తి అయ్యాయో చర్చించారు. పనులు నాణ్యతతో చేయించాలని, ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనులు గడువులోగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో ఉమారాణి, డీఈఓ రమేష్ కుమార్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిత సింగనాథ్, డీపీఓ వీర బుచ్చయ్య, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ

### కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : జిల్లాలో జరగనున్న ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, పాలిసెట్ సప్లిమెంటరీ పరీక్షలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఎస్పి సురేష్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్ నగర్ రాజస్వమండల అధికారి కాసబోయిన సురేష్ లతో కలిసి జిల్లా అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1200 మంది విద్యార్థులు ఎస్ఎస్‌సి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్నారని, ఇందు కోసం ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, కాగజ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాల, సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జూన్ 3వ తేదీ నుండి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలను ఈ నెల 24 నుండి జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ప్రథమ సంవత్సరం 1938, ద్వితీయ సంవత్సరం 1051 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, ఇందు కోసం జిల్లాలోని ఆసిఫాబాద్‌లో 2, కాగజ్ నగర్‌లో 2, జైనూర్, తిర్యాణి, రెబ్బెన, కౌటాల, వాంకిడి, కెరమెరి, సిర్పూర్ (యు)లలో ఒక్కొక్క పరీక్ష కేంద్రం చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల 24న జరగనున్న పాలిసెట్ పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్ అవకాశం లేకుండా ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### క్యాటగిరి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత దిశగా చర్యలు



డి కేటగిరి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్ తహసిల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, ఎన్నికల పర్యవేక్షకులు మధుకర్, ఎన్నికల ఉప తహసిల్దార్ జితేందర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా వేర్ హౌస్ నుండి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములో గల సి అండ్ డి క్యాటగిరి స్ట్రాంగ్ రూమ్‌కు డి క్యాటగిరి ఇవిఎంలను తరలించి భద్రపరిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వేర్ హౌస్ నుండి డి కేటగిరి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలని తరలించి భద్రపరచడం జరిగిందని తెలిపారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టును బెదిరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### టియుడబ్ల్యుజె ఐజెయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండూరు రవీందర్, వెంకగారి భూమయ్య

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : సారంగాపూర్ మండలానికి చెందిన ఓ ప్రముఖ దినపత్రిక జర్నలిస్ట్ లక్ష్మి నారాయణను బెదిరించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని టియుడబ్ల్యుజె ఐజెయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండూరు రవీందర్, వెంకగారి భూమయ్య అన్నారు. సోమవారం ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రాస్తున్న జర్నలిస్టుపై కొందరు అక్రమార్కులు దాడులు, బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే జిల్లా వ్యాప్తంగా జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని అన్నారు. వాస్తవాలను రాస్తూ ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్న అధికారులు సరిగా స్పందించకపోవడం పట్ల ఈ రోజు జర్నలిస్టుపై దాడులు జరుగుతున్నాయని అధికారులు కూడా ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. వార్తలు రాసినా రిపోర్టర్‌లపై దాడులు, బెదిరింపులకు గురిచేసిన వారిపై అత్యానేరం క్రింద కేసు నమోదు చేసి న్యాయం చేయాలని అన్నారు. నిజాయితీగా వార్తలు వ్రాస్తుంటే అవి చూసి తట్టుకోలేక ఇటువంటి బెదిరింపులు చెయ్యడం సరైన పద్ధతి కాదని అన్నారు.

# పంచాయతీరాజ్‌లో అవినీతి తిమింగలం

### 7 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన పంచాయతీ రాజ్ ఎఇ

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : అసలే చేసిన పనులకు బిల్లు రాక ఏళ్ళ తరబడి తిరిగి తిరిగి వేసారి పోతున్న కాంట్రాక్టర్లకు అధికారుల అవినీతి మరింత తలనొప్పిగా మారింది. స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మించిన కాంట్రాక్టర్ బిల్లుల కోసం పంచాయతీ రాజ్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోయాడు. బిల్లులుపై అధికారులకు పంపాలంటే 8వేల రూపాయలు లంచం ఇస్తేనే పనవుతుందంటూ పంచాయతీరాజ్ ఎఇ తెలపడంతో చివరకు కాంట్రాక్టర్ ఎసిబిని ఆశ్రయించారు. సోమవారం రోజున కలెక్టరేట్లోని పంచాయతీ రాజ్ విభాగంలో ఎసిబి అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి కాంట్రాక్టర్ నుండి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ వెంకటేష్ బిల్లుల కోసం పంచాయతీరాజ్ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. నాలుగు నెలల క్రితం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన బిల్లులు మొత్తం పంచాయతీరాజ్ ఎఇ భాస్కర్ రావుకు అందజేశారు. ఎఇ భాస్కర్ రావు ఎనిమిది వేల రూపాయలు లంచం ఇస్తేనే ఎంబి చేస్తానంటూ, తెలపడంతో నివ్వెర పోయిన కాంట్రాక్టర్ వెంకటేష్ అంత ఇచ్చుకోలేనంటూ బతిమిలాడడంతో 7000 రూపాయలకు తగ్గించాడు. తన వేధిస్తున్న అధికార తీరుపై ఎసిబి అధికారులకు వెంకటేష్ ఫిర్యాదు చేయడంతో కలెక్టరేట్ సముదాయంలోని పంచాయతీ రాజ్ కార్యాలయంలో దాడులు నిర్వహించిన అధికారులు 7వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఎఇ భాస్కర్ రావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. భాస్కరరావును ఎసిబి కోర్టులో హాజరు పరుచున్నట్లు ఉన్నట్లు ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి తెలిపారు. అధికారులు లంచం కోసం వేధిస్తే ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటన చర్చ నిమిషంగా మారింది.



### ఎసిబి వలలో కమలాపూర్ తహశీల్దార్ మాధవి



కమలాపూర్ : కమలాపూర్ మండలం కన్నూర్ (రాములపల్లి) గ్రామానికి చెందిన కాసరబోయిన గోపాల్ తన తండ్రికి చెందిన 3 ఎకరాల 2 గుంటల వ్యవసాయ భూమిని విరాసత్ చేసుకునేందుకు తహశీల్ధార్ మాధవి రూ. 6వేలు డిమాండ్ చేసి ధరణి ఆపరేటర్ రాకేష్ ద్వారా రూ. 4వేలు తీసుకొని వరంగల్ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబట్టారు. ఈ సందర్భంగా వరంగల్ ఎసిబి డిఎస్‌పి సాంబయ్య విలేకరులతో మాట్లాడుతూ... మండలంలోని కన్నూరు (రాములపల్లి) గ్రామానికి చెందిన కసరబోయిన రాజయ్యకు చెందిన 3 ఎకరాల 2 గుంటల వ్యవసాయ భూమిని తన కుమారుడు కసరబోయిన గోపాల్ వీరాసత్ చేసుకునేందుకు మే 9న స్లాట్ బుక్ చేసుకొని 10వ తేదిన తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆ భూమిని వీరసత్ చేసుకునేందుకు తహశీల్దార్ మాధవి తో మాట్లాడగా మొదట ధరణి ఆపరేటర్ రాకేష్‌తో రూ. 30 వేలు డిమాండ్ చేశారు. వారి డిమాండ్‌ను గోపాల్ తిరస్కరించి మేము డబ్బులు ఇవ్వమని తన తండ్రికి చెందిన భూమిని వీరాసత్ చేయాలని కోరినప్పటికి వీరాసత్ చేయకపోవడంతో మళ్ళీ మే 18న తహశీల్ధార్ కార్యాలయానికి వచ్చి అడిగినప్పటికి రూ. 6వేలు డిమాండ్ చేయగా వరంగల్ ఎసిబి అధికారులకు బాధితుడు గోపాల్ ఆశ్రయించినట్లు తెలిపారు. మే 20న రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చిన గోపాల్ ధరణి ఆపరేటర్‌కు వెయ్యి రూపాయలు, తహశీల్దార్ మాధవికి 4వేల రూపాయలు తీసుకోగా ధరణి ఆపరేటర్ రాకేష్‌ను ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ తహశీల్దార్ మాధవిని అరెస్టు చేసి ఏసిబి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏసిబి సిఐ ఎస్. రాజు, ఎల్. రాజు, ఎస్ఐ శ్యాంసుందర్, ఏసిబి సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి



### అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్య కొనుగోలుకు సంబంధించిన వివిధ అంశాలపై రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడుపులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో మిల్లులకు తరలించాలని, కొనుగోలు వివరాలను ఖచ్చితంగా ట్యాబ్ ఎంట్రీ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జామచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు డబ్బులు జమచేసేందుకు అవసరమైన డాక్యుమెంట్లు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఒ విజయలక్ష్మి, డిఎం సివిల్ సప్లయిస్ శ్రీకళ, డిఎస్‌ఒ నందిత, ఇతర అధికారలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు గెలుపు ఓటములను సమంగా తీసుకోవాలి

### ఎమ్మెల్యే విజయరమణ రావు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలో గల మినీ స్టేడియంలో సోమవారం అశోక్ నగర్‌కు చెందిన రంజిత్ కుమార్ స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను పెద్దపల్లి ఎంఎల్‌ఎ చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సత్వరన్యాయం కోసమే గ్రీవెన్స్ డే

### ఎస్‌పి అఖిల్ మహాజన్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి ప్రతి ఫిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం ఉదయం 10:00 గంటల నుండి 03:00 గంటల వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా ఎస్‌పి తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 16 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్‌పి తెలిపారు.

## కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలకు అభినందనలు

### అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలలో పరిజ్ఞానాన్ని అందించి పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అదనపు కలెక్టర్ జి.వి శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. భారతదేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరి ఖిల్లాలో స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం సోమవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్‌ను సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కలుసుకొని స్వర్ణోత్సవ వేడుకలకు సంబంధించిన టార్చ్‌ను అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ భారతదేశంలో డాక్టర్ మోహన్ సింగ్ మెహత కమిటీ సిఫారసు మేరకు మొట్ట మొదటగా కృషి విజ్ఞాన కేంద్రంను పాండిచ్చేరి 1974 మర్చి 21న స్థాపించారని, అప్పటి నుండి ఇప్పటి వరకు మన దేశంలో 731 కృషి విజ్ఞాన కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రాలు ముఖ్యంగా రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలలో పరిజ్ఞానాన్ని అం దించి పంట ఉత్పత్తి సామర్థ్యని పెంపొందించడమే కా కుండా జిల్లాలోని రైతుల యొక్క సాంఘిక, ఆర్థికఅభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నాయని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న ఈ స్వర్ణోత్సవాల సందర్భంగా శాస్త్రవేత్తల బృందాన్ని అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం ఖిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఏ. శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం డాక్టర్ వై వెంకన్న, బి భాస్కర రావు , డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ కిరణ్ పెల్లి, బి.నవ్య, డాక్టర్ అర్చన, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు



### అదనపు కలెక్టర్ రాహుల్

ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి : ప్రజా సంక్షేమం, దేశ అభివృద్ధి దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమాభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్ అన్నారు. కేంద్ర సర్వీసులకు చెందిన వివిధ శాఖల సహాయ విభాగాల అధికారులకు జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో "విలేజ్ అటాచ్మెంట్ మాడ్యూల్" అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, జిల్లా సంక్షేమాధికారి కె. చిన్నయ్య, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, జిల్లా వ్యవసాయ అధికారి కల్పనలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ వరకు కేంద్ర సర్వీసులకు చెందిన సహాయ విభాగాల అధికారులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వారికి కేటాయించిన గ్రామాలలో పర్యటించి అమలు చేయబడుతున్న వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని, ఇందు కోసం వారికి సహాయంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులను నోడల్ అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును, లబ్ధిదారులకు అందుతున్న పథకాలను నిశితంగా పరిశీలించాలని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు తమ శాఖల పరిధిలో అమలు చేయబడుతున్న వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయల ఉద్యోగులలో బదిలీల ఆందోళన



ప్రజాపక్షం/వేములవాడ : తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రధాన ఆలయాల్లో ఉద్యోగులకు బదిలీలు కానున్నట్లు అందిన సమాచారం మేరకు ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ ఆలయాలకు అందించిన ఉత్తర్వుల మేరకు ఆలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఒకే శాఖలో పని చేస్తున్నారని ఒకే దేవాలయంలో పనిచేస్తున్న సమాచారాన్ని అందించాల్సిందిగా వివిధ దేవాలయల కార్య నిర్వాహక అధికారిని సమాచారం కోరినట్లు తెలిసింది. తెలంగాణలోని ప్రధాన ఆలయాల్లో ఈ మధ్య చేసుకున్న అక్రమాలు అవకతవగలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, చాలాకాలంగా ఒకే శాఖలో పని చేస్తూ అవినీతికి పాల్పడుతున్న సమాచారాన్ని దేవాదాయ కమిషనర్ పరిగణాలకు తీసుకొని రాష్ట్ర ప్రధాన ఆలయాల్లో చోటు చేసుకుంటున్నా అనేక అవినీతి అక్రమాల నేపథ్యంలో, భక్తులకు సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఆలయ ఉద్యోగుల వ్యవహార శైలిపై దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వ శాఖ బదిలీల ప్రక్రియ నిర్వహించనున్నట్లు, అనంతరం వీరిపై బదిలీలు నిర్ణయం తీసుకునే విధంగా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అందిన సమాచారం మేరకు ఉద్యోగులు ఎక్కడికి బదిలీ అవుతుందో అని ఆందోళన చెందుతున్నారు.

## మందమర్రి ఏరియాను బ్రతికించుకోవాలి

ప్రజాపక్షం/మందమర్రి : మందమర్రి ఏరియాను బ్రతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం మందమర్రి పట్టణంలోని హెచ్ఎంఎస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాలో కెకె 1, ఆర్‌కె.1ఎ, ఆర్‌కె గనులు, ఆర్‌కె ఒసిపిలు త్వరలో మూతపడుతుండడంతో స్థానికంగా కార్మికులకు, కార్మిక కుటుంబాలకు తీరని నష్టం జరుగుతుందని తెలిపారు. పాత గనులు మూతపడక ముందే సింగరేణి అధికారులు, ప్రభుత్వం కెకె 6 శ్రావణపల్లి ఒసిపిలను ప్రారంభించాలని డిమాండు చేశారు. కొత్త గనులు ఏర్పాటు చేసి కొత్త కార్మికులను తీసుకోకుంటే సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. అనంతరం కెకె ఒసిపి హెచ్‌ఎమ్‌ఎస్ ఫిట్ సెక్రటరీగా మౌనికను నియమిస్తూ నియమాక పత్రం అందజేశారు. ఒపెన్ కాస్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ కృషి చేయాలని మౌనిక కు సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్ష పర్యటనకు వెళ్ళిన తొలి ఆంధ్రుడు గోపీ తోటకూర

**టెక్సాస్ (అమెరికా):** జెఫ్ బెజోస్‌కు చెందిన బ్లూ ఆరిజిన్ ప్రైవేట్ స్పేస్ టూర్ ప్రయోగంలో తొలి భారతీయ అంతరిక్ష పర్యాటకుడిగా 30 ఏళ్ల గోపీ తోటకూర చరిత్ర సృష్టించారు. భూ గ్రహం వెలుపలికి ప్రయాణించిన రెండో భారతీయుడిగా, తొలి ఆంధ్రుడిగా రికార్డు సృష్టించారు. ప్రవాసాంధ్రుడైన గోపి పర్యాటకుడిగా అంతరిక్ష పర్యటన చేసిన తొలి భారతీయుడిగా చరిత్ర పుటల్లో చోటు సంపాదించారు. బ్లూ ఆరిజన్ న్యూషెఫర్డ్ 25 (ఎన్ 25) మిషన్‌లో ఆయన భాగస్వామి అయ్యారు. ఇప్పటి వరకు స్పేస్ మిషన్లు పరిశోధనల్లో భాగంగానే జరుగుతున్నాయి. అయితే కొన్నేళ్లుగా ప్రైవేట్ స్పేస్ యాత్రల్లో పర్యాటకుల్ని కూడా అంతరిక్షంలోకి తీసుకువెళ్లుతున్నారు. ఇలా అంతరిక్ష ప్రయాణం చేసిన తొలి భారతీయుడు గోపి. డిగా గోపి రికార్డు సృష్టించారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 8.5 గంటలకు పశ్చిమ టెకాస్‌లోని బ్లూ ఆరిజన్ కంపెనీ లాంచ్ సైట్ నుంచి అంతరిక్ష వాహనం, నిర్ణీత సమయం కంటే గంట ఆలస్యంగా నింగిలోకి ఎగిరింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జన్మించిన గోపి అమెరికాలో పారిశ్రామికవేత్తగా, పైలట్‌గా ఉన్నారు. మరో ఐదుగురితో కలిసి అంతరిక్ష యాత్రను చేపట్టారు. భూ వాతావరణానికి వెలుపలికి వారితో కలిసి ప్రయాణించారు. ఈ బృందంలో 90ఏళ్ల ఎడ్ డ్వైట్ కూడా ఉన్నారు. మాసన్ ఎంజిల్, సిల్వియన్ చిరాన్, కెన్నెత్ ఎల్ హెస్, కారోల్ షల్లర్ తదితరులు సైతం అంతరిక్ష ప్రయాణం చేశారు. ఇప్పటికీ భారత పాస్‌పోర్ట్ కలిగి ఉన్న గోపి, భారత తరపున రోదసీ యానం చేసిన రెండో అస్ట్రోనాట్‌గా గుర్తింపు పొందారు. అంతకు ముందు రాకేశ్ శర్మ భారత తొలి అంతరిక్ష వ్యోమగామిగా రికార్డు నెలకొల్పారు. భారతీయ మూలాలు ఉన్నా కల్పనా చావ్లా,




సునీతా విలియమ్స్, రాజా చారి, శిరీష బండ్ల వంటి వారు కూడా గతంలో అంతరిక్షంలో ప్రయాణించారు. భారతీయ మూలాలు ఉన్నప్పటికీ, వారు అమెరికా పౌరసత్వం తీసుకున్నారు. అంతేగాక, ప్రొఫెషనల్ అస్ట్రోనాట్స్‌గా అంతరిక్షంలోకి ప్రయాణించారు. గోపి అమెరికా పౌరసత్వం తీసుకోలేదు. పైగా ఆయన ప్రొఫెషనల్ అస్ట్రోనాట్ కూడా కాదు. ఇలావుంటే, ఎన్ఎస్ 25 వాహనం ద్వారా నింగిలోకి వెళ్లిన అంతరిక్ష పర్యాటకులు భూ బాహ్య కక్ష వరకు ఎలాంటి అటంకాలు లేకుండా ప్రయాణించారు. ఆ తర్వాత రాకెట్తో పాటు క్యాప్సూల్ భూమికి తిరుగు ప్రయాణమైంది. రాకెట్ ల్యాండ్ అయిన కాసేపటికి క్యాప్సూల్ కూడా సురక్షితంగా పారాచూట్ల సాయంతో నేలను తాకింది. దీనికి 15నిమిషాల సమయం పట్టింది. జెఫ్ఫు బెజోస్‌కు చెందిన బ్లూ ఆరిజన్ కంపెనీ రెండేళ్ల క్రితం అంతరిక్ష యాత్రలు చేపట్టింది. క్యాప్సూల్ టచ్ టౌన్, వెల్కమ్ బ్యాక్ ఎన్25 అంటూ బ్లూ ఆరిజన్ ఎక్స్లో పోస్ట్ చేసింది.

# పెరిగిన ఓటింగ్ శాతం..

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి వరకూ ఐదు దశల్లో పోలింగ్ పూర్తికాగా, నాలుగు విడతల పోలింగ్‌కు సంబంధించిన వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ప్రకటించింది. 2019 కంటే మొదటి 4 దశల్లో 2.5 కోట్ల అధిక ఓటింగ్ జరిగినట్టు తెలిపింది. ఎస్‌బిఐ నివేదికను అనుసరించి, ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో, నాలుగో దశ ముగిసే సమయానికి మొత్తం 67.5 శాతం ఓటింగ్ నమోదైంది. ఇది 2019లో దాదాపు 67.7 శాతానికి సమానం. ఈ ఎన్నికల్లో మొత్తం 65.3 కోట్ల మంది ఓటు వేస్తారని అంచనా వేస్తున్నారు. మొదటి రెండు దశల్లో ఓటింగ్ కొంత తగ్గడంతో భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) పలు విధాలుగా ఓటర్లను ప్రోత్సహించింది. ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రచారం చేసింది. చాలా ప్రాంతాల్లో ఓటర్లకు అవసరమైన కనీస వసతులు కల్పించింది. దివ్యాంగులు, వృద్ధులు ఎలాంటి సమస్య లేకుండా ఓటు వేసే అవకాశాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ చర్యల ఫలితంగా, ఆ తర్వాత రెండు దశల్లోనూ ఓటింగ్ శాతం కొంత మెరుగుపడింది. ఈ మొదటి నాలుగు దశల్లో దాదాపు 45.1 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో, ఇన్నే నియోజకవర్గాల్లో 42.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవ



డంతో పోలిస్తే, ఈసారి ఓటింగ్ శాతం మెరుగుపడింది. కొత్తగా 66.95 శాతం మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఈ సమయంలో మా ప్రాథమిక అంచనాలు 2019 కంటే ఎక్కువ ఓటర్ల సంఖ్య పెరిగింది. కర్ణాటక (35.5 లక్షలు), తెలంగాణ (31.9 లక్షలు), మహారాష్ట్ర (20.0 లక్షలు)లో ఓటింగ్ సగటును 6 శాతం పెరగడం విశేషం. కేరళలో ఓటింగ్ శాతం 5.3 శాతం క్షీణించింది. ఈ జాబితాలో మణిపూర్ 3.4 లక్షలతో రెండో స్థానంలో ఉంది.

# గతం కంటే ఎక్కువ సీట్లు

ఎపి ముఖ్యమంత్రి
వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధీమా

**న్యూఢిల్లీ:** గతంతో పోలిస్తే ఈసారి ఇంకా ఎక్కువ సీట్లు సంపాదించుకుంటామని వైఎస్ఆర్‌సిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న జగన్ జూన్ ఒకటో తేదీన తిరిగి రానున్నారు. ఎపి అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్‌సిపి ఘోర పరాజయం పాలవుతుందని, 175 అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ బలం 51కి తగ్గుతుందని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ చేసిన అంచనాపై ఒక జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందిస్తూ, 2019 ఎన్నికల కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుంటామని, ఈ అఖండ విజయాన్ని యావత్ భారత దేశం చూస్తుందని వ్యాఖ్యానించారు. ఐప్యాక్‌కు గతంలో చీఫ్‌గా వ్యవహరించిన ప్రశాంత్ కిశోర్ ఆ తర్వాత దానిని నుంచి వైదొలగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలతోపాటు, ఇప్పటికే ఎపిలో ముగి



సిన అసెంబ్లీ ఎన్నికలపైన కూడా ఆయన అంచనాలు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలోనే, ఎపిలో వైఎస్ఆర్‌సిపి మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తి లేదని, టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని వ్యాఖ్యానించారు. అయితే, ఈ అంచనాలను జగన్ ఖండించారు. గత ఎన్నికల కంటే ఈసారి మరిన్ని స్థానాలను కైవసం చేసుకుంటామని అన్నారు. తాను పొరపాట్లు చేశానని ప్రశాంత్ కిషోర్ విమర్శించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. ప్రజలు తమ పార్టీ పట్ల నమ్మకంతో ఉన్నారని, విజయం తమనే వరిస్తుందని అన్నారు.

## పారిశుధ్యంలో జిల్లాకు మెరుగైన స్థానం

నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన




**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో ఇంటింటికి తాగు నీటి సరఫరా, పారిశుధ్యం, సెగ్రిగేషన్ షెడ్లనిర్వహణ, ఉపాధిహామీ అమలు వంటి పథకాలలో మెరుగైన స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపా రు. కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్‌కి చెందిన 26 మంది అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందం శిక్షణలో భాగంగా ప్రజల సామాజిక, ఆర్థిక అంశాల అధ్యయన నిమిత్తం జిల్లాకు రాగా, సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వారితో ముఖాముఖి మాట్లాడారు. జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని, పట్టణ ప్రాంతాలు మొదలుకొని, గ్రామీణ ప్రాంతాలలో సైతం నల్లా కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ప్రజల జీవన పరిస్థితుల అధ్యయనం నిమిత్తం ఈనెల 20నుండి 24 వరకు జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాలలో వారు పర్యటించనున్నారు. నల్లగొండ మండలం అన్నెపర్తి, మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్, దామరచర్ల మండలం వాడపల్లి, చిట్యాల మండలం ఊరుమడ్ల, మునుగోడు మండలం పలివేల గ్రామాలలోబసచేసి ప్రజల జీవన పరిస్థితులు, సామాజిక, ఆర్థిక అంశాలు తెలుసుకోనున్నారు. బృందానికి నోడల్ అధికారిగా డిఆర్డిఓ నాగిరెడ్డి వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ టీ.పూర్ణచంద్ర పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అండగా సిపిఐ పోరాటం

పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయ సారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** ఎర్రజెండా పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి అన్నారు. మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలో సోమవారం సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజయ సారథి మాట్లాడుతూ ఈ దేశంలో పేద ప్రజల అండగా సిపిఐ ఉద్యమిస్తుందన్నారు. పాలకులు కార్పొరేట్లకే ఊడిగం చేస్తున్నారన్నారు. కార్మికుల చట్టాలను మోదీ కాలరాస్తున్నారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్‌లో మోదీకి పతనం తప్పదన్నారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో కెసిఆర్‌ను గద్దె దింపింది సిపిఐ అని, దేశంలో మతోన్మాద మోదీని గద్దె దింపేది సిపిఐ అని అన్నారు. మానుకోట ప్రాంతంలో ఉద్యమాలు నిర్మించి పేద ప్రజల అండగా సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో వేలాది మందికి నిరుపేదలకు భూములు పంచిన చరిత్ర సిపిఐదే అన్నారు. ఈ ప్రాంతంలో దొరల గడీలను బద్దలు కొట్టి పోరాడిన చరిత్ర సిపిఐదే అన్నారు. ఈ ప్రాంతనాయకులపై ఎన్నో హత్య కేసులు పెట్టిన ఎంత నిర్బంధం పెట్టిన పేద ప్రజల కోసం నిరంతరం సిపిఐ శ్రేణులు ఉద్యమిస్తున్నారని అన్నారు. మానుకోట ప్రాంతంలో ప్రజలకు వ్యతిరేకంగా పని చేసినటువంటి గత పాలకులను ఎదిరించి పోరాడి




మొన్న జరిగిన ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పిన చరిత్ర సిపిఐదేనని ఈ ప్రాంతంలో గత అధికార పార్టీ ఓడిపోవడానికి సిపిఐ చేసిన పోరాటాలే కారణమన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జెండాను సిపిఐ సీనియర్ నాయకులు పడాల దేవయ్య ఎగురవేయగా ఎఐటియుసి జెండాను వేల్పుల వీరన్న ఎగురవేశారు. సభకు చిట్టిమల్ల రామచంద్రు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఐ అర్బన్ కార్యదర్శి పెరుగు కుమార్, గ్రామ పార్టీ కార్యదర్శి వీరమల్ల రవీంద్రయ్య, గంట వెంకన్న, కందుకూరి లచ్చయ్య, అబ్దుల్లా, సారయ్య, సైదులు, రమేష్, అశోక్, బాలరాజు, రాంజీ, బావు సింగ్, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించండి

ఎస్‌టియు డిమాండ్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** మరో 20రోజుల్లో నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న దృష్ట్యా అన్ని పాఠశాలల్లో సర్వీస్ పర్సన్‌లను నియమించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.ఆర్.శ్రీనివాస్, కట్టా రవీంద్రచారిలు పేర్కొన్నారు. స్థానిక వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జరిగిన ఎస్టీయు జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయినందున ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను సత్వరం మంజూరు చేయాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం అమలులో వేసవి సెలవులలో పాఠశాల మరమ్మత్తు, నూతన పనుల పర్యవేక్షణ చేస్తున్న అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అట్టి కాలానికి సంపాదిత సెలవులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను వెంటనే చెల్లించాలని, 40 శాతం ఫిట్‌మెంటుతో నూతన పిఆర్‌సి ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు తక్షణం పాత పెన్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని, 317 జీవో అమలులో స్థానికత నష్టపోయిన ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.




సర్వీస్ రూల్స్ రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులన్నీ భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి గుండ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పిన్నింటి తిరుపతిరావు, సాన కిషన్, వెలిచాల వెంకటస్వామి, లక్ష్మ ణ్‌రావు, వివేకానంద చారి, నారి పవన్, రసూల్, సంజీవచారి, రజాక్, కందుకూరి శ్రీనివాస్, మాధవస్వామి, సమ్మయ్య, రవీందర్, రాజేందర్ రెడ్డి, తాటిపాముల శ్రీనివాస్, మధుకుమార్, చొప్పదండి రామకృష్ణ తదితరులతో పాటు వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

# అలవికాని హామీలతో మోసం చేస్తున్న ప్రభుత్వాలు

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి
గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో విజయడంఖా మోగిస్తాం

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నాలుగు సార్లు బిఆర్ఎస్ గెలిచి విజయడంఖా మోగించామమని, ఈసారి కూడా విజయం సాధిస్తామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే భూపాల్రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డిలతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగదీష్‌రెడ్డి మాట్లాడారు. అమలు కానీ, సాధ్యం కానీ హామీలు ఇస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసం ప్రజలందరికి అర్థమైందన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నల్లగొం డ, సాగర్, మిర్యాలగూడ, హుజూర్ నగర్ నియోజక వర్గాలలో నిర్వహించే ప్రచార సమావేశాల్లో పాల్గొంటారని, పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాలను విజయవంతం చేయాలన్నారు. మోదీ గుజరాత్ సిఎంగా ఉన్నప్పటి నుంచి గుజరాత్లో ప్రతి ఏడు పేదరికం పెరుగుతూనే ఉందని, దేశంలో మోదీ ప్రధాని అయిన తర్వాత పేదరికం పెరిగిందని, ఆకలితో ఎంతో మంది చనిపోతున్నారన్నారు. గుజరాత్‌లో కూడా పేదరికం పెరిగిందని, దేశం యావత్తు అంధకారంలోకి వెళ్ళిందన్నారు. బిజెపి నేతలు ఎన్నికలప్పుడే పాకిస్థాన్ గురించి మాట్లాడుతారని, వాళ్ల గురించి ఇప్పుడెందుకన్నారు. దేవుళ్ల పేరుతో ఓట్లు అడుక్కుంటున్నారన్నారు. బిజెపి అసలు రంగు బయటపడిందని, బిజెపి అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే తప్ప




మళ్లీ ఎప్పుడూ కనిపించడన్నారు. కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా హట్టర్ ప్లాప్ అయిందని, ర్టాషంలో అబద్ధపు ప్రచారాలు చేస్తూ కాలం గడుపుతుందన్నారు.. బీసీ గణన చేసిన తర్వతే స్థానిక ఎన్నికల నిర్వహిస్తాం అని చెప్పిన కాంగ్రెస్ మాట మార్చిందని, యువత ఇవి అన్ని ఆలోచన చేయాలని, యువతను నిలువునా ముంచిన కాంగ్రెస్ ను ఓడించాలన్నారు. మంత్రి, కోమటిరెడ్డి లాంటి చిల్లర వ్యక్తి గురించి మాట్లాడటం వేస్ట్ అని, అతను నిలకడ లేని వ్యక్తి అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఓటర్లు ఆలోచన చేసి ఓటయ్యాలని, చైతన్యం, పోరాటాల ఖిల్లా నల్లగొండ పట్టభద్రులు బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి ని గెలపించాలని కోరారు. కెసిఆర్ ఉద్యోగాలు భర్తీ చేస్తే, వాటి అపాయింట్మెంట్ కాపీలను పంచుతూ రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు అడుతున్నాడన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్రెడ్డి, బక్క పిచ్చయ్య, చీర పంకజ్ యాదవ్, మందడి సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

## రూ.200 కోట్లు కుచ్చుటోపి

(మొదటి పేజీ తరువాయి)

ఖాతాదారులు మరిన్ని డబ్బులను ఆసంస్థలో డిపాజిట్ల రూపంలో పెట్టారు. ఆ తరువాత సంస్థ ప్రతినిధులు వడ్డీలు ఇవ్వడం మానేశారు. పలువురు ఖాతాదారులు ఆబిడ్స్‌లోని సంస్థ కార్యాలయానికి చేరుకుని సిబ్బందిని ప్రశ్నించగా వారికి చెక్కులు అందజేసి సముదాయించి పంపించారు. ఇలా రెండు నెలలు గడిచినా సంస్థ ఇచ్చిన చెక్కులు పనిచేయకపోవడంతో ఆందోళనకు గురైన బాధిత ఖాతాదారులు సంస్థ కార్యాలయానికి వెళ్లగా తాళం వేసి ఉంది. దీంతో బాధితులు హైదరాబాద్ సిసిఎస్ పోలీసులను ఆశ్రయించి తమగోడు వెళ్లబోసుకున్నారు. ఈమేరకుపోలీసులు కేసునమోదు చేసుకునిదర్యాప్తు చేస్తున్నారు. **అన్నం పెట్టిన సంస్థను కాదని...** అబిడ్స్ లోని తెలంగాణ స్టేట్ కోఆపారేటివ్ బ్యాంక్ లో జనరల్ మేనేజర్ గా పనిచేస్తున్న నిమ్మగడ్డ వాని బాల,తన భర్త మేక నేతాజీ,కొడుకు మేక శ్రీహర్ష లు ఈ కుంభకోణంలో నిందితులుగా ఉన్నారు. తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ కు వచ్చి డిపోజిట్ చేయాలనుకున్న వినియోగదారులను బ్యాంక్ జనరల్ మేనేజర్ నిమ్మగడ్డ వాని బాల ఆకర్షించి వారిని అదే బ్యాంక్ సమీపంలో తన భర్తతో ఏర్పాటు చేసిన సంస్థకు పంపి అధిక వడ్డీ ఇస్తామంటు డిపాజిలు సేకరించేటట్లు చేశారు. పని చేస్తున్న బ్యాంక్‌నె ఆమె మోసగించింది.

## ఉద్యోగాల అమ్మకాలు?

(మొదటి పేజీ తరువాయి)

కాడికి దండుకునేందుకు పోస్టుకు రెండు లక్షల నుండి మూడు లక్షల రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇదే ఆసరాగా తీసుకుని కొంతమంది దళారులు రంగ ప్రవేశం చేసి తామే ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు వలవేస్తున్నారు. అసలే ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్న యువత ఏ ఉద్యోగం వచ్చినా సరే డబ్బులు పోతే ఏంటి అని పైరవీకారులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల జరిగిన నియామకాల్లో డబ్బులు ఇచ్చినట్టు బహిరంగ ప్రచారం కొనసాగింది. ఇకనైనా జిల్లా కలెక్టర్ ఈ విషయంపై దృష్టిసారించి విచారణ చేపట్టాలని పలువురు నిరుద్యోగులు కోరుతున్నారు.

## దోషులను శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

రాజస్థాన్ రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో జరిగిన విద్యార్థి సంఘాల ఎన్నికలలో క్రియాశీలకంగా పనిచేసే ప్రభుత్వ కళాశాలల ఎన్నికల్లో అన్ని కళాశాలలో ఎఐఎస్ఎఫ్ జెండా ఎగిరివేశారన్నారు. ఆ జిల్లాల్లో యువ కమ్యూనిస్టుగా మంచిపేరు తెచ్చుకున్న గగన్ దీప్‌సింగ్‌ను కొంతమంది గుర్తు తెలియని దండగులు హత్య చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గగన్ దీప్ సింగ్ మే 15వ తేదీన మరణించారన్నారు. తక్షణమే ఈ ఘటన పైన విచారణ జరిపి ఆధారాలు సేకరించి దోషులను కఠినంగా శిక్షించాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని, లేనట్లయితే దేశవ్యాప్తంగా ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి గ్యార నరేష్, ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి, యూనివర్సిటీల బాధ్యులు రెహమాన్, ఉస్మానియా యూనివర్సిటీ కార్యదర్శి నెల్లి సత్య, రాష్ట్ర నాయకులు ఎండి అన్వర్, వంశీ, హరీష్ , వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## నాసిరకం పనిముట్లతో కార్మికుల ఇబ్బందులు : ఎఐటియుసి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు సంస్థ పంపిణీ చేస్తున్న నాసిరకపు పనిముట్లు, కాలం చెల్లిన ఎస్‌డిఎల్ యంత్రాలను నడపడం వలన ఆపరేటర్లు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఎఐటియుసి శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా అన్నారు. సోమవారం ఏరియాలోని ఆర్‌కె న్యూటెక్ గనిని గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు సందర్శించి కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నాసిరకమైన పనిముట్లు కార్మికులకు అందజేయడం, డ్రిల్ రాడ్స్, డ్రిల్ బిట్స్ కొరత ఉందన్నారు. సర్వే ఆఫ్ ఐనా ఎస్‌డిఎల్ యంత్రాలను నడపడం వల్ల ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని పేర్కొన్నారు. యంత్రాలలో ఉపయోగించే ఆయిల్స్ నాసిరకం వాడటం వల్ల యంత్రాలు చెడిపోతున్నాయన్నారు. నాసిరకమైన పనిముట్ల పంపిణీ గురించి గుర్తింపు సంఘంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. గనిలో ఉన్న సమస్యలపై గని మేనేజర్‌తో చర్చించగా సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ సంపత్, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మ ణ్, నాయకులు గజ్జి రమేష్, ఎం సంపత్, చంద్రమౌళి, కె. రాజయ్య, ఎన్. సంపత్, తిరుపతిరెడ్డి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రజాపోరాటాల చరిత్ర సిపిఐది



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** ప్రజాపోరాటాల్లో పాల్గొన్న చరిత్ర సిపిఐది అని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయనాయుడు పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలోను, ఆ తరువాత జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలోను, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించి సాధించడంలోను, నందికొండ ప్రాజెక్టు సాధనలోను, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన పార్టీ సిపిఐ అన్నారు. స్థానిక సిపిఐ ప్రజాభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో జరిగిన ఏ ఉద్యమంలో కూడా పాలుపంచుకోని వారు, దేశసంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేవారు, దేశస్వాతంత్రోద్యమంలో పాల్గొనని వారు తామే నిజమైన దేశభక్తులమని తమకు తాము కితాబు ఇచ్చుకుంటూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ తెలంగాణలో జరిగిన ప్రతి ఎన్నికల్లో బొక్క బోర్లా పడుతున్నారన్నారు. తెలంగాణ ఏర్పడితే ఇంటికో ఉద్యోగం ఇస్తామని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ లేకుండా అందరిని పర్మి నెంట్ చేస్తామని, నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇస్తామని, కేజీ టూ పీజీ ఉచిత నిర్బంధవిద్య అందిస్తామని, తెలంగాణను ఉద్దరిస్తామని చెప్పి కేవలం తమ కుటుంబంలోని వారు మాత్రమే అన్ని పదవులు అనుభవించినవారిని ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో తిరస్కరించారన్నారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిపిఐ మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని పట్టభద్రులను వారు కోరారు.

## సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం తగదు : సబిత



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం తగదని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత అన్నారు. పట్టణంలో పలు ప్రాంతాలలో రోడ్డు మధ్యలో ఉన్న ఎర్త్ వైర్‌లను తొలగించాలని భువనగిరి పట్టణ ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయంలో సబ్ ఇంజనీర్ వి.గౌతమికి సోమవారం సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. భువనగిరి పట్టణంలో పలు ప్రాంతాలలో ఎర్త్ వైర్లతో రహదారి వెంట వెళ్లే వాహనదారులు, పాదచారులకు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు, గతంలో అనేకమార్లు ఈ ఎర్త్ వైర్లతో ప్రమాదాలు జరిగాయన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్నందున వెంటనే ట్రాన్స్‌కో అధికారులు రోడ్డు మధ్యలో ఉన్న ఎర్త్ వైర్లు తొలగించి ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా చూడాలని వినతిపత్రంలో కోరారు. సబ్ ఇంజనీర్ సానుకూలంగా స్పందించి వెంటనే తొలగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వస్తువుల అభిలాష్, పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా శిబిరాల ఏర్పాటు అభినందనీయం




**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు మహబూబాబాద్ వేసవి క్రికెట్ కోచింగ్ క్యాంపు క్రీడాకారులు ధన్యవాదాలు తెలిపారు. హెచ్‌సిఏ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం నెలరోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారులు సుమారు 150 మంది క్రీడా మెళకువలు నేర్చుకున్నారు. దీంతో పాటు వారం రోజులుగా అండర్ 19, అండర్ 16, అండర్ 14 విభాగాల్లో ఓపెన్ క్రికెట్ పోటీలను కూడా నిర్వహించి క్రీడాకారులతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం మహబూబాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి బి.అజయ్ సారథిరెడ్డి మాట్లాడుతూ క్రీడా శిబిరాల ఏర్పాటు అభినందనీయమన్నారు. ఈ ఓపెన్ క్రికెట్ క్యాంపుల నేర్చుకున్న క్రీడా మెళకువలతో పాటు పోటీలను నిర్వహించడంతో వారు మంచి ప్రతిభ కనబర్చే అవకాశం కలిగిందన్నారు. క్రీడాకారులు పోటీలలో పాల్గొని ప్రతిభను కనబర్చి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారు బి.విజయసారథిరెడ్డి, కోచ్ మెతుకు కుమార్, సహాయకులు తోట వినయ్, ఉపాధ్యక్షులు రావుల నవీన్‌రెడ్డి, సభ్యులు అయిలి సంతోష్, పెరుగు కుమార్, శ్రీనివాస్, రేషపల్లి నవీన్, గాదం శ్యాంప్రసాద్ యాదవ్, క్రీడాకారులు చరిత్ రెడ్డి, అనిర్వేష్, ధర్మచరణ్ రెడ్డి, బాబి, ముజాహిద్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## నానాజీపూర్ గ్రామపంచాయతీలో ఎసిబి దాడులు

ప్రజాపక్షం/ నార్సింగి : శంషాబాద్ మండలం నానాజీపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి రాధిక కరోబార్ బాలరాజులు ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండడ్‌గా దొరికిపోయారు. సోమవారం ఓ వ్యక్తి తెలిపిన సమాచారం మేరకు ఎసిబి అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయంలో సోదాలు నిర్వహించగా రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా దొరికిపోయారు. హైదరాబాదుకు చెందిన బర్కత్ అలీ 500 గజాల స్థలంలో కాంపౌండ్ వాల్ చిన్న రూము వేసుకోవడానికి గ్రామపంచాయతీ కార్యదర్శి రాధికను సంప్రదించగా ఆమె రూ.60 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. అంత డబ్బులు తాను ఇచ్చుకోలేనని చెప్పడంతో కరోబార్ బాలరాజుతో మాట్లాడిన తర్వాత రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.30 వేల నగదు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండడ్‌గా పంచాయతీ కార్యదర్శి రాధిక, కారోబార్ బాలరాజును పట్టుకున్నారు. కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.



## 'ఉపాధి' సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిడిఒ



ప్రజాపక్షం/యాచారం : ఉపాధి పనిని కూలీలందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈసంధర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయాలన్నారు. ఫిల్డ్ అసిస్టేంట్లు పనులను దగ్గరుండి చేయించాలన్నారు. చేసిన పనికి వారం వారం పేమెంటు మీ ఆకౌంట్‌లో సమచేస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కొలతల్లో తేడా రాకుండా మేజర్‌మెంటు ప్రకారం పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బోనస్ పెద్ద బోగస్ : హరీష్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఎన్నికల హామీని తుంగలో తొక్కిందని, వడ్లకు బోనస్ ఇచ్చే విషయంలో కూడా పచ్చి అబద్ధం ఆడి రైతులను మోసం చేసిందని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ నేత హరీష్‌రావు విమర్శించారు. రైతులు పండించిన వరి పంటకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో భాగంగా హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మారుస్తున్నదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తాము పండించిన పంటను అమ్మకానికి సిద్ధపడి బోనస్ కోసం ఎదురు చూస్తుండగా, వారందరి ఆశలు అడియాసలు చేస్తూ కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని, అది కూడా వచ్చే సీజన్ నుంచి ఇస్తామని మంత్రులు ప్రకటించడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సీజన్ నుంచే అన్ని రకాల వడ్లకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 90 శాతం దొడ్డు రకం వడ్లనే పండిస్తారని, పది శాతం పండే సన్న వడ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని, సన్న వడ్లకు మద్దతు ధర కంటే చాలా అధికంగా మార్కెట్లో ధర వస్తుందన్నారు. కానీ దొడ్డు రకం బియ్యానికే గిట్టుబాటు ధర రాదని, బోనస్ ఇవ్వాల్సింది దొడ్డు రకం వడ్లకేనని ఆయన అన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/కొత్తూరు: పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం కొత్తూరు మండల పరిధిలోని కోకోఫ్టమ్ రిసార్ట్‌లో (2002–2003)ఏళ్ల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన చిన్ననాటి స్నేహితులంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. గత అనుభవాలను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు. స్థానికంగా మొక్కలు నాటి తమ మధ్య లేని స్నేహితులను, గురువులను గుర్తు చేసుకుంటూ మౌనం పాటించారు. రానున్న విద్యా సంవత్సరంలో తాము చదివిన పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. చిన్ననాటి జ్ఞాపకాలను నేమరు వేసుకొని కొంతసేపు సంతోషంగా గడిపారు.

## భక్తిశ్రద్ధలతో బీరప్ప ఉత్సవాలు



ప్రజాపక్షం/కొత్తూరు: భక్తి శ్రద్దలతో బీరప్ప స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం నందిగామ మండల పరిధిలోని వెంకమ్మగూడ గ్రామంలో బీరప్ప స్వామి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి మొక్కులు చెల్లించేందుకు భక్తులు ఊరేగింపుగా బోనాలను తీసుకువచ్చి సమర్పించారు. గ్రామాన్ని చల్లంగా చూడు స్వామి అంటూ భక్తులు పెద్ద ఎత్తును బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళారు. పోతురాజుల విన్యాసాలు చూపరులను ఎంతగానో అకట్టుకున్నాయి. అదే విధంగా దేవాలయం ఆవరణలో ఆగ్నిగుండాలను ఎంతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ గొల్లపల్లి అశోక్, మాజీ సర్పంచ్ బయ్యాని రజినిత వీరేందర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మొగిలిగిద్ద మధు గౌడ్, మాజీ వార్డు సభ్యులు గుండాల సాములయ్య, గుండాల శోభారాణి, వేణుగోపాల్, కుమ్మరి దేవప్ప, గుండాల కవిత శ్రీనివాస్, మాల నరసింహ, గుడ్డే శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు చేవెళ్ల రాజయ్య, వడ్డే నారాయణలతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించాలి

హయత్ నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



ప్రజాపక్షం/ హయత్ నగర్ : జిహెచ్‌ఎంసి హయత్ నగర్ డివిజన్ పరిధి కమలా నగర్‌లో పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సోమవారం శానిటేషన్ జవాన్ లక్ష్మయ్యతో కలసి పారిశుద్ధ్య కార్మికుల విధి నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, తరచూ కాలనీవాసుల ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. కాలనీలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం ఉండడంతో కాలనీవాసులు అనారోగ్య బారిన పడే ప్రమాదం ఏర్పడుతుందని, కావున పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించాలని, కాలనీవాసుల నుండి ఏలాంటి ఫిర్యాదులు వచ్చిన చర్యలు తప్పమని పారిశుధ్య కార్మికులను హెచ్చరించారు.కార్యక్రమంలో కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టివి రావు, ప్రధాన కార్యదర్శి సుబ్బా రావు పాల్గొన్నారు.

## గేటు దిమ్మెకూలి చిన్నారి మృతి

ప్రజాపక్షం/షాద్‌నగర్: గేటు దిమ్మె కూలి చిన్నారి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మధురాపూర్ గ్రామానికి చెందిన పినమోని మల్లేష్ రమాదేవి దంపతుల చిన్న కుమార్తె సాక్షి (5) తన స్నేహితులతో అడుకుంటూ ఇంటి ముందు ఉన్న ప్రహరీగోడకు ఓరగబెట్టిన దిమ్మె పట్టుకోగా అది బాలిక తలపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది.తమ కళ్లముందే చిన్నారి విగతజీవిగా మారడంతో చూసిన ప్రతిఒక్కరు కన్నీళ్లు పెట్టుకున్నారు.



ప్రజాపక్షం /హైదరాబాద్: అన్నమాచార్య 616వ జయంతోత్సవాలో భాగంగా హైదరాబాదులోని రవీంద్రభారతిలో స్మరణ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలలో అలరించిన గోపు మనుశ్రీ

# క్రీడాప్రాంగణాల్లో 'సమ్మర్' సందడి

### ప్రత్యేక శ్రద్ధతో స్పోర్ట్స్ అథారిటీ క్యాంపుల నిర్వహణ







ప్రజాపక్షం/హైదరాబాద్ : మూడు దశాబ్దాల నుండి స్పోర్ట్స్ అథారిటీ వేసవి శిబిరాలను నిర్వహిస్తోంది. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహణలో హైదరాబాద్ జంటనగరాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల కేంద్రాలలో విజయవంతంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. జంట నగరాల్లో గత నెల 15న, జిల్లా కేంద్రాల్లో ఈనెల 1న ప్రారంభమైన ఈ వేసవి శిక్షణ శిబిరాలకు విద్యార్థినీ విద్యార్థులు, ఔత్సాహిక క్రీడాకారుల నుండి అనూహ్యమైన స్పందన లభిస్తోంది. ఈ వేసవి శిక్షణ శిబిరాలు పాల్గొంటున్న క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చర్యలు తీసుకుంటుంది. ఏడాది పాటు అనునిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థినీవిద్యార్థులకు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, యువజనాభివృద్ధి, పర్యాటక క్రీడలు, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఆదేశాల మేరకు, స్పోర్ట్స్ అథారిటీ వి.సి, ఎం.డి. డాక్టర్ కె. లక్ష్మి సూచనల మేరకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని స్టేడియాలతో పాటు 32 జిల్లా కేంద్రాల్లో ఈ వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయని అధికారులు చెప్పారు. అనుభవం కలిగిన క్రీడా శిక్షకులు, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన స్టేడియాలు, అందరికీ అందుబాటులో ఉండే విధంగా నిర్ణయించిన ఫీజు అధికారుల నిరంతర పర్యవేక్షణలో శిక్షణ జరుగుతుంది. శైలజ రామయ్యర్ ఆదేశాల మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఎం.డి. డాక్టర్ కె.లక్ష్మి , స్పోర్ట్స్ అథారిటీ అధికారులు మార్చి చివరివారం ఏప్రిల్ మొదటి వారం స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు, కోచులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా శిబిరాలను నిర్వహించాలని సూచించారు.

### శిబిరాలకు ప్రత్యేక నిధులు..

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వాణకు ప్రతి జిల్లాకు స్పోర్ట్స్ అథారిటీ రూ. 55 వేల రూపాయల నిధులను మంజూరు చేసింది. అన్ని జిల్లాల్లో హౌత్సాహిక క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలని లక్ష్యంతో స్పోర్ట్స్ అథారిటీ ప్రత్యేక కార్యచరణ రూపొందించి విజయవంతంగా అమలు చేస్తోంది. వేసవి సెలవు దినాలను విద్యార్థులు ఉల్లాసంగా గడిపేందుకు ఈ శిక్షణ శిబిరాలు ఉపయోగ పడుతున్నాయి. క్రీడలతో ఆనందం ఆరోగ్యం చదువులు, పోటీ పరీక్షలు, మార్కులు ర్యాంకుల ఒత్తిడి నుంచి బయటపడేందుకు విద్యార్థులకు క్రీడలు దోహదం చేస్తాయని అధికారులు వివరించారు. విద్యార్థుల్లో దాగున్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ శిబిరాలు ఉపయోగ పడుతున్నాయన్నారు.

### సామాన్యులకు అందుబాటులో..

సామాన్య, మధ్యతరగతికి చెందిన విద్యార్థులకు కూడా క్రీడా సౌకర్యాలను అందుబాటులోకి తేవాలన్న స్పోర్ట్స్ అథారిటీ లక్ష్యం ఈ శిబిరాలతో నెరవేరుతోంది. అనేక ప్రైవేట్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌లతో పోల్చుకుంటే స్పోర్ట్స్ అథారిటీ తక్కువ ఫీజుతో మెరుగైన శిక్షణ అందిస్తుండటంతో సామాన్య మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు శిబిరాలు అందుబాటులో ఉంటున్నాయన్నారు.

### వేసవి శిబిరాల ద్వారా ఆణిముత్యాలు..

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశఖ్యాతిని ఇనుమడింపచేసిన వాళ్లంతా క్షేత్రస్థాయిలో కష్టపడ్డవాళ్లే. ట్రిపుల్ ఒలింపియన్ ముఖేష్( హాకీ), పుల్లెల గోపీచంద్, గుత్తా జ్వాల, సైనా నెహ్వాల్, పివి. సింధు(బ్యాడ్మింటన్), రవికాంత్‌రెడ్డి, వెంకటనారాయణ (వాలీబాల్), అరుణ రెడ్డి (జిమ్నాస్టిక్స్) ఇలాంటి వారెందరో స్పోర్ట్స్ అథారిటీ శిక్షణ శిబిరాల్లో ఓనమాలు దిద్దిన వారే కావడం విశేషం.

## చిన్నాకు ప్రజానాట్యమండలి నివాళులు



ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ : ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యం చేసినా మారేడు చిన్నా మనమధ్య లేకపోవడం బాధకారం అని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలీటి రావినారాయణరెడ్డి నగర్‌లో చిన్నా 3వ వర్ధంతి సంధర్భంగా నిర్వాహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. చిన్నాచిత్రపటానికి పూల మాల వేసి నిహాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్‌నాయక్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేణుగోపాల్‌చారి, కుంటుంబసభ్యులు, సిపిఐ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అంటేనే కన్ఫ్యూజన్ పార్టీ

### కవిత అరెస్టుకు గగ్గోలు.. కేజ్రీవాల్‌కి మద్దతు హాస్యాస్పదం

### కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శ



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: లిక్కర్ స్కామ్ కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయమని గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును వ్యతిరేకిస్తూ ఆయనకు మద్దతు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని, అందుకే కాంగ్రెస్ పార్టీ అంటేనే ఒక కన్ఫ్యూజన్ పార్టీ అని చేవెళ్ల మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం 6 వ విడతలో ఎన్నికలు జరగబోయే దేశ రాజధాని ఢిల్లీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చేవెళ్ల పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంటు ప్రజలు అసెంబ్లీ ఎన్నికలతో సంబంధం లేకుండా మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ వైపు పార్టీలకు అతీతంగా మొగ్గు చూపారని చెప్పారు. డిపాజిట్లు రాని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సైతం ఇప్పుడు భారీ మెజారిటీ వస్తుందని విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి 31శాతం దళితులు ఉన్న రాయ్ బరేలిలో అవకాశం ఇవ్వకుండా, గాంధీ కుటుంబానికి రిజర్వ్ చేసుకున్నారని ఆయన విమర్శించారు. లిక్కర్ స్కామ్‌లో ప్రమేయం ఉన్న బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితను అరెస్టు చేయమని అరిచి గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ పార్టీ అదే లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కి మద్దతు ఇవ్వడం హాస్యాస్పదం అని అన్నారు. దేశ రాజధాని ప్రజలు అంతా భారతీయ జనతా పార్టీకి మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

## వర్షపు నీటి ప్రభావం లేకుండా శాశ్వత పరిష్కారం

### వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/వనస్థలిపురం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జిహెచ్‌ఎంసి పరిధిలో చేపడుతున్న పనుల్లో వర్షపు నీరు కాలనీపై ప్రభావం లేకుండా శాశ్వత పరిష్కారం చేయడం జరుతుందని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కాలనీ వాసులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనస్థలిపురంలోని క్రిస్టియన్ కాలనీ, అనురాధ కాలనీ, వెంకటరమణ కాలనీ స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనులు పూర్తి చేయడంతో, కాలనీల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థలు వాటర్ లైన్ ద్వారా డ్యామెజ్ కావడంతో వాటిని త్వర గా పనులు చేపట్టడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహాకారంతో 1.90 లక్షల నిధులు మంజూరు అయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. వనస్థలిపురం డివిజన్‌లో కొన్ని కాలనీలలో వర్షపు నీరు కాలనీపై ప్రభావం పడడంతో కాలనీల్లో నీరు చేరడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం కార్పొరేటర్‌కు కాలనీ వాసులు తెలియచేయడంతో ఉన్నత అధికారులతో కార్పొరేటర్ సమీక్షించి ప్రణాళిక రూపొందించి నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఆయన తెలిపారు. మరో పది రోజుల్లో పనులను ప్రారంభించి కాలనీలకు వర్షపు నీరు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. క్రిస్టియన్ కాలనీ నుంచి అనురాధ కాలనీ హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు వాటర్ స్ట్రోమ్ డ్రైన్ పనులు చేయడం జరిగిందని తెలిపారు. దానికి సంబంధించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థలు దెబ్బతీయడంతో వాటిని మరమత్తులు చేసి సమస్యకు పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఈ ప్రజ్ఞ, వివిధ కాలనీ వాసులు నవీన్‌కుమార్, హరినాథ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటయ్య, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వస్థలంలో అక్రమనిర్మాణాలు కూల్చివేత



ప్రజాపక్షం/నార్సింగి: గండిపేట మండల పరిధిలోని వట్టినాగులపల్లి లోనీ సర్వే నెంబర్ 128 ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను మండల రెవెన్యూ అధికారులు కూచివేశారు. గండిపేట మండల తాసిల్దార్ కు స్థానికులు నుంచి ఫిర్యాదులు రావడంతో ఆయన వెంటనే స్పందించి ఆర్ ఐ. విక్రమ్ రెడ్డి కి నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోమవారం జెసిబిల సాయంతో సర్వేనెంబర్ 128 లో గల రెండు అక్క నిర్మాణాలను కూల్చడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను నిర్మిస్తే ఎంతటి వారైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



అబ్దులాపూర్‌మెట్ : అబ్దులాపూర్ మెట్ మండలం పసుమములలోని ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 442లో అక్రమంగా నిర్మించిన భారీ షెడ్‌ను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీంద్రర్ దత్తు మాట్లాడుతూ కోట్లు విలువ చేసే భూమిలో కబ్జాదారులు అక్రమగా బారీ షెడ్ నిర్మించారని, తమ దృష్టికి రావడంతో జేసిబిలో కూల్చివేసినట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వ భూముల కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు

### ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి



ప్రజాపక్షం/యాచారం : పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన కొండాపురం శ్రీకాంత్ కు యాచారం మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గా సభావట్ నర్సింహ్మ మండల యూత్ కార్యదర్శిగా నియామక ప్రతంను ఎంఎల్ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, మండల యూత్ కాంగ్రేస్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా అంద జేశారు. ఈ సంధర్భంగా ఎంఎల్ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ యాచారం మండలంలో అన్నిగ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పని చేయాన్నారు. కాంగ్రేస్ పార్టీ అందరికి సముచిత స్థానం ఇస్తుందన్నారు. అందరు కలిసి కట్టుగా పని చేస్తే ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయం మనదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మూడేడ్ల గోవర్థన్‌రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు నర్రె శ్రీశైలం,మండల బిసిసెల్ ఉపాధ్యక్షులు శివలింగాచారి, మాజీ ఉప సర్పంచ్ నర్రె భాష, మాజీ ఎంపిటిసి కొంగరి యాదగిరి, ఎస్సి సెల్ గ్రామ అధ్యక్షులు ముచ్చర్ల యాదగిరి, పంది సుధాకర్, చంటి, దేశ్యా నాయక్, బిమ్లా నాయక్, మహేశ్, నరేంధర్, సాయి, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు

ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ ఎక్సైజ్ సిఐ టి.శేఖర్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫరూఖ్‌నగర్ మండలం కందివనం గ్రామంలో బెల్టుషాపులు జోరుగా నడుస్తున్నాయని ఆదివారం అధికారులకు ఫిర్యాదు రావడంతో గ్రామంలో ఉన్న బెల్టుషాపులను 24గంటల సమయంలో మూసి వేయాలని డిమాండ్ హెచ్చరించారు. గ్రామంలోని బెల్టు షాపుల్లో తనిఖీ చేయగా ఇద్దరి వద్ద మద్యం లభించిగా వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# నివాస ప్రాంతాల్లో హాస్టళ్ల గోల..?

### ఇంటి పర్మిషన్‌తో పేరుతో కమర్షియల్‌గా వినియోగం

### హాస్టళ్లతోనే కాలనీలలో అనేక సమస్యలు

### జిహెచ్‌ఎంసి అధికారులు చర్యలు తీసుకోవాలని

### కాలనీ సంక్షేమ సంఘం డిమాండ్



ప్రజాపక్షం/వనస్థలిపురం: హాస్టళ్లు నివాస ప్రాంతాల్లో నిర్వహించరాదు.. నివాస ప్రాంతాల్లో హాస్టల్ నిర్వహిస్తే ప్రజలు ఇబ్బందులకు గురైతారు. కానీ బిఎన్‌రెడ్డి నగర్ కాలనీలలో అనేక ఇంటి యజామాన్యులు వారు ఉన్న స్థలంలో ఇంటి పేరుతో కమర్షియల్ బిల్డింగ్ ఏర్పాటు చేసి అద్దెకు ఇవ్వడంతో అనేక సమస్యలు తలెత్తున్నాయని కాలనీలవాసులు వాపోతున్నారు. దీనిపై బిఎన్‌రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు గత కొనేళ్లుగా బిల్డింగ్ యజమానులకు అనేకసార్లు విజ్ఞప్తి చేశారు. హాస్టళ్లకు అద్దె ఇవ్వడం ద్వారా కాలనీలో వాటర్ సమస్య, డ్రైనేజీలు పొంగిపోర్లుతున్నడం వలన కాలనీ వాసులకు దుర్వాసన వెదజల్లుతుందని వారు తెలిపారు. అనేక సార్లు జిహెచ్‌ఎంసి వారికి తెలియచేసిన వారు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశామని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. హాస్టల్ ఉండడంతో డ్రైనేజీ సమస్య తీవ్రంగా వస్తుందని, సాయంత్రం కాగానే హాస్టళ్ల దగ్గర యువతీ, యువకులు రోడ్లపై ఉండడంతో కాలనీ వాసులు అక్కడి నుంచి వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారన్నారు. నిత్యావసర సరుకులకు వెళ్లాలన్న మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి తోటు రోడ్డుపైనే అనేక వ్యాపార బండ్లు ఉండడంతో కాలనీలోకి వెళ్లే పరిస్థితి లేకుండా ఉందని వారు తెలిపారు. హాస్టళ్ల నిర్వహకులు ఇష్టరాజ్యాంగ వ్యవహరించడంతో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు అనేక సమస్యలు వస్తున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై పండ్ల బండ్లు, కాలనీలో ఉన్న హాస్టల్‌ను సంబంధిత అధికారులు తొలగించాలని వారు డిమాండ్ చేశారు. డ్రైనేజీ పొంగిపొర్లడంతో కాలనీలో ప్రజలు వెళ్లే పరిస్థితి లేకుండా ఉందన్నారు. హాస్టళ్ల నిర్వహకులపై, బిల్డింగ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కాలనీ సంక్షేమ సంఘం తరుపున విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు టి.పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి ధన్‌రాజ్, ఉపాధ్యక్షులు జి.నవీన్ కుమార్, కోశాధికారి రాములు, రవికిరణ్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ పర్యటనలో జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్

## విరామ సమయంలో ఎపి నేతల ఎంజాయ్‌మెంట్

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ – అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రచారంలో అలసిపోయిన రాజకీయ నాయకులు ఫలితాలు వెలువడే వరకూ విరామ సమయంలో కుటుంబాలతో కలిసి విదేశీ పర్యటనలకు వెళ్ళి ఎంజాయ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ కుటుంబ సమేతంగా ఈనెల 17న యూరప్ పర్యటనకు వెళ్ళారు. ప్రతి పక్ష నాయకుడు చంద్రబాబునాయుడు కూడా కుటుంబ సమేతంగా విదేశీ పర్యటనకు వెళ్ళిపోయారు. చంద్రబాబు నాయుడు కుమారుడు లోకేశ్ కూడా ప్రస్తుతం కుటుంబ సమేతంగా అంతర్జాతీయ పర్యటనలో ఉన్నారు. మరోవైపు సినీ నటుడు, జనసేన పార్టీ వ్యవస్థాపకుడు పవన్ కల్యాణ్ విదేశీ పర్యటనకు వెళ్ళారు. ఆయన రెండు రోజుల్లో తిరిగి వస్తారని భావిస్తున్నారు. ఏ దేశం వెళ్ళారనే ఇతర వివరాలు చెప్పడానికి ఆ పార్టీ వర్గాలు తిరస్కరించాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈనెలాఖరులో రాష్ట్రానికి తిరిగి వస్తారని అధికార వర్గాలు అంచనా వేస్తుండగా, చంద్రబాబు కూడా మే నెలాఖరు నాటికే రాష్ట్రానికి చేరుకుంటారని వర్గాలు తెలియజేశాయి. ఈ సెలవుల విరామ సమయంలో చంద్రబాబు నాయుడు అమెరికాలో వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశాలు ఉన్నాయి. విదేశాలకు వెళ్ళే ముందుగా చంద్రబాబునాయుడు షిర్డీని కూడా సందర్శించారు. సాయిబాబా ఆలయంలో ప్రార్థనలు చేశారు. అనేక రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో నాయకులు ఎన్నికల్లో అలుపెరుగకుండా ప్రచారపర్వం సాగించారు. అనూహ్యమైన రీతిలో ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకున్నారు. ఎన్నో దిగజారుడు మాటలకు ఆంధ్రా రాజకీయాలు వేదికగా మారాయి. ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ స్థానాలకు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నికల్లో ఓటర్లు తమ తీర్పును ఇవిఎంలో నిక్షిప్తం చేశారు. 25 లోక్‌సభ నియోజకవర్గాలలో కూడా నువ్వా, నేనా అన్న రీతిలో ఎన్నికలు జరిగాయి. మొత్తం లోక్‌సభ సీట్లన్నీ తమకే వస్తాయని చంద్రబాబు ధీమాగా ఉన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని కూడా ఆయన ఎంతో ధీమాగా ఉన్నారు. అసెంబ్లీ సీట్లు కూడా సరిపడిన మెజారిటీలో వస్తాయని కచ్చితంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ధీమాగా సంసిద్ధంగా ఉండగా, మరోసారి అద్భుతం సృష్టిస్తామని,ప్రభుత్వం తమదేనని జగన్‌మోహన్ రెడ్డి కూడా ధీమాతో ఉన్నారు. ఎవరి లెక్కలువారు వేసుకుంటూ ఉత్కంఠతో కాలం గడుపుతున్నారు. చంద్రబాబు కుప్పం అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేయగా, జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గం నుండీ పోటీ చేశారు. నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గం నుండి పోటీ చేశారు. 2019లో ఇదే నియోజకవర్గం నుండి పోటీ చేసి ఆయన ఓడిపోయారు. వైఎస్‌ఆర్‌సిపి మొత్తం 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలకు పోటీచేయగా, ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామిగా ఉన్న టిడిపి 144 అసెంబ్లీ సీట్లకు, 17 లోక్‌సభ సీట్లకు పోటీ చేసింది. బిజెపి ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ సీట్లకు పోటీ చేయగా, జనసేన పార్టీ రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ సీట్లకు పోటీ చేసింది. మే 13 వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ ప్రక్రియ పూర్తికాగా, జూన్ 4 న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.



## ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణ

### డిఐఇఓ పరీక్ష నిర్వాహకులు సమావేశం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్న ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలను బోర్డు ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్ ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, అడిషనల్ సీ.యస్.డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లకు పూర్తిస్థాయి శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరం 6585 మంది, రెండవ సంవత్సరం 3719 మంది విద్యార్థిని విద్యార్థులు మొత్తం 10304 మంది పరీక్షలకు హాజరవుతున్నారని పరీక్షలు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తు కోసం ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయానికి విద్యార్థిని విద్యార్థులు ఉదయం 8 గంటలకు మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష వేళలకు ఒక నిమిషం ఆలస్యం అయిన పరీక్ష కేంద్రానికి అనుమతి ఉండదని తెలిపారు. గ్రామాల నుంచి విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేసుకోవడానికి వీలుగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఉదయం 7 గంటలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రానికి సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పరిశుభ్రత, త్రాగునీరు, మరుగుదొడ్లు, ఏర్పాటు చేయాలని, వైద్య అధికారులు, సహాయంతో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేసి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు హెల్త్ కిట్‌లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు ఉమా మహేశ్వర్ ,రవీందర్ చీఫ్ సూపరింటెండెంటులు డిపార్ట్ మెంటల్ అధికారులు , కార్యాలయ సిబ్బంది సందీప్, సాధిక్, అలీ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ మొగోడు... ఎక్కడికీ పారిపోలే : విహెచ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాహుల్‌గాంధీ మొగోడు ఎక్కడికి పారిపోలేదని, మోదీనే కావాలని రాహుల్ గాంధీపై ఆరోపణలు చేస్తున్నాడని మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మోడీ హటావ్ దేశ్ కి బచావ్ అని దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. మోడీ రైతుల నోట్లో మట్టి కొట్టిండని ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ పాద యాత్ర చేశాక ప్రజల సమస్యలు తెలుసుకున్నాడన్నారు. అమేథీ రాయబరేలిలో కాంగ్రెస్ ఖచ్చితంగా గెలుస్తుందని, ఈ సారి ఇండియా కూటమి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్త పరిచారు.నేడు రాజీవ్ గాంధీ 33 వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు.



**తీన్మార్ మల్లన్నను గెలిపించాలి: లింగం యాదవ్**

తీన్మార్ మల్లన్నను గెలిపించాలని పిసిసి అధికార ప్రతినిధి లింగం యాదవ్ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. కెసిఆర్ గడిలపాలన కు వ్యతిరేకంగా పని చేసిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని పేర్కొన్నారు. నిరుద్యోగులకు అండగా ఉండి పోరాటం మల్లన్న చేసిండన్నారు. మల్లన్న ను గెలిపిస్తే పట్టబద్రులకు అండగా ఉంటడన్నారు. పది ఏండ్ల లో మీరు ఒక్క ఉద్యోగం ఇచ్చారా కెటిఆర్, ఏ మొఖం పెట్టుకొని పట్టబద్రులను ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు.



## నర్సరీల తనిఖీ



ప్రజాపక్షం/మానవపాడు : జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం ఎంపిడిఓ ఆంజనేయ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మానవపాడు , చెన్నిపాడు గ్రామాలను సందర్శించి, వైకుంఠదామం, నర్సరీలను తనిఖీ చేయనైనది. షెగ్రిగేషన్ షెడ్లు నందు ఎరువుల తయారీకి, నర్సరీలపై తగు సూచనలు జారీ చేయడం జరిగింది.

## ఈ బైక్ ఎవరిది?



**ప్రజాపక్షం/మల్దకల్ :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అటెండర్ వెంకటేశ్ తన బైకు తీసుకుని నేరుగా ప్రభుత్వ కార్యాలయంలో ఆపాడు. దీనిపై అధికారులను ప్రశ్నించగా, సూపరింటెండెంట్ పెద్ద నరసన్న సత్యంకి ఫోన్ చేసి బైకు ఫోటో డిలీట్ చెయ్ కార్యాలయంలో ఆపాచు అని సమాధానం ఇచ్చారు. డ్యూటీలో ఉన్న ఎంపిడిఓ హరికృష్ణ చూసీ చూడనట్లు వ్యవహరించారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని అక్కడ ఉన్న ప్రజలు కోరారు.

## కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లలు మృతి

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా క్రిష్టగిరి గ్రామంలో గొల్ల నక్క మూసన్నకు చెందిన 25 గొర్రె పిల్లలను కుక్కలు దాడి చేసి ముక్కలు ముక్కలుగా కొరికి వేశాయి. కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందడంతో కాపరులు కన్నీటి పర్వతమయ్యారు. కుక్కలను అరికట్టాలన్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరారు. 1,50,000 వరకు నష్టం జరిగిందని మూసన్న ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కాపరులు కోరుతున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని జూరాల కాలువలో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ హరిప్రసాద్ రెడ్డి తెలియజేశారు. ఎవరైనా మృతి చెందిన వ్యక్తిని గుర్తు పట్టినచో పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలియజేశారు.



## కోడి మాంసం ధర పెరిగింది



ప్రజాపక్షం/మల్దకల్: మండల కేంద్రంలోని సోమవారం చికెన్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఉత్పత్తి తగ్గిపోవడం, కొనుగోళ్లు పెరగడం ధరల పెరుగుదలకు కారణమైంది. ఏకంగా 300 దాటింది. కడుపు నిండా చికెన్ తినాలంటే జేబు కాస్త ఖాళీ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చేసింది. గత కొద్దిరోజులుగా కొండెక్కి కూర్చున్న చికెన్ ధరలు వినియోగదారులకు చుక్కలు చూపించాయి. ఏపి, తెలంగాణ రాష్ట్రల్లో చికెన్ ధరలు భారీగా పెరిగాయి. గత వారం వరకు కిలో చికెన్ రేటు 250280 రూపాయల మధ్య ఉండగా, ఇప్పుడు మరింత పెరిగి కిలో ఏకంగా 300 రూపాయలు పలుకుతుంది. మరో 15 రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. మండుతున్న ఎండలు, వాతావరణంలో మార్పు కారణంగా కోళ్ల ఉత్పత్తి బాగా తగ్గిపోయిందని, జూన్ వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అంటున్నారు.



## కేంద్ర పరిశోధనబృందం అధ్యయనం

### గ్రామాల వనరులపై జిల్లాలో

### అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కేంద్ర సెక్రటేరియట్‌పరిధిలోని వివిధ శాఖల అసిస్టెంట్‌సెక్షన్ అధికారులు జిల్లాలోని ఐదు గ్రామాల్లో స్థితిగతులపై అధ్యయనం చేయనున్నట్లు నాగర్‌కర్నూల్‌స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కేంద్రప్రభుత్వ శిక్షణ అధికారుల బృందం పర్యటనపై కేంద్ర బృందం , జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ వివిధశాఖల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేసే అసిస్టెంట్‌సెక్షన్ అధికారులు జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలోని ఐదు గ్రామాల్లో ఎంపికచేసిన గ్రామాలను సందర్శించి గ్రామీణ ఆర్థిక, సామాజిక స్థితిగతులు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలుచేస్తున్న పథకాలను ఈబృందం ఐదురోజులపాటు మానవవనరులు, మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాల సరళిని పరిశీలించి మండల, గ్రామస్థాయి అధికారులతో సమావేశమై పలు అంశాలపై అధ్యయనం చేయనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణరాష్ట్రంలోని గ్రామాల్లో స్వచ్ఛభారత్ ద్వారా చేపట్టిన అభివృద్ధిపనులు , వివిధ అంశాలవారిగాచేపట్టిన పనులను అదనపు కలెక్టర్ బృందాల సభ్యులకు వివరించారు. కేంద్రపరిశోధనబృందం నాయకుడు హనుమంతు నాయకత్వంలోని ఐదుమంది సభ్యులతోకూడిన ఐదుబృందాలద్వారా 26మంది కేంద్రప్రభుత్వపరిధిలోని వివిధశాఖలకు చెందిన అసిస్టెంట్‌సెక్షన్ అధికారులు శిక్షణ నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లాలోని గ్రామాలను సందర్శించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వపథకాల అమలుతీరును పరిశీలించి వాటిపై నివేదికలు తయారుచేసి పంపుటకు జిల్లాలోని నాలుగు మండలాలపరిధిలోని ఐదు గ్రామాల్లో పరిశీలించుటకు రావడం జరిగిందన్నారు. చందుపట్ల, గన్యాగుల, అల్లాపూర్, బిజినేపల్లి, తెలకపల్లిగ్రామాలను ఎంపికచేసి ప్రతి గ్రామానికి ఐదుమంది అధికారులను ఐదురోజులపాటు ఈనెల 20వతేది సోమవారం నుండి ఈనెల 24వతేదివరకు సందర్శించుటకు అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈసమావేశంలో డిఆర్‌డిఏపిడి చిన్న ఓబులేసు, జిల్లాపంచాయతీ అధికారి కృష్ణ, వివిధశాఖల అధికారులు, కేంద్రప్రభుత్వ మంత్రిత్వపుశాఖల అసిస్టెంట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** తెలంగాణరాష్ట్ర ప్రజాసంక్షేమమే కాంగ్రెస్‌ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండలంలోని వెన్నచర్ల గ్రామంలో ప్రజా సమస్యలకోసం నిర్వహించిన గ్రామసభకు ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టూరిజంశాఖమంత్రి ఆధ్వర్యంలో వెన్నచర్ల గ్రామంతోపాటు పెద్దకొత్తపల్లి మండలాన్ని మరింత అభివృద్ధిచేస్తామని , ధరణిపోర్టల్‌లో రైతుల వివరాలు తప్పుగా నమోదై రైతుబంధు, రైతుబీమాఅందక ఇబ్బందులకు గురవుతున్న రైతుల సమస్యలను కాంగ్రెస్‌ప్రభుత్వం పరిష్కరించబోతుందని అన్నారు. వెన్నచర్ల గ్రామంలో తాగునీటి, అండర్‌డ్రైనేజి, వీధిలైట్ల సమస్యను పరిష్కరిస్తామని, అదేవిధంగా గ్రామానికి వందడబుల్‌బెడ్‌రూమ్ వచ్చే అవకాశం ఉందని, నిజమైన లబ్ధిదారులకు అందిస్తామని గ్రామప్రజలందరూ సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండి యూసుఫ్‌అలీ, డిప్యూటి తహసీల్దార్ రమేష్‌నాయక్, ఎంపిడిఓ నాగేంద్రం, ఎంపిఓలక్ష్మణ్‌నాయక్, ఎంపిటిసి రవికుమార్, సర్పంచ్ దేవరపాకరాధాబాలస్వామి, ఉపసర్పంచ్ బీరంభాస్కర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పర్వతాలు, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగశేషయ్య, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ముచ్చ పోతుశంకర్, వంగూరు రాంప్రసాద్, గ్రామప్రజలు పాల్గొన్నారు.



## సమయపాలన లేని అధికారులు



**ప్రజాపక్షం/మల్దకల్ :** మాదే ఆఫీసు మా ఇష్టం వచ్చిన సమయానికి మేము వెళ్తాం మమ్మల్ని ఎవరేం చేయలేరు. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయానికి సోమవారం ఉదయం 11 అవుతున్న ఉద్యోగులు రాని సంఘటన చోటు చేసుకుంది. ఉదయం 11 అవుతున్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. మండలంలో ఏ పని జరగాలన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి మండల రెవెన్యూ కార్యాలయానికి ప్రజలు వెళ్తుంటారు. కానీ అందులో ఉన్న ఉద్యోగులు 11 అవుతున్న కార్యాలయానికి రాకపోవడంతో వచ్చిన ప్రజలు ముక్కు మీద వేలు వేసుకుంటున్నారు. కాళీ కుర్చీలు దర్శనం ఇవ్వడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సమయపాలనతో పాటు తమ విధులను సక్రమంగా నెరవేరుస్తారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం సమయపాలన పాటించకుండా పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయమే కదా తమ ఇష్టం వచ్చిన సమయానికి రావచ్చన్న దిమాతో ఉద్యోగులు ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఉదయం 11 అవుతున్న మండల రెవెన్యూ కార్యాలయం, ప్రజా పరిషత్ కార్యాలయంలో కుర్చీలు దర్శనమిస్తున్నాయి. అంటే ఈ శాఖ అధికారులు ఎంత నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో ఎక్కే అర్థం చేసుకోవచ్చు ఇప్పటికైనా సమయపాలన పాటించండి ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ త్వరగా యాక్షన్ తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## అమ్రాబాద్ అడవుల్లో జంతువుల లెక్కింపు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అడవిప్రాంతంలో అమ్రాబాద్ టైగరురిజర్వులో శాఖాహారజంతువుల లెక్కింపు నిర్వహిస్తున్నామని అటవీక్షేత్రాధికారి ఈశ్వర్ తెలిపారు. అమ్రాబాద్, అచ్చంపేట, నాగార్జునసాగర్ మూడు డివిజన్లు ఉన్నాయి. ఈమూడు డివిజన్లలో అచ్చంపేట, నాగార్జునసాగర్ డివిజన్ శాఖాహారజంతువుల సర్వే పూర్తిచేశామని , ఈనెల 21నుంచి 23వరకు మూడురోజులపాటు అమ్రాబాద్ డివిజన్ సర్వేచేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నల్లమల అడవిలోని అమ్రాబాద్‌డివిజన్‌లో 25పెద్ద పులులు ఉండగా, 12 జంటలున్నాయని వీటిలో నాలుగు పెద్దపులులు పొరుగురాష్ట్రాలనుంచి వలస వచ్చినట్లు తెలిపారు. వాటికి కావాల్సిన ఆహారం సమృద్ధిగా ఉందాలేదా అనే విషయంపై సర్వే ఆధారంగా తెలుసుకొని సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. 20,611 కిలోమీటర్లవరకు నల్లమలలో గణన చేస్తున్నట్లు తెలిపారు.

**సర్వే ఎందుకంటే..**

వన్యప్రాణుల సంరక్షణలోభాగంగా అమ్రాబాద్ డివిజన్ పరిధిలోని మన్ననూర్ , అమ్రాబాద్, మద్దిమడుగు, దోమలపెంటరేంజ్‌లో సర్వే నిర్వహిస్తున్నామని ఇందులో మాంసాహార జంతువులైన జాతీయజంతువు పెద్దపులి, చిరుతపులిలాంటివి ఏమేరకు ఆహారాన్ని ఇచ్చేశాఖాహార జంతువులు ఎన్ని ఉన్నాయో అంచనావేసేందుకు ఈసర్వే చేస్తున్నామని తెలిపారు. ఎన్‌టిసిఎ అథారిటి న్యూఢిల్లీవారి ఆదేశానుసారం సర్వేచేస్తున్నామని తెలిపారు.



## చరిత్ర సృష్టించాలి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** క్రికెట్‌లో మహబూబ్‌నగర్ చరిత్రను సృష్టించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రికెట్ పైన మమకారంతో గత కొన్ని రోజులుగా ఎంతో విలువైన సమయాన్ని వినియోగించుకొని, శిక్షకులు చేత క్రికెట్ లో ఎన్నో మెలుకువలు నేర్చుకొన్న మీ అందరికి భవిష్యత్తులో క్రికెట్‌లో రాణించేందుకు ఉపయోగం ఉంటుందని ఆయన చెప్పారు. మన జిల్లా కు రాష్ట్ర రాజధాని అని ఆయన చెప్పారు. మన జిల్లా కు రాష్ట్ర రాజధాని అతి సమీపంలో ఉంది. అవసరమైతే హెచ్‌సిఏ ద్వారా నిపుణులైన కోచ్‌ల చేత నాణ్యమైన శిక్షణ ఇప్పించే విధంగా ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే హెచ్‌సిఏ అధ్యక్షులు జగన్ మోహన్ రావు తో సంప్రదించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా క్రికెట్ మైదానాన్ని పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని హైదరాబాద్ స్థాయిలో క్రికెట్ ను ఇక్కడ అభివృద్ధి చేసుకుంటే ఎంతో మంది క్రీడాకారులకు అవకాశం కల్పించే వాళ్లం అవుతామని ఆయన చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, చీఫ్ ప్యాట్రన్ మనోహర్ రెడ్డి, రాజశేఖర్ , సురేష్, కృష్ణమూర్తి, కౌన్సిలర్స్ పాపారాయుడు, జాజి మొగ్గ నర్సింహులు, మోతిలాల్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, రాజేందర్ రెడ్డి, గట్టు వెంకట్ రెడ్డి, కోచ్ అబ్దుల్లా, గోపాలకృష్ణ, మన్నన్, అబిద్ , సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తిపోతల పథకాలు పరిశీలించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం / కొత్తకోట :** మదనపురం మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, మాజీ ఎమ్మెల్యే ఆలసత్వం కారణంగా శిథిలావస్థలో ఉన్న ఎత్తిపోతల పథకాలను ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన రామన్ పాడు ఎత్తిపోతల, శంకర్ సముద్రం ఎత్తిపోతల , సరళసాగర్ ఎత్తిపోతల, కురుమూర్తి రాయ ఎత్తిపోతలను పరిశీలించి వాటి కింద ఉన్న మోటార్లను స్థానిక రైతులు , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలువురు ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించి, అనంతరం నామమాత్రంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన పేరూర్ ఎత్తిపోతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు వాటి కింద మోటర్లు శిథిలావస్థకు చేరి ఆయకట్టుకు నీరు అందక ఎత్తిపోతల పథకాల కింద ఉన్న సుమారు పదివేల ఎరాలు బీడు పడ్డాయని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కనీసం ఎత్తిపోతల పథకాలను పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి మోటార్లకు రిపేర్లు చేయించి అవసరమైన చోట్ల కొత్త మోటర్లు బిగించి ఆయకట్టురైతాంగానికి నీరందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి సబ్‌డివిజన్‌పరిధిలోని ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 6గంటలనుంచి 9గంటలవరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు కల్వకుర్తి ఏడిఈ చంద్రశేఖర్, ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కల్వకుర్తి ఓల్డ్‌సబ్‌స్టేషన్‌పరిధిలో రెండుఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని , అదేవిధంగా రాచూర్, తర్నికల్, పోల్కంపల్లి,బొల్లంపల్లి సబ్‌స్టేషన్లపరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్‌లైన్లలో మరమ్మత్తుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని ఈవిషయాన్ని వినియోగదారులు గమనించి సంస్థ సిబ్బందికి సహకరించాలని కోరారు. కల్వకుర్తి పట్టణంలోని బస్టాండు, శివాజీచౌక్, ప్రభుత్వ ఆస్పత్రి, మహబూబ్‌నగర్‌చౌరస్తా, మార్చాలరూట్లలో సరఫరా నిలిచిపోతుందన్నారు.

## ఎల్‌ఓసి అందజేత

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణానికిచెందిన నేరటిచిరంజీవి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీసర్పంచ్ బృంగిఆనంద్ కుమార్ ఎంఎల్‌ఏ కసిరెడ్డినారాయణరెడ్డిద్వారా రూ.2,50,000 ఎల్‌ఓసికాఫిని బాధితునికి బృంగి ఆనంద్‌కుమార్ అందజేశారు. అందజేసినవారిలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, షానవాజ్‌ఖాన్, నేరటిచిన్న, రాంపర్వతాలు, దామోదర్‌రెడ్డి, ఆంజనేయులు, కేశవులు, శివకృష్ణ, సురేష్, పరుషరాములు పాల్గొన్నారు.



## మెగా హెల్త్‌క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మెగాహెల్త్‌క్యాంపును మండల పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శంకరనేత్రాలయచైర్మన్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలపరిధిలోని దిండిచింతపల్లిలో సోమవారంనుండి 8రోజులపాటు శంకరనేత్రాలయ చైన్నై వారి ఆధ్వర్యంలో మెగామొబైల్‌కంటి సర్జరీహెల్త్‌క్యాంపును ఇందుర్తిఫ్యామిలి సహకారంతో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రరోడ్డుభవనాల ఈఎన్‌సి ఇందుర్తి గణపత్‌రెడ్డి , నిర్వాహకులు బాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, హన్మంత్‌రెడ్డి, జలంధర్‌రెడ్డిలు హాజరై హెల్త్‌క్యాంపును ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారంరోజులపాటు నిర్వహిస్తున్న మెగాహెల్త్‌క్యాంపుకు చుట్టుపక్కల గ్రామాలప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. అంధత్వంకలిగి కంటి సమస్యలతో బాధపడుతున్నవారు మెగా హెల్త్‌క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైనవారికి కంటి ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇందుర్తిరవిమాలతి, సరిత, బత్తిని రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సరిత,ఎంపిటిసి సాయిలు, పంచాయతీకార్యదర్శి అల్లాజి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఎస్‌పికి ఆర్జీలు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులలో భాగంగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఫిర్యాదుదారులు హాజరై సమస్యలను ఎస్పీ కి తెలియజేసి అర్జీలను సమర్పించారు. వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదు దారులకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. మొత్తం 9 దరఖాస్తులు వచ్చాయి. సామాన్య ప్రజలకు పోలీసు అండగా ఉండాలని వారితో స్నేహభావంగా మేసులుకోవాలని తెలిపారు.

## జ్యోతిరెడ్డి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** హాకి క్రీడాకారిణి జ్యోతి రెడ్డి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి తొలిసారిగా భారత హాకి జట్టుకు ఎంపికైన తొలి తెలంగాణ అమ్మాయి జ్యోతి రెడ్డి భారత దేశ హాకి జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించేందుకు ఒలింపిక్ క్యాంపుకు ఎంపికైనందున ఆయన ఆదివారం హైదరాబాద్ ఎల్.బి స్టేడియంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాకి క్రీడలో రాణించాలని తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వి చాముండేశ్వర్నాథ్, హెచ్ సిఏ అధ్యక్షులు ఎ. జగన్ మోహన్ రావు, రఘునందన్ రావు, ప్రముఖ సినీ దర్శకుడు వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై మీ సేవలు మరింత సులభతరం

కమిషనర్ రవి కిరణ్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మీసేవ ద్వారా జారీ చేసే ధృవపత్రాల జారీ ప్రక్రియను ఇకపై మరింత సులభతరం చేసేందుకు అవసరమైన మార్పు చేర్పులు చేస్తామని మీసేవ కమిషనర్ రవి కిరణ్ తెలిపారు. గురువారం విసి మీటింగ్ హాలులో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్న సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొద్ది కాలంగా మీసేవ ద్వారా ప్రజలకు అవసరమైన ధృవపత్రాలు జారీ చేసే విషయంలోఅనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న విషయాన్ని పలువురు తహసీల్దార్లు తెలిపిన మేరకు కమిషనర్ ఈ మేరకు సమాధానమిచ్చారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/మర్పల్లి :** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని మల్లికార్జున గిరి గ్రామంలో పెద్దింటి బిమమ్మ మృతి చెందరు గ్రామస్తులు ద్వారా తెలుసుకోని ఎస్‌కేఆర్ ట్రస్ట్ చైర్మన్ మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొండల్‌రెడ్డి, బిమమ్మ కుటుంబసభ్యులను పరామర్శించి అంత్యక్రియలకు 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా కట్టమైసమ్మ జాతర



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేట మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఉన్న కట్టమైసమ్మ తల్లికి అలియాబాద్ గ్రామ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా అమ్మవారికి బోనాలు సమర్పించడంతో పాటు జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం పోసి తమ మొక్కులను తీర్చుకున్నారు. అలియాబాద్ గ్రామం నుంచి రంగం, గావు, సర్వగంప, గంగ తెప్పలను ఊరేగింపుగా తీసుకవచ్చి అమ్మవారికి సమర్పించారు. కట్టమైసమ్మ జాతర సందర్భంగా శామీర్‌పేట చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని తరించారు. జాతరతో చుట్టు పక్కల గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్క కుమార్‌యాదవ్, మాజి ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి అద్యక్షుడు కమఠం కృష్ణారెడ్డి, మాజి వైస్ ఎంపిపి హృదయ్‌కుమార్, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## 28న మూడుచింతలపల్లి మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపిడివో వత్సలాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి అధికారులు అందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఏ శాఖకు సంబందించిన ఆ అధికారులు పూర్తి సమాచారంతో సభకు రావాలని సూచించారు. ఎంపిపి హారికమురళిగౌడ్ అద్యక్షతన సభను నిర్వహిస్తామన్నారు. ఎంపిటిసిలు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు సమయానికి విచ్చేసి సభను జయప్రధం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

## తండాలో మూతలేని మ్యాన్‌హోల్



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని దుండిగల్ తండా 2లో ఎక్కడ చూసినా మూత లేని మాన్ హోల్స్ దర్శనమిస్తున్నాయి. దుండిగల్ మున్సిపల్ అధికారులు, డ్రైనేజీ పైన కొన్ని నెలలు కావస్తున్నా వాటిపై బిళ్ళ లు ఏర్పాటు చేయడం మరిచారు. ఆకాలంగా కురుస్తున్న భారీవర్షాలకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరుబాధ్యత వహిస్తారో అధికారులు తెలపాలని తండావాసులు అంటున్నారు. ఇప్పటికైనా ఇలాంటి వాటిని ముందస్తుగా గుర్తించి పరిష్కారం చేయవలసిందిగా స్థానికులు అధికారులను వేడుకుంటున్నారు.

## గిరిజనలకు 3,5,8 తరగతుల్లో ప్రవేశాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** గిరిజన బాల బాలికలకు బెస్ట్ అవెలబుల్ స్కూళ్లల్లో ప్రవేశాలకు మేడ్చల్ జిల్లాకు గాను 46 సీట్లు కేటాయించారని జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సీట్లలో మూడవ తరగతికి గాను 22 సీట్లు, ఐదవ తరగతికి గాను 12 సీట్లు, ఎనిమిదవ తరగతికి గాను 12 సీట్లు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాకు చెందిన గిరిజన తెగలకు చెందిన లంబాడా, ఎరుకల, ఇతర ఉప కులాలకు సంబంధించిన విద్యార్థినీ విద్యార్థులు ప్రవేశాల కోసం ధరఖాస్తు చేసుకోవాలని, పూరించిన ధరఖాస్తు ఫారాలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తమ కార్యాలయంలో జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని, ధరఖాస్తుఫారాలు కార్యాలయంలో ఉచితంగా లభిస్తాయని పేర్కొన్నారు. తమ ధరఖాస్తులతో కులం, ఆదాయం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుండి తీసుకొన్న బోనఫైడ్ సర్టిఫికెట్, తాజాగా తీసుకొన్న 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు జత పరచాల్సి ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం తమను 9959159629 నంబరుకు ఫోన్ చేసి తెల్సుకోవచ్చున్నారు.

## బాక్స్‌డ్రైన్ పనులు పూర్తి చేయండి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మా ప్రాంతాల్లో చాలా కాలంగా బాక్స్‌డ్రైన్ పనులు అసంపూర్తిగా ఉ న్నాయని వెంటనే పూ ర్తి చేయాలని ఈస్ట్ ఆ నంద్ బాగ్ డివిజన్ ప్రాంత వాసులు మల్కాజిగిరి శాసనసభ్యుడికి వినతిపత్రం ద్వారా మొరపెట్టుకొన్నారు. షిరిడి కాలనీ అధ్యక్షుడు రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ రాధారాణి, ప్రసాద్‌రెడ్డి, సాయికిరణ్ గౌడ్ తదితరులు సోమవారం ఎమ్మెల్యేను కలిసారు. రెండు



రోజుల క్రితం కురిసిన భారీ వర్షం కారణంగా రహదార్లపై గుంతలు ఏర్పడ్డాయని, వర్షం పడితే గుంత లు కనపడక పోవటంతో బైకులపై వెళ్లే ప్రజలు ప్రమాదాలకు గురి కావల్సి వస్తోందన్నారు. అదే విధంగా కాలనీల్లోని అనేక ప్రాం తాల్లో డ్రైనేజి పైపులు పగిలి పోయి మురికి నీరు పొంగి పొర్లుతోందని, దీని వల్ల అనారోగ్యాలకు గురి కావల్సిన పరిస్థితులు నెలకొని తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో గిరిజన బాల బాలికలు

# దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలోని గిరిజన బాల బాలికల నుండి 2024 2025 విద్యాసంవత్సరనికి బెస్ట్ అవైలబుల్ 3.,5, 8,వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలో 64 సీట్లు ఖాళీలు ఉండగా 3వ తరగతిలో 32 లంబాడ బాలురు18 మంది, బాలికలు11, చెంచులు 3 ఖాళీలుండగా బాలురు 1, 22కి అవకశం ఉన్నట్లు అయన తెలిపారు. ఐదవ తరగతిలో 16 ఖాళీలు ఉండగా 10లంబడా బాలురకు ,04 బాలికలకు , ఒక్కొక్కటి చొప్పున కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహంచేందుకు చర్యలు తీసుకోవాలి, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి నాయక్ వికారాబాద్ జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బంధీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకొవాలని అధికారులను అదేశించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ పరీక్షలల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సజావుగా నిర్వహించేందు అధికారులు చర్యలు తీసుకొవాలన్నారు. ఇంటర్మీడియట్ మొదటి,రెండవ సంవత్సరం అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుండి జున్ 3వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మొదటి సంవత్సరం 9నుండి 12 గంటల వరకు అదేవిధంగా రెండవ సంవత్సరం పరీక్ష మధ్యాహ్నం 2.30 నుండి 5.30 రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కోన్నరు. పరీక్షలు నిర్వహించేందుకు వికారాబాద్ 6, తాండూర్ 4, పరిగి 4 కేంద్రాలను అదేవిధంగా నవాబ్‌పేట్ పెద్దముల్ ,మర్పల్లి ,మోమిన్‌పేట్, దోమ, కొడంగల్ కూల్కచర్ల ,మండలాల్లో ఒక్కో పరీక్ష కేంద్రం చొప్పున మొత్తం 20పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను కల్పించినట్లు అయన తెలిపారు. ఇంటర్ మొదటి రెండవ సంవత్సరం జనరల్ ఒకేషనల్ 7831 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారు. మొదటి సంవత్సరం 4621 మంది ,రెండవ సంవత్సరం 3210 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని తెలిపారు. ఈ నెల 21వరకు 2వేల ఆలస్య రుసుంతో సప్లమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించుటకు గడువు పెంచినట్లు తెలిపారు.

**పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష మే 24న ,జిల్లా సమ-న్వయకర్త పరమేశ్వర్ :** పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024 2025 సంవత్సరినిక సంబంధించి పాలిటెక్నిక్ పరీక్ష ఉదయం 11గంటల నుండి 1.30 వరకు నిర్వహించనున్నట్లు అయాన తెలిపారు. వికారాబాద్ జిల్లా కు చెందిన 1321 అభ్యర్థులు అందులో గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాల కొంపల్లిలో 600 మంది శ్రీ అనంతపద్మనాభ, డిగ్రా కళాశాలలో 481 భృంగిఇంటర్నేషనల్ స్కూల్ ఎన్నెపల్లి లో 600 మంది హాజరు అవుతున్నాట్లు తెలిపారు.

## పిడుగు పడి ఒకరు మృతి.. ముగ్గురికి అస్వస్థత



**ప్రజాపక్షం / కొడంగల్:** కొడంగల్ మండలంలో పిడుగు పడి ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు అస్వస్థతకు గురైన ఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. తహశీల్దార్ విజయ్‌కుమార్ కథనం మేరకు రంగారెడ్డి జిల్లా మంచాల మండలం జపాల్ గ్రామానికి చెందిన భగవంతు అనే వ్యక్తి మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పోలంలో కడిలు వేసేందుకు కూలీ పని నిమిత్తం రావడం జరిగిందన్నారు. మధ్యాహ్నం సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడే క్రమంలో ప్రమాదవశాత్తు పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని పెద్దనందిగామ గ్రామానికి చెందిన ఫారూఖ్, సుల్తాన్‌మియా, మఫ్లీమాతౌహిన్‌లు రోజు మాదిరిగానే పోలానికి వెళ్లడంతో వర్షానికి పోలంలో ఉన్న రేకుల షేడ్ కిందకు వేళ్లడం జరిగింది. పరిసర ప్రాంతంలో పిడుగు పడే క్రమంలో ముగ్గురు నీలు చుండటంతో పిడుగు పాటుకు సృహ తప్పిపోయి అస్వస్థతకు గురి కావడంతో స్థానికులు వెంటనే కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో ఉపిరి పీల్చుకున్నారు.

## ఇకపై అంతటా టిఎస్ స్థానంలో టిజి అమలు చేయాల్సిందే: కలెక్టర్ గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఇక నుండి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల అధికారులు అధికారికంగా టిఎస్ స్థానంలో టిజి అమలు చేయాల్సిందేనని జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు. టిఎస్ స్థానంలో టిజిగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొన్న అధికారిక నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిన దరిమిలా అమలులోకి వచ్చిందన్న విషయాన్ని ఆయన తెలియచేసారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, స్వయం ప్రతిపత్తి(అటానమస్) సంస్థలు, కార్పొరేషన్లు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలు తప్పని సరిగా టిజిగా మార్చుకోవాలన్నారు.

లెటర్ హెడ్స్, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ జివోలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లన్నింటిపైనా టిఎస్ స్థానంలో టిజి చేకూర్చాలన్నారు.

## చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారిన రహదారులు



**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్‌లో సోమవారం మధ్యాహ్నం కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్లు చిత్తడి చిత్తడిగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. పట్టణంలోని వడ్డర్‌గల్లీ చితారుపెరుమళ్ల దేవస్థాన సమీపంలో వర్షానికి సీసీ రోడ్డు చెరువును తలపిస్తుండటంతో అటువైపు వెళ్లేవారందరు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఇంటిలోకి వేళ్లలంటే బురదనీటిలో నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని దీనిపై మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు.



అదేవిధంగా ఆర్‌టీసీ బస్టాండ్‌లో ఇటీవలే ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల మట్టిని తవ్వి ఇష్టానుసారంగా పనులు చేయడంతో బస్టాండ్ ప్రాంగణం బురదమయం అయి ప్రయాణికులు పలు ప్రమాదాలకు గురి అవుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రయాణికులు ఆర్‌టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు చేస్తున్న సమయంలో అక్కడ ఉన్న కొంతమంది వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు వస్తాయని ముందే హెచ్చరించిన వాళ్లు పట్టించుకోలేదని వాపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోంత నియోజకవర్గంలో ఆర్‌టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు కిందపడిపోతున్న ఏ ఒక్క అధికారి అయిన ఎందుకు స్పందించడం లేదని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. నిత్యం వందల వేల మంది రాకపోకలు సాగిస్తున్న ఈ బస్టాండ్‌పై నిర్లక్ష్యం తగదని వెంటనే బస్టాండ్‌ను సుందరీకరణ చేయాల్సిందేనని పలువురు ఆరోపిస్తున్నారు.

## బెంగాల్‌లో 'వాషింగ్ మెషీన్' తిప్పుతూ

# అవినీతి నిర్మూలన కబుర్లెలా చెబుతారు?

బిజెపిపై కాంగ్రెస్ ధ్వజం

**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో అవినీతిపరులను పార్టీలో చేర్చుకుని వారికి క్లీన్‌చిట్‌లు ఇచ్చే 'వాషింగ్ మెషీన్' ప్రక్రియను ముమ్మరంగా నడుపుతూ మరోవైపు బిజెపి అవినీతి నిర్మూలన గురించి ఎలా మాట్లాడుతుందని కాంగ్రెస్‌పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. కాంగ్రెస్‌పార్టీ పెద్ద ఎత్తున పశ్చిమ బెంగాల్‌లో ప్రచార ర్యాలీలు నిర్వహిస్తున్న తరుణంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ బిజెపికి అనేక ప్రశ్నలు సంధించారు. సువేందు అధికారి, తపన్ రాయ్ ఇద్దరూ బిజెపిలో చేరిన వెంటనేవారిపై సిబిఐ, ఇడిలు తీసుకున్న చర్యలను ఎందుకు ఆపేశారో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చెప్పాలని ఆయన నిలదీశారు. అందరికీ సులభంగా అర్థమవుతున్న ఈ విషయంపైనే మోడీ దృష్టిపెట్టి వివరణ ఇవాలన్నారు. ''కుర్మీ కులస్థులు చేస్తున్న డిమాండ్లపై ప్రధానమంత్రివద్ద ఏమైనా పరిష్కారాలు ఉన్నాయా? తమ్లుక్ నియోజక అభ్యర్థి అభిజిత్ గంటూలీ చేసిన జాతి వ్యతిరేక ప్రకటలపై ప్రధానమంత్రి వైఖరి ఏమిటి? సువేందు అధికారి సిబిఐ కేసు బిజెపి వాషింగ్ మెషీన్‌లో కొట్టుకుపోయిందా?'' అని జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు. కుర్మీ కులస్థుల సమస్యలు ఏవీ పరిష్కరించకుండా మరోవైపు సిగ్గులేకుండా వారిని ఓట్లు అడిగేందుకు తయారయ్యారని విమర్శించారు. ''ఈ కులస్థులు దీర్ఘకాలంగా తమను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరుతున్నారు, కానీ మోడీ సర్కార్ నాన్పుడు ధోరణి అవలంబిస్తున్నది, రాష్ట్రప్రభుత్వం తనవతుగా2017లో కేంద్రానికి కల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రిపోర్టు సమర్పించిన తర్వాత కూడా మోడీ పట్టించుకోలేదు, అగ్ర కులస్థులు వారి డిమాండ్లను తోసిపుచ్చుతున్నారు'' అనని రమేశ్ విమర్శించారు. కుర్మీలకు సాంస్కృతిక గురర్తింపును కూడా బిజెపి తిరస్కరించిందన్నారు. కుర్మీలను బిజెపి ఎందుకు మోసం చేసిందని ఆయన నిలదీశారు. ''కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన న్యాయ్ పాత్ర గ్యారంటీ జాతీయస్థాయిలో కులసర్వే చేసి వెనుకబడిన ప్రతి వర్గానికీ దేశంలో అవకాశాలు అందుబాటులోకి తెస్తుంది'' అని ఆయన అన్నారు. ఇప్పుడు పదవి నుండి వైదొలగుతున్న ప్రధానమంత్రి మోడీ ప్రతిచోటా నోటిమాటలు చెబుతున్నారు తప్ప చేసిందేమీ లేదు, కుర్మీ కులస్థులు పాటించే మతపరమైన ఆచారాలను గుర్తించడానికి ప్రభుత్వం సిద్ధంగాఉందా? అని ప్రశ్నించారు. బిజెపి తరపున ఎన్నికల్లో పోటీ చేయడం కోసం జస్టిస్ గంగూలీ తన పదవికి రాజీనామా చేయడం చూస్తే దేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రతపై సందేహాలు తలెత్తుతున్నాయన్నారు. ''ఇప్పుడు గంగూలీ భారత జాతీయాతా వాదం కూడా ప్రశ్నార్థకంగా మారింది, గాంధీ – గాడ్సే ఇద్దరిలో ఎవరిని ఎంచుకుంటారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడానికి సమయం కావాలని అడిగారు! ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి కూడా సమయం కావాలా?'' అని ఆయన ప్రశ్నించారు. బిజెపి ఎంపీలు, ఎంపి అభ్యర్థులు దేశంలో రాజ్యాంగ మార్పు గురించి మాట్లాడుతున్న తరుణంలో ఈ విధమైన సమాధానాలు దేశంలో అందరికీ ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ''గాంధీ – గాడ్సే ఇద్దరిలో ఎవరిని ఎంచుకుంటారన్న విషయంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ వ్యక్తిగత వైఖరి ఏమిటో చెప్పగలరా?'' అని ప్రశ్నించారు. నారదా అవినీతికి సంబంధించి సువేందు అధికారిపై 2017 ఏప్రిల్‌లో సిబిఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేససిందని గుర్తు చేశారు. 2019 ఏప్రిల్‌లో సిబిఐ ఆయనను విచారణ జరపడానికి అనుమతి ఇవ్వాలని సిబిఐ లోక్‌సభ స్పీకర్‌ను కోరిందనీ, 2020 డిసెంబరులో సువేందు అధికారి బిజెపిలో చేరారనీ, ఇక తరర్వాత సిబిఐకి స్పీకర్ నుండి ఎలాంటి అనుమతీ లభించలేదని రమేశ్ విమర్శించారు. అదేవిధంగా టిఎంసి నాయకుడు తపస్ రాయ్‌పై కూడా ఈ ఏడాది జనవరిలో ఇడి దాడులు చేసిందనీ మార్చి నాటికి ఆయన కూడా బిజెపిలో చేరిపోయారనీ విమర్శించారు. ''సువేందు అధికారి బిజెపిలో చేరడానికి కొద్ది నెలల ముందు తపస్ రాయ్‌పై విమర్శలు చేశారు, ఆయన మున్సిపల్ రిక్రూట్‌మెంట్ అవినీతిలో కూరుకుపోయారని విమర్శించారు, కానీ రాయ్ బిజెపిలో చేరాక ఆ అవినీతి ఆరోపణలన్నీ చెరిగిపోయాయి అని రమేశ్ విమర్శించారు.

## నేడు ఛలో బస్ భవన్

ఇయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఎస్.బాబు, ఇ.వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యాయమైన హక్కులు సాధించేందుకు మంగళవారం తలపెట్టిన ఛలో బస్ భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ.వెంకన్నలు పిలుపునిచ్చారు. గత 10 సంవత్సరాల నుండి టిఎస్ ఆర్‌టిసి కార్మికులు కట్టు బానిసలుగా దిన దినం ఒక గండంగా తమ విధులను నిర్వహిస్తున్నారని అన్నారు. 70 సంవత్సరాల ఆర్‌టిసి చరిత్రలో డ్రైవర్, కండక్టర్, ఉద్యోగులను విభజించి పాలించు విధానాన్ని ఎం.డి. శ్రీకారం చుట్టారని విమర్శించారు. ఈ వివక్ష విధానాన్ని ఆర్‌టిసి కార్మిక వర్గమంతా ముక్తకంఠంతో ఖండించి, తిప్పి కొట్టడానికి ముందుకు రావాలని కోరారు. ఒక వైపు చాలిచాలని వేతనాలు, మరో వైపు మానసిక వేధింపులు, ఇంకో వైపు అధిక పనిభారాలు తట్టుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

తమ కష్టాలను ఎవరికి చెప్పుకోవాలో దిక్కు లేక అనునిత్యం నరకయాతన అనుభవిస్తున్న కార్మిక వర్గం ఒక్కసారి పిడికిలి భిగించి, బానిస సంకెళ్లను తెంచేందుకు ఉద్యమించినప్పుడే న్యాయమైన హక్కులు సాధించుకుంటామని అన్నారు. అందుకే ఛలో బస్ భవన్ కార్యక్రమంలో ప్రతి కార్మికుడు కథం తొక్కాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణలో సివిల్ జడ్జి పోస్ట్ స్థానిక అర్హతపై సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ :** స్థానిక బార్ అసోసియేషన్‌లో నమోదైన న్యాయవాదులు మాత్రమే తెలంగాణలో సివిల్ జడ్జి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై వాదనలు వినేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. ఈ నిబంధనను సమర్థిస్తూ ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో నమోదైన న్యా యవాది వి.రాకేశ్ రెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనను సివి ల్ జడ్జి పోస్టుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనాన్ని ఆయన ఆశ్రయించారు. సివిల్ జడ్జి పోస్టు కోసం పిటిషనర్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, స్థానిక బార్ అసోసియేషన్ నిబంధన ఆధారంగా ఆ దరఖాస్తును తిరస్కరించవద్దని ఈ నెల 17 న సు ప్రీం కోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తరువులు జారీ చేసింది.

## హనుమాన్‌నగర్ రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మౌలాలి డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కాలనీ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలకు దారి తీస్తున్న రోడ్డు మరమ్మత్తు పనులను పూర్తి చేయాలని కాలనీ వాసులు జిహెచ్ఎంసి మల్కాజిగిరి ఈఈ లక్ష్మ ణ్‌కు వినతిపత్రం ద్వారా కోరారు. ఇటీవలి వర్షాలతో రోడ్లు మరింతగా దెబ్బ తిన్నాయని, ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయన్నారు. చిన్న పాటి చినుకు పడినా గుంతల్లో నీరు నిండి కనపడక పోవటం వల్ల ప్రమాదాలు ఏర్పడుతున్నాయన్నారు. హనుమాన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ రాజు, సురేష్, న్యూ ఫోరం బెటర్ మల్కాజిగిరి ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణు, మోహన్ యాదవ్, సతీష్, మధు, కాలనీ వాసులు గణేష్, శ్రావణ్, క్రాంతి, బాలాజి, నరేష్ తదితరులు ఈఈని కల్సిన వారిలో ఉన్నారు.

# భయం గుప్పెట్లోంచి పోలింగ్ కేంద్రాలకు..

30 ఏళ్ళ తర్వాత ఉత్సాహంగా ఓటెత్తిన బారాముల్లా

**బారాముల్లా :** బారాముల్లా : జమ్మూ కశ్మీరు నిత్యం భయంగుప్పెట్లో మగ్గిపోతూ ఉంటుంది. అక్కడి ఓటర్లు పోలింగ్ కేంద్రాల మొహం చూసి దాదాపు 30 ఏళ్ళు దాటిపోయింది. ఈ పరిస్థితులమధ్య 18వ లోక్‌సభ ఎన్నికల్లో ఐదో దశ పోలింగ్ ప్రక్రియలో భాగంగా సోమవారంనాడు జమ్మూకశ్మీలోని బారాముల్లా ప్రజలు ఓటు వేసేందుకు బయటకు వచ్చారు. బారాముల్లా నియోజకవర్గం లో మొత్తం 22 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నేషనల కాన్ఫరెన్స్ కు చెందిన ఒమర్ అబ్దుల్లా సహా రాజకీయ నాయకుడుగా మారిన వేర్పాటువాది, పీపుల్స్ కాన్ఫరెన్స్ అధినేత సజ్జాద్ లోనే బరిలో ఉన్నారు. అవామీ ఇత్తెహద్ పార్టీకి రషీద్ బరిలో దిగడంతో పోటీ రసవత్తరంగా మారింది. పీపుల్స్ డెమోక్రసీ పార్టీ అభ్యర్థి, రాజ్యసభ విశ్రాంత సభ్యుడు ఫయజ్ మీర్ కూడా పోటీలో ఉన్నారు. ఎన్నికల సంఘం సమాచారంప్రకారం బారాముల్లాలో 17.32 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 18 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మొదటి రెండు గంటల వ్యవధినే 8 శాతం పోలింగ్ జరిగింది. ''గతంలో ఓటే వేసే అవకాశం నాకు రాలేదు, ఇప్పుడు వచ్చింది, దేశాభివృద్ధికోసం పనిచేసే ప్రభుత్వం ఏదో ఎంపిక చేసుకోవడం కోసం ఈరోజున నేను ఓటే వేశాను'' అని 52 ఏళ్ళ వయసుగల ఘులామ్ క్వాదిర్ దర్జీ అన్నారు. ఆయన సోపోర్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో కావాల్సినన్ని ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తుందని నమ్ముతున్నాం, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కావాలి అని విశ్రాంత ప్రభుత్వం ఉద్యోగి దర్జీ అన్నారు. బారాముల్లా లోక్‌సభ నియోజకవర్గంలోని దలినా గ్రామంలో ఉన్న ఒక పోలింగ్ బూత్ వద్ద భారీ క్యూలో ఆయన ఓపికగా ఓటు వేసేందుకు తన వంతు వచ్చేవరకూ ఎదురుచూశారు. ఈ ప్రాంతంలో వేర్పాటువాదులు బెదిరింపులు, బహిష్కరణ పిలుపులూ గతంలో వేర్పాటువాదులు జారీ చేయడంవల్ల ఇన్నేళ్ళుగా ఓటర్లు ఓటు హక్కు ఉపయోగించుకునేందుకు దూరంగా ఉండిపోయారు. ఇప్పుడు ఓటర్లు స్పందించారు. అదేవిధంగా ఈ క్యూ లైన్స్‌లో నిలబడిన నలభైయేళ్ళు వయసు దాటిన జావేద్ అహ్మద్ గురూ, మహ్మద్ సుల్తాన్ భట్, అబ్దుల్ రషీద్‌లు కూడా తమ ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. ''మేం అందరం మొదటిసారి ఓటేస్తున్నాం, మూడు దశాబ్దాలు తర్వాత ఈ అవకాశం, మాకు అత్యుత్తమమైన భవిష్యత్ కోసం నిర్ణయించుకుని ఓటు వేసేందుకు బయటకు వచ్చాం'' అని గురూ అన్నారు. అదేవిధంగా 18 ఏళ్ళు వయసుగల మీర్ మసూమ్ సుల్తాన్ కూడా మొదటిసారి ఓటు హక్కు ఉపయోగించుకున్నవారిలో ఉన్నాడు. తమ తరపున మాట్లాడేవ్యక్తిని జైలు నుండి విడిపించడానికే ఓటు వస్తున్నాననీ ఆ యువకుడు అన్నారు. ''ఆయన మాకోసం అసెంబ్లీలో మాట్లాడతారు, అందుకే మావోటు ఆయనను బయటకు రప్పించడానికి ఉపయోగపడుతుంది'' అని ఆ యువకుడు చెప్పాడు. ఇంతకీ జైలులో ఉన్నది ఎవరంటే అవామీ ఇత్తెహద్ పార్టీ (ఎఐపి) ఛైర్మన్ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్. ఆయన ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు. 2019లో టెర్రిరిస్టులకు నిధులు సమకూరుస్తున్నారని ఆరోపణలపై ఎన్ఐఎ ఆయనను అరెస్టు చేసింది.అప్పటినుండీ ఆయన తీహార్ జైలులో ఉన్నారు. జమ్మూ కశ్మీరులో వేసవి రాజధాని శ్రీనగర్‌కు 55 కి.మీ దూరలో ఉన్న సోపోర్‌లో ఆ సమీప ప్రాంతాలలో వేర్పాటు వాదులు ఇన్నాళ్ళు జులుం చేశారు. 370వ అధికరణ రద్దు చేశాక మొదటిసారి జరిగిన అతిపెద్ద పోలింగ్ ప్రక్రియ ఈ లోక్‌సభ ఎన్నికలే. పాకిస్థాన్ అనుకూల మద్దతుదారుడు గిలానీ 2021లోనే మరణించాడు. ఆయన జమ్మూ కశ్మీరులో 30 ఏళ్ళపాటు వేర్పాటువాద ఉద్యమం నడిపాడు.

క్రీడ

# క్వాలిఫయర్-1 వర్షంతో రద్దయితే?



ఐపీఎల్ 2024 సీజన్ తుది దశకు చేరుకుంది. 70 మ్యాచ్ల లీగ్ దశ విజయవంతంగా ముగిసింది. మంగళవారంతో ప్లే ఆఫ్స్ తెరలేవనుంది. పాయింట్స్ టాప్4లో నిలిచిన కోల్కతా నైట్రైడర్స్(కేకేఆర్), సన్రైజర్స్ హైదరాబాద్, రాజస్తాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) ప్లే ఆఫ్స్ అర్హత సాధించాయి టాప్2లో నిలిచిన కేకేఆర్, ఎస్ఆర్హెచ్ మంగళవారం తొలి క్వాలిఫయర్ మ్యాచ్ ఆడనున్నాయి. బుధవారం జరిగే ఎలిమినేటర్లో రాజస్థాన్ రాయల్స్, ఆర్సీబీ తలపడనున్నాయి. ఈ రెండు మ్యాచ్లకు అహ్మదాబాద్లోని నరేంద్రమోదీ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే గత 8 లీగ్ మ్యాచ్లో మూడు వర్షంతో రద్దయ్యాయి. కేకేఆర్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరగాల్సిన చివరి మ్యాచ్ కూడా వర్షంతో తుడిచి పెట్టుకుపోయింది. ఈ క్రమంలోనే ప్లే ఆఫ్స్ మ్యాచ్లు వర్షంతో రద్దయితే ఏం చేస్తారు? అనే ప్రశ్న అభిమానులను వెంటాడుతోంది. ప్లే ఆఫ్స్ రిజర్వ్ డే ఉందా..? ఉంటే ఆ రోజు కూడా మ్యాచ్ జరగకపోతే ఫలితాన్ని ఎలా నిర్ణయిస్తారు..? సూపర్ ఓవర్స్ టై అయితే ఏం చేస్తారు అనే సందేహాలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

**ప్లే ఆఫ్స్ రిజర్వ్ డే..**

ఐపీఎల్ 2024 సీజన్లో నాలుగు ప్లే ఆఫ్స్ మ్యాచ్లకు రిజర్వ్ డే కేటాయించారు. షెడ్యూల్ తేదీల్లో వర్షంతో మ్యాచ్ రద్దయినా రిజర్వ్ డే పూర్తి మ్యాచ్ ఆడిస్తారు. అంతేకాకుండా ప్లే ఆఫ్స్ మ్యాచ్లో ఫలితాన్ని తేల్చేందుకు రెండు గంటల ఎక్స్ట్రా టైమ్ ఉంటుంది. సాధారణ లీగ్ మ్యాచ్లో ఈ టైమ్ గంటనే. కానీ ప్లే ఆఫ్సో రెండు గంటలు ఆలస్యంగానైనా ఓవర్లను కుదించి ఫలితాన్ని తేల్చే ప్రయత్నం చేస్తారు. అప్పటికీ మ్యాచ్ సాధ్యం కాకపోతే రిజర్వ్ డే పూర్తి మ్యాచ్ ఆడిస్తారు.

**రిజర్వ్ డే కూడా రద్దయితే..**

ఇక రిజర్వ్ డే కూడా వర్షం లేదా ఇతర కారణాల వల్ల మ్యాచ్ రద్దయితే.. పాయింట్స్ ప్రకారం విజేతను నిర్ణయిస్తారు. ఉదాహరణకు సన్రైజర్స్ హైదరాబాద్, కేకేఆర్ మ్యాచ్ రిజర్వ్ డే కూడా సాధ్యం కాకపోతే.. టాపర్ అయిన కేకేఆర్ ఫైనల్ చేరుతోంది.

**సూపర్ ఓవర్ టై అయితే..**

ప్లే ఆఫ్స్ మ్యాచ్లో ఇరు జట్ల స్కోర్లు టై అయితే సూపర్ ఓవర్ ఆడిస్తారు. సూపర్ ఓవర్ కూడా టై అయితే నిర్ణీత సమయంలో ఫలితం తేలే వరకు సూపర్ ఓవర్స్ నిర్వహిస్తారు. అప్పటికీ ఫలితం తేలకపోతే.. పాయింట్స్ టాప్లో ఉన్న టీమ్ను విజేతగా ప్రకటిస్తారు. అహ్మదాబాద్ వేదికగా జరిగే రెండు ప్లే ఆఫ్స్ మ్యాచ్లకు వర్ష సూచన అయితే లేదు.

# విధ్వంసకర ఓపెనర్ దూరం

## సన్రైజర్స్ హైదరాబాద్తో తలపడే కేకేఆర్ తుది జట్టు ఇదే!



ఐపీఎల్ 2024 సీజన్లో కోల్కతా నైట్రైడర్స్(కేకేఆర్) కీలక పోరుకు సిద్దమైంది. అసాధారణ ప్రదర్శనతో టేపదర్శనతో టాపర్గా నిలిచిన కేకేఆర్.. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా జరిగే క్వాలిఫయర్ 1లో సన్రైజర్స్ హైదరాబాద్తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్లో విజయం సాధించి ఎలాంటి రిస్క్ లేకుండా ఫైనల్ చేరాలని కేకేఆర్ భావిస్తోంది. 11 మ్యాచ్లో 9 విజయాలతో పూర్తి ఆధిపత్యం చెలాయించిన కేకేఆర్.. ప్లే ఆఫ్సోనూ అదే జోరును కొనసాగించాలనుకుంటుంది. అయితే కేకేఆర్ ఆడాల్సిన చివరి రెండు లీగ్ మ్యాచ్లు వర్షం కారణంగా రద్దయ్యాయి. దాంతో ఆ జట్టుకు రెండు వారాలుగా మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా పోయింది. అంతేకాకుండా కేకేఆర్ విజయాల్లో కీలక పాత్ర పోషించిన విధ్వంసకర ఓపెనర్ ఫిల్ సాల్ట్ కీలక మ్యాచ్లకు దూరమయ్యాడు.

**ఫిల్ సాల్ట్ ఔట్..**

పాకిస్థాన్తో టీ20 సిరీస్ నేపథ్యంలో ఈ ఇంగ్లండ్ బ్యాటర్ స్వదేశం పయనమయ్యాడు. దాంతో అతని స్థానంలో కేకేఆర్ అఫ్గాన్ ఓపెనర్ రెహ్మనుల్లా గుర్బాజ్తో బరిలోకి దిగే అవకాశం ఉంది. ఈ ఒక్క మార్పు మినహా తుది జట్టులో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. పిచ్కు అనుకూలించే అహ్మదాబాద్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుండటం కేకేఆర్కు కలిసొచ్చే అంశం. అంతేకాకుండా మెంటార్గా గౌతమ్ గంభీర్ ఉండటం ఆ జట్టుకు వెయ్యి ఏనుగుల బలం. పరిస్థితులకు తగ్గట్లు వ్యూహాలు రచించడంతో గంభీర్ దిట్ట. అతని మార్గదర్శకత్వంలోనే కేకేఆర్ వరుస విజయాలతో టేబుల్ టాపర్గా నిలిచింది. లీగ్ దశలో సన్రైజర్స్ హైదరాబాద్తో జరిగిన రెండు మ్యాచ్లోనూ కేకేఆర్ విజయం సాధించింది.

**భీకరంగా బ్యాటింగ్ లైనప్..**

ఫిల్ సాల్ట్ దూరమైనా కేకేఆర్ బ్యాటింగ్ లైనప్ భీకరంగా ఉంది. సునీల్ నరైన్, వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్, నితీష్ రాణా, ఆండ్రీ రస్సెల్ సూపర్ ఫామ్లో ఉన్నారు. రింకూ సింగ్ కూడా తన బ్యాటింగ్కు పని చెప్పితే కేకేఆర్కు తిరుగుండదు. హర్షిత్ రాణా, మిచెల్ స్టార్క్, ఆండ్రీ రస్సెల్తో పేస్ విభాగం కూడా పటిష్టంగా ఉంది. స్పిన్నర్లు సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తీలకు తిరుగు లేదు. తుది జట్టులోని ఆటగాళ్లంతా సమష్టిగా రాణిస్తే కేకేఆర్ సునాయస విజయాన్ని అందుకోనుంది. వైభవ్ అరోరాను ఇంపాక్ట్ ప్లేయర్గా ఆడించే ఛాన్స్ ఉంది. హెడ్ టు హెడ్ రికార్డ్సోనూ సన్రైజర్స్పై కేకేఆర్దే పై చేయి కావడం గమనార్హం. ఇరు జట్లు ఇప్పటి వరకు 29 మ్యాచ్లు ఆడగా.. కేకేఆర్ 17, సన్రైజర్స్ 9 మ్యాచ్లో గెలుపొందాయి. ఓ మ్యాచ్ ఫలితం తేలలేదు.

రీల్



## చాలా సంతోషాన్ని ఇచ్చింది: అల్లు అర్జున్

దర్శకుల దినోత్సవంలో అల్లు అర్జున్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ 'పనిలో క్షణం తీరిక లేకుండా ఉండే దర్శకులు తమలో ఐక్యత ఉండాలనే ఉద్దేశంతో ఒక్కచోటికి చేరి, ఈ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ప్రతి ఏడాదీ వేడుకని ఇంతే ఉత్సాహంగా జరుపుకోవాలని కోరుకుంటున్నాను. ఈ స్ఫూర్తితో సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్టలోని వివిధ విభాగాలు కూడా ముందుకొచ్చి వేడుకలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఉంది' అని బన్నీ తెలిపారు. అల్లు అర్జున్ ఇంకా మాట్లాడుతూ.. 'దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని దర్శకులు దినోత్సవాన్ని నిర్వహించుకోబోతున్నామని ప్రకటించినప్పుడు తనకెంతో సంతోషం కలిగించింది. ఈ సందర్భంగా దాసరితో తమకున్న అవినాభావ సంబంధాన్ని బన్నీ గుర్తు చేసుకున్నారు. ఈ వేడుకలో దర్శకులు అనిల్ రావిపూడి, శ్రీరామ్ ఆదిత్య, శైలేష్ కొలను లాంటి యువ దర్శకులు తమ స్టెప్పులతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

## నాగచైతన్య సినిమాలో తమిళ హీరో

విరూపాక్ష సినిమాతో పేరు తెచ్చుకున్న కార్తీక్ దండుతో అక్కినేని నాగ చైతన్య హీరోగా ఓ ప్రాజెక్ట్ వస్తున్న సంగతి తెలిసిందే. ఐతే, ఈ సినిమాలో తమిళ హీరో విజయ్ సేతుపతి కూడా నటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విజయ్ సేతుపతి కోసం కార్తీక్ దండు ఓ కీలక పాత్రను డిజైన్ చేశాడట. ఆయన పాత్ర నెగిటివ్ షేడ్స్ తో ఉంటుందని టాక్. ఈ పాత్రకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుందట. అన్నట్టు పూజా హెగ్డే ఈ చిత్రంలో నాగ చైతన్యతో కలిసి నటించబోతోంది. కాకపోతే, పూజా హెగ్డే ఈ చిత్రంలో నటిస్తోంది అని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అక్టోబర్ నుంచి ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర (SVCC) నిర్మించబోతుంది. కాగా ప్రస్తుతం అక్కినేని నాగ చైతన్య హీరోగా సాయి పల్లవి హీరోయిన్ గా చందూ మొండేటి డైరెక్షన్ లో రాబోతున్న భారీ చిత్రం తండేల్. ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబర్ 20న రిలీజ్ కాబోతుంది.





## నిర్మాతల వేధింపులపై పాయల్ స్పందన

ఆర్ఎక్స్ 100 ఘనవిజయం తర్వాత పాయల్ రాజ్పుత్ కి ఎంతో పేరు తెచ్చిపెట్టిన చిత్రం మంగళవారం. ఐతే, పాయల్ రాజ్ పుత్ గతంలో రక్షణ అనే ఓ సినిమా చేసింది. ఇప్పుడు తాజాగా ఈ సినిమా వివాదం అయ్యింది. ఈ సినిమా విషయంలో తనకు జరుగుతున్న అన్యాయాన్ని కూడా పాయల్ రివీల్ చేసింది. అసలేం జరిగింది అంటే.. ఈ సినిమాకు సంబంధించి పాయల్ రాజ్ పుత్ కు ఇంకా కొంత పేమెంట్ పెండింగ్ లో ఉంది. ఐతే, ఆ డబ్బు ఇవ్వకుండానే, తనను ప్రచారానికి రమ్మని బలవంతం చేస్తున్నారని పాయల్ రాజ్ పుత్ తెలిపింది. కాగా ప్రస్తుతం తన కాల్షీట్లు అందుబాటులో లేవని పాయల్ రాజ్పుత్ చెప్పడంతో.. ఆ చిత్ర నిర్మాతలు ఆమెను అసభ్య పదజాలంతో దూషించారట. బ్యాలెన్స్ అమౌంట్ ఇస్తే డిజిటల్ ప్రమోషన్ చేయడానికి సిద్ధమని పాయల్ చెప్పినప్పటికీ వారు అంగీకరించలేదని పాయల్ చెబుతుంది. పైగా టాలీవుడ్ నుంచి బ్యాన్ చేస్తామంటూ పాయల్ రాజ్పుత్ ను వారు బెదిరిస్తున్నారట. మరి ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని పాయల్ కోరుతుంది.



## పవన్ 'ఓజీ' పై నటి క్రేజీ కామెంట్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో, యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ ఓజీ. ఈ చిత్రంలో నటి శ్రియా రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఐతే, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ సినిమా గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెప్పింది. 'టబు నా అభిమాన నటి. ఓ తెలుగు చిత్రంలో టబు కోసం రాసిన పాత్రను నేను చేస్తున్నాను. మొదట టబు పేరే స్క్రిప్ట్లో రాశారు. చివరకు ఆ పాత్ర నాకు వచ్చింది, ఆ అవకాశం రావడం నాకు దక్కిన చాలా పెద్ద విజయం అని నేను భావిస్తున్నాను' అని ఓజీ సినిమా గురించి ఇన్ డైరెక్ట్ గా ఆమె చెప్పుకొచ్చింది. కాగా ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తుండగా, ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం డివివి ఎంటర్ టైన్మెంట్ పై డివివి దానయ్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి మ్యూజికల్ సెన్సేషన్ థమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. పార్ట్1 రిలీజ్ తర్వాత రెండో పార్ట్ కూడా ఉండే అవకాశం ఉంది. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ గ్యాంగ్ స్టర్గా నటిస్తున్నారు.

ప్యాసింజర్ రైళ్ల భద్రత..

## సమయపాలన నిశితంగా పర్యవేక్షించాలి

దక్షిణ మధ్య రైల్వే జిఎం జైన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమయపాలన, భద్రతను నిర్ధారించడానికి రైలు కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షించడానికి ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు అవసరమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. సికింద్రాబాద్ రైలు నిలయంలో జోన్లోని రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రత, సమయపాలనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ ఆర్. ధనంజయులుతో పాటు ఆ రు డివిజన్ల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. అరుణ్ కుమార్ జైన్ జోన్లో రైలు రాకపోకల భద్రతపై సమీక్షించారు. రైళ్లసురక్షిత ంగా నడిపేందుకు భద్రతాకు సంబందించిన విధివిధానాలను కచ్చితంగా పా టించాలని ఆయన అధికారులను ఆదేశించారు. లోకో పైలట్లు, అసిస్టెంట్ లో కో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు , పర్మినెంట్ వే మెయింటెనెన్స్ సిబ్బంది, రన్నింగ్ సిబ్బందిని క్రమం తప్పకుండా భద్రతపై కౌన్సిల్ నిర్వహించాలని ఆయన సూ చించారు. పని ప్రదేశాలలో భద్రతా అవసరాలను తప్పకుండా పాటించేలా త రచుగా క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

## ఆర్థిక సామాజిక అసమానతలపై పోరాడాలి

ఆర్ కృష్ణయ్య పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదరికం, దరిద్రం, నిరుద్యోగం, నిరక్షరాస్యత లేని దేశంగా, ఆకలి అజ్ఞానం ఆర్థిక సామాజిక అసమానతలు, దోపిడి, పీడన వివక్ష , అణచివేతలు లేని దేశంగా భారత దేశాన్ని తీర్చిదిద్దాలని అందుకు విద్యార్థులు యువకులు పోరాటం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. నేడు రవీంద్ర భారతీజరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ దే శానికి స్వతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడిచిన ఇంకా 48 శాతం మంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారన్నారు. అభివృద్ధి ఫలాలు ఈ వర్గాలకు అందడం లేదని, దేశ సంపద ఒక శాతం ప్రజల చేతుల్లోనే 95 శాతం సంపద కేంద్రీకృతం అయిఉందన్నారు. దీనిని వికేంద్రీకరణ చేసే విధానాలు కావాలి. ఒక పెద్ద బంగ్లాలో 40 రూములుంటే ఇద్దరు ముగ్గురు ఉన్నారు. ఇ ంకొొక వైపు ఇళ్ళు లేక అద్దె ఇంట్లో ఒక గదిలోనే ఆరు మంది గుడిసెలలో ఉన్న తీరు ఉంది. ఈ అసమానతలు తొలగిపోవాలని అందుకోసం ప్రభుత్వ విధానాలు మార్చే వ్యవస్థ కోసం విద్యార్థులు, యువత పోరాటాలు చేయాల ని పిలుపునిచ్చారు. ఇంకోపక్క మహిళలపై, బాలలపై అత్యాచారాలు, బలహీనులపై బలవంతుల దోపిడి, పీడన, సమాన హక్కుల సహకారం అవ్వకపోవడంపై కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో టోకరా

జీరో జిఎస్టితో కోట్లలో వ్యాపారం

తెలంగాణ మొత్తం ఇలాగే ఉంటే ప్రభుత్వం కొనసాగేదే ఎలా?



**ప్రజాపక్షం/మంచిర్యాల క్రైం :** ప్రభుత్వానికి వెన్నెముక లాంటిది పన్ను, ప్రతి ప్రభుత్వం పన్నులపై ఆధారపడి ప్రజా సంక్షేమం, పాలన సాగిస్తుంటుందని. కానీ అధికారుల నిర్లక్ష్యం, కాసుల కక్కుర్తితో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. వాహనానికి ఇంధనం ఎలా అవసరమో ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే రాబడి అంతే అవసరం. మంచిర్యాల పట్టణంలో ఎన్నో షాపింగ్ మాల్స్, మరెన్నో వ్యాపార సముదాయాలు ఉన్నాయి. అందులో కొంత మంది వ్యాపారులు చట్ట ప్రకారం జిఎస్టి బిల్లులతో విక్రయాలు చేస్తుంటే మరి కొందరు కేవలం నామ మాత్రపు బిల్లులు ఇస్తు జీరో బిల్లు తో లక్షల్లో విక్రయాలు కొనసాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మార్కెట్ రోడ్డు లోని గుజరాత్ ఫ్యాషన్ లో రోజుకు సుమారు 10 లక్షల వ్యాపారం సాగుతుంటుంది. సదరు షాపు యాజమాని తన మొత్తం వ్యాపారాన్ని జీరో జిఎస్టి తో విక్రయాలు కొనసాగిస్తున్నారు. జిఎస్టి లెక్కల ప్రకారం ఒక్క షాపులోనే సంవత్సరానికి ప్రభుత్వానికి లక్షల టాక్స్ సున్నం పెడుతున్నారు అంటే మంచిర్యాలలోని వివిధ వ్యాపారుల సంగతి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్టం మొత్తం మీద ఇలాంటి షాపుల లెక్కలు కడితే కొన్ని వందల కోట్ల టాక్స్ ప్రభుత్వానికి రాకుండా దొంగ దారిన పడుతుంది. ప్రభుత్వానికి రాబడి రూపంలో అందించాల్సిన వనరులు అధికారుల నిర్లక్ష్యం, కాసుల కక్కుర్తి వలన నష్టపోతుందని అర్థం అవుతుంది. ఉద్యోగం పట్ల తమ విధేయతను చాటాల్సిన అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో అధికారుల పని తీరుపై ప్రత్యేక నిఘా ప్రభుత్వానికి సరైన సమాచారం అందించేది. ఉద్యోగం పట్ల నిర్లక్ష్యం వహించే వారి పై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించేది. కానీ ప్రస్తుతం వారి పై నిఘా కొరవడడంతో పాటు ఉద్యోగస్తులు కాసులకు కక్కుర్తిపడి వ్యాపారుల జీరో దందాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి అధికారులు తమ విధేయతను చాటి సరైన పన్నును వసూలు చేస్తే ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంక్ అప్పు, ప్రభుత్వఆస్తుల పై ఆధారపడాల్సిన అవసరం ఉండదు అనేది ఆర్థిక వేత్తల అభిప్రాయం.

**ఒకే వస్తువుకు రెండు ధరలు.. జిఎస్టితో అయితే ఒక ధర.. జిఎస్టి లేకుంటే మరో ధర**

వ్యాపారస్తులు తమ తమ వ్యాపారం అభివృద్ది చేసుకునేందుకు తక్కువ ధరకు వస్తువులను విక్రయిస్తున్నారు. తక్కు వ ధరకు విక్రయించే వస్తువులకు జిఎస్టి బిల్లులు ఇవ్వ డం లేదని కొనుగోలుదారుల ఆరోపణ. ఒకే కంపెనీకి చెం దిన ఒకే వస్తువుకు జిఎస్టి బిల్లుతో అయితే ఒక ధరకు, జిఎస్టి బిల్లు లేకుండా అయితే మరో ధరకు విక్రయిస్తూ కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

**కొనుగోలుదారుల్లో చైతన్యం తీసుకురావాలి**

కొనుగోలుదారుల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి కొనుగోలుపై బిల్లులు తీసుకునే విధంగా ప్రజలను ప్రభుత్వం చైతన్యం చేయాలి. ప్రజల్లో అవగాహన కలిగే విధంగా కార్యక్రమాలు చేపట్టినట్లయితే జీరో దందాలను అరికట్టేందుకు వీలు అవుతుందని ఆర్థిక తత్వవేత్తలు వారి అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం జీరో దందా నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ధార్మిక సంస్థలకూ రాజకీయ రంగు?



**కోల్కతా:** పశ్చిమ బెంగాల్లో ఎలాగైనా పట్టు సంపాదించాలన్న కోరికతో బిజెపి ఎలాంటి మార్గాన్ని అనుసరించడానికైనా వెనుకాడడం లేదు. చివరికి ధార్మిక సంస్థలకు కూడా రాజకీయ రంగు పులిమింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి మమతా బెనర్జీ పురూలియాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో చేసిన ఆరోపణలను ఈ సందర్భంగా పేర్కోవాలి. ఆమె విమర్శల ప్రకారం, పశ్చిమ బెంగాల్లవోని రెండు ప్రముఖ ధార్మిక సంస్థల్లోని సన్యాసులంతా బిజెపి సూచనలు, ఆదేశాల మేరకు పని చేస్తున్నారు. వీటిలో రామకృష్ణ మిషన్ ఒకటి. భారత సేవాశ్రమ సంఘం రెండోది. ఈ రెండు సంస్థలకు చెందిన సన్యాసులు, కార్యకర్తలు బిజెపికి ఓటు వేయాలని భక్తులకు సూచిస్తున్నారన్నది మమత ఆరోపణ. వివిధ ప్రాంతాల నుంచి ప్రార్థన కోసం వచ్చే వారిని ప్రభావితం చేసేందుకు వీరు ప్రయత్నిస్తున్నారని ఆమె అంటున్నారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ వంటి సంస్థలను బిజెపి తన ఎన్నికల ప్ర యోజనాలకు వాడుకుంటున్నదనేది బహిరంగ రహస్యం. ఇప్పుడు రామకృష్ణ మిషన్ వంటి సంస్థలను కూడా వదలకుండా, సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేసే విధంగా ఒత్తిడి తీసుకొచ్చిందని అంటున్నారు. అయితే, ఈ రెండు సంస్థలు మమత ఆరోపణలను తోసిపుచ్చాయి. ఆధ్యాత్మిక కార్యకలాపాలను నిర్వహించే తనకు రాజకీయాల పట్ల ఆసక్తిగానీ, అవసరంగానీ లేవని స్పష్టం చేశాయి. కానీ, హిందూ మ త పరిరక్షకులుగా తమను తాము ప్రకటించుకుంటున్న బిజెపి నేతలు ఇలాంటి సంఘాలతో పరోక్షంగా ప్రచారం చేయిస్తారనడంలో అనుమానం లేదు.

# డ్యూరబుల్స్లో క్రాంప్టన్ ముందంజ

డిజెఎస్ఐ స్కోర్లో ర్యాంకింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విస్తృత శ్రేణి శక్తి ఆదా, సుస్థిరమైన వినియోగదారు ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందిన క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, తన అత్యుత్తమ పర్యావరణ, సామాజిక, పాలనాపనితీరుకు సంబంధించి డౌ జోన్స్ సస్టైనబిలిటీ ఇండెక్స్లో అగ్రస్థానాన్ని పొందింది. క్రాంప్టన్ ప్రపంచవ్యాప్తంగా 94వ శాతంలో ఉంది. హౌస్హోల్డ్ డ్యూరబుల్స్ సెక్టార్లో తన సహ చరులలో 7వ స్థానాన్ని పొందింది. ఈ రేటింగ్తో క్రాంప్టన్ అంకితభావాన్ని, పరిశ్రమలో అగ్రగామిగా తన స్థానాన్ని మరింత స్థిర పర్చుకుంది. 1999లో స్థాపించబడిన డౌ జోన్స్ సస్టైనబిలిటీ బహిరంగ వర్తకం చేసే వేల కొద్దీ కంపెనీల సుస్థిరత పనితీరును అంచనా వేయడానికి ప్రమాణంగా పనిచేస్తుంది. డిజెఎస్ఐ కఠినమైన మూల్యాంకన ప్రక్రియలో దీర్ఘకాలిక సుస్థిరత్వంపై దృష్టి సారించి, ఆర్థిక, పర్యావరణ, సామాజిక ప్రమాణాల ఆధారంగా కంపెనీలను అంచనా వేయడం ఉంటుంది. ఉదాహరణకు డిజెఎస్ఐ వరల్డ్ దీర్ఘకాలిక ఈఎస్జి ప్రమాణాల ఆధారంగా ఎస్ అండ్ పి గ్లోబల్ బ్రాడ్ మార్కెట్ ఇండెక్స్లోని అతిపెద్ద 2,500 కంపెనీలలో టాప్ 10 శాతాన్ని గుర్తించింది. క్రాంప్టన్ డిజెఎస్ఐ స్కోర్ ఈ సంవత్సరం తన రేటింగ్లలో పర్యావరణ సుస్థిరత, ఉత్పత్తి స్టీవార్డ్షిప్, అధిక ప్రభావ సామాజిక బాధ్యత కార్యక్రమాలు, వైవిధ్యం, ఉద్యోగుల సంక్షేమం, మానవ మూలధన అభివృద్ధి, పటిష్ఠ పాలనావిధానాలు వంటి కీలకమైన రంగాలలో భారీ మెరుగుదలలను నివేదించింది. ఈ రేటింగ్పై క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ ఎం.డి, సిఈఓ ప్రోమీత్ ఘోష్ మాట్లాడుతూ తాము క్రాంప్టన్లో చేసే పనికి సుస్థిరత్వం ప్రాథమికమైందన్నారు. అందుకే తాము వాటి ప్రధాన శక్తి సామర్థ్యంతో ఉత్పత్తులను డిజైన్ చేసి తయారు చేస్తామన్నారు. ఐకానిక్ ఫ్యాన్లు మొదలుకొని మన్నికైన ఎల్ఈడి లైటింగ్ వర కు, క్రాంప్టన్ ఉత్పత్తులు శక్తి వినియోగాన్ని తగ్గించడానికి కట్టుబడి ఉందన్నారు. మరింత సుస్థిర భవిష్యత్తు కోసం మా సామూహిక సాధనలో మా ఉద్యోగులు, కస్టమర్లు, వ్యాపార భాగస్వాములను భాగస్వామ్యం చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

# 'ఆయన కాంగ్రెస్ పోరాట సిపాయి'

అధీర్ రంజన్ పై ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ప్రశంసలు



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్ పిసిసి అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి కాంగ్రెస్ పార్టీ పోరాట సిపాయి అని ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ప్రశంసించారు. టిఎంసి అధినేత, సిఎం మమతా బెనర్జీని నమ్మలేమని, ఆమె బిజెపితో కూడా వెళ్లవచ్చని ఇటీవల అధీర్ రంజన్ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్ణయాలు తీసుకునేది తాను లేదా కాంగ్రెస్ అధిష్టానం అని, ఇష్టం ఉంటే ఉండొచ్చు లేదా లేదు అని ఆయన అన్నారు. దీంతో పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ కార్యాలయం ఎదుట మ ల్లిఖార్జున ఖర్గే ఫోటోపై గుర్తు తెలియని వ్యక్తులు నల్ల రంగు పూసారు. ఈ నేపథ్యంలో ఖర్గే మాట్లాడుతూ అధీర్ రంజన్ చౌదరీ తమ పోరాట సిపాయి అని, పశ్చిమ బెంగాల్లో ఆయన తమ నాయకుడు అని ఒక వార్తా సంస్థతో అన్నారు. వామపక్షాలతో కాంగ్రెస్ పొత్తుతో ఉపయోగం లేదని కొందరు తృణమూల్ కాంగ్రెస్ నేతలు చేసిన వాఖ్యలపై ఆయన స్పందిస్తూ పశ్చిమబెంగాల్లో వామపక్షాలతో కూటమిగా వెళ్ళాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసు కున్నదని, ఆ విధంగానే తాము ముందుకు సా గుతున్నామని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ పి సిసి కార్యాలయం వద్ద ఖర్గే ఫోటోలకు నల్ల రంగు పూసిన ఘటనను కాంగ్రెస్ తీవ్రంగా ప రిగణిస్తోందని, ఇది పూర్తిగా క్రమశిక్షణా రా హిత్యమైనదని, దీనిని సహించేది లేదని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ తెలిపారు. వాస్తవ నివేదికను తమకు సమర్పించాలని ఆ రాష్ట్ర ఎఐసిసి ఇన్ఛార్జ్ ప్రధాన కార్యదర్శిని ఆదేశించినట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.